

నేటి దినపత్రిక సూర్య



www.suryaa.com | సంపుటి 11 | సంచిక 109
మంగళవారం | 13 ఫిబ్రవరి 2018 | విజయవాడ | పేజీలు 12+12 | వెల: రూ. 5.00
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం
శ్రీ హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయనం, శిశిర ఋతువు, మాఘ మాసం, బహుళ పక్ష తిథి : త్రయోదశి రా.7.54, ఉత్తరాషాఢ తె.5.04, వర్జ్యం ఉ.11.23 నుంచి 1.09 వరకు,
రాహుకాలం: మ.3.00 నుంచి 4.30 వరకు; దుర్ముహూర్తం: ఉ.8.24 నుంచి 9.12 వరకు, తిరిగి రా.10.46 నుంచి 11.36 వరకు, సూర్యోదయం : ఉ.6.48 గం; సూర్యాస్తమయం: సా. 6.13 గం.


తన మస్కట్ పర్యటనలో భాగంగా అత్యంత పురాతన శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భారత ప్రధాని నరేంద్ర మోడీ


కర్నాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్న రాహుల్ గాంధీ, ఓ చిన్న హోటల్‌లో పకోడీలు తిని టీ తాగుతున్న దృశ్యం. చిత్రంలో సిద్ధరామయ్య తదితరులు


స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఒకేసారి 15 వేల మందితో రోడ్లను ఊడ్చి గిన్నిస్ రికార్డును సాధించిన హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్. చిత్రంలో కేటీఆర్, నాయిని తదితరులు

శివోహం


పాఠకులు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు మహాశివరాత్రి శుభాకాంక్షలు
– సూర్య యాజమాన్యం


ప్రత్యేక కథనం - 9లో

నాడు మనది స్వాతంత్ర్య పోరాటం
నేడు ఉనికి పోరు

- రాష్ట్ర ప్రయోజనాల పోరాటం ఇప్పటి చరిత్ర
- కేంద్రానికి మనం సహకరించాం- మనకు కేంద్రం సహకరించాలి
- నవ్యాంధ్రలో 116రోజుల జలసంరక్షణ ఉద్యమం
- నీరు-ప్రగతి, వ్యవసాయంపై టెలికాన్ఫరెన్స్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి : స్వాతంత్ర్యం కోసం పోరాడటం గత చరిత్ర అయితే రాష్ట్రప్రయోజనాల కోసం పోరాడటం ప్రస్తుత చరిత్ర అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. నీరు-ప్రగతి, వ్యవసాయంపై ఆయన జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మూడున్నరేళ్లుగా కేంద్రానికి అన్ని విధాలా సహకరించామని, జీఎస్టీ, నోట్లరద్దు వంటి పరిణామాలు తలెత్తినప్పుడు కేంద్రానికి అండగా నిలిచిన విషయాలను సీఎం గుర్తు చేశారు. విభజన వల్ల తీవ్రంగా నష్టపోయిన ఏపీకి కేంద్రం మరింత సహకారం అందించి పొరుగు రాష్ట్రాలతో సమాన స్థాయికి వచ్చే వరకూ చేయూత ఇవ్వాల్సిందేనని తేల్చి చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడుతున్న ఎంపీలందరికీ అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడం అంటే ప్రజలను ఇబ్బంది పెట్టడమేనని అన్నారు. ప్రతిపక్షం లేఖల మిగతా 6లో



మరో సర్జికల్ దాడికి వస్తే
తీవ్ర పరిణామాలు
ఇండియాను హెచ్చరించిన పాకిస్తాన్



- భారత్‌కు పాకిస్తాన్ వార్నింగ్
- విచారించకుండానే తమపై నిందలు మోపుతున్నారన్న పాక్
- సరిహద్దులు దాటవేస్తే ఊరుకోబోమని హెచ్చరిక
- సోమవారం సీఆర్పీఎఫ్ క్యాంపులోకి ప్రవేశించిన ఉగ్రవాదులు
- పాక్ ఉగ్రవాదుల మరో పన్నాగం
- శ్రీనగర్‌లోని సైనిక క్యాంపుపై దాడి
- ఉగ్రవాది హతం

ఇస్లామాబాద్ : మరోసారి సర్జికల్ స్ట్రైక్స్‌కు పాల్పడవద్దని, అలా చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని భారత్‌కు పాకిస్తాన్ వార్నింగ్ ఇచ్చింది. శనివారం కాశ్మీర్‌లో గల సుంజువాన్ ఆర్మీ క్యాంపుపై ఉగ్రవాదులు దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన భారతీయ ఆర్మీ పాకిస్తాన్‌కు చెందిన జైషే ఈ మొహమ్మద్ (జేఈఎమ్) అనే ఉగ్ర సంస్థకు ఈ దాడితో సంబంధం ఉన్నట్లు పేర్కొంది. ఈ ప్రకటనపై ఆందోళన చెందుతున్న పాకిస్తాన్ మరోసారి భారత్ నిర్దేశిత దాడులకు (సర్జికల్ స్ట్రైక్స్‌కు) దిగుతుందేమోనని భయపడుతోంది. జేఈఎమ్‌కు సుంజువాన్ క్యాంపుపై దాడికి సంబంధం ఉందన్న భారత మిలిటరీ ప్రకటనపై పాకిస్తాన్ విదేశాంగ శాఖ సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. భారత అధికారులు కావాలనే జేఈఎమ్‌ను ఈ దాడిలోకి లాగుతున్నారని ఆరోపించింది. సరైన విచారణ జరపకుండా బాధ్యతా రాహిత్యంతో ప్రకటనలు చేయడం సరి కాదని మిగతా 6లో


6లో

ఎన్నికలకు టాటా

- సంచలన ప్రకటన చేసిన బీజేపీ ఫైర్ బ్రాండ్ ఉమాభారతి
- ఇకపై ఎన్నికల్లో పోటీ చేయబోను
- పార్టీ ఏదైనా బాధ్యతలు అప్పగిస్తే మాత్రం చేస్తాను
- కార్యకర్తలకు అండగా ఉంటానన్న ఉమాభారతి

విజయ్ మాల్యాకు మరో షాక్


5లో

- బీఓసీ ఏవియేషన్‌కు 90 మిలియన్ డాలర్లు చెల్లించాల్సిందే
- తీర్పిచ్చిన బ్రిటన్ వెస్ట్ మినిస్టర్స్ కోర్టు
- కింగ్‌ఫిషర్, బీఓసీ మధ్య లీజింగ్ అగ్రిమెంట్
- చెల్లించాల్సిందేనన్న కోర్టు

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

ఏవోబీలో తుపాకుల మోత
తప్పించుకున్న ఆర్కే?

- సీలేరు సమీపంలో మావోల సమావేశం
- సమాచారం తెలుసుకుని పోలీసుల గాలింపు
- ఎదురుకాల్పులు



విశాఖపట్నం : మరో సారి ఆంధ్ర-ఒడిశా సరిహద్దులో తుపాకుల మోత మోగింది. జోడుంబా, సీలేరు ప్రాంతంలో రెండు రాష్ట్రాల పోలీసులు, మావోయిస్టులు పరస్పరం బుల్లెట్ల వర్షం కురిపించుకున్నారు. వివరాల్లోకి వెళితే, జోడుంబా, సీలేరు సమీపంలో మావోయిస్టులు పెద్ద ఎత్తున సమావేశం ఏర్పాటు చేశారనే సమాచారం అందుకున్న ఇరు రాష్ట్రాల పోలీసులు సంయుక్తంగా విస్తృతంగా గాలింపు నిర్వహించారు. కటాప్ ప్రాంతంలో ఎదురుపడ్డ రెండు వర్గాలు పరస్పర ఎదురు కాల్పులకు దిగాయి. కొన్ని గంటల పాటు జరిగిన ఈ ఎదురుకాల్పుల్లో ఎటువంటి ప్రాణ నష్టమూ జరగలేదు. ఈ కాల్పుల్లో సుమారు 50 మందికి పైగా మావోయిస్టులు పాల్గొన్నట్లు సమాచారం. వారిలో కీలక నేత ఆర్కే కూడా ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

ఫీజులేవి బాబూ?

- పెండింగ్ ఫీజు 2,158 కోట్లు
- ప్రొఫెషనల్ కాలేజీలకు శరాఘాతం
- త్రిశంకు స్వర్గంలో 1,000 కాలేజీలు
- ఇక అప్పులు, వడ్డీల భారాన్ని మోయలేం
- స్పష్టం చేస్తున్న ఇంజనీరింగ్ మేనేజ్‌మెంట్లు

(అమరావతి-సూర్య ప్రత్యేక ప్రతినిధి) : రాష్ట్రంలో ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ, బీఎడ్, బీపీఈడీ, లా తదితర ప్రొఫెషనల్ కోర్సులకు సంబంధించిన ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు భారీగా పేరుకుపోతున్నాయి. ఇవి సర్కారుకు గుదిబండగా, రాష్ట్రంలోని దాదాపు వెయ్యి ప్రొఫెషనల్ కాలేజీలకు శరాఘాతంగా మారుతున్నాయి. 2016-17 విద్యా సంవత్సరానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.252 కోట్లు కలుపుకుంటే ఇప్పటి వరకు ప్రభుత్వం ఈ కాలేజీలకు మొత్తం రూ.2,158కోట్లు బకాయి ఉంది. బీసీలకు రూ.898కోట్లు, ఈబీసీలకు రూ.580కోట్లు, ఎస్సీలకు రూ.415కోట్లు, ఎస్టీలకు రూ.95కోట్లు, మైనారిటీలకు రూ.167కోట్లు, పీహెచ్‌లకు రూ.3కోట్లు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉంది. ఫీజు బకాయిలు చాంతాడులా పేరుకుపోతున్నా సంక్షేమ శాఖల అధికారులు మాత్రం స్పష్టత ఇవ్వకుండా దాగుడుమూతలు ఆడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యా సంవత్సరం మొత్తానికి ఒకేసారి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ప్రొఫెషనల్ కాలేజీలు కోరుతుండగా, నాలుగు క్వార్టర్లలో ఈ మొత్తాన్ని విడుదల చేస్తామని సర్కారు చెబుతోంది. ఆచరణలో చూస్తే, క్వార్టర్ల వారీగా కూడా అన్ని కాలేజీలకు, అన్ని కేటగిరీలకు ఫీజులు విడుదల చేయడం లేదు. ప్రస్తుత విద్యా సంవత్సరం ఆరంభమై 8నెలలు గడుస్తున్నా, ఇప్పటి వరకు ఏ ఒక్క కాలేజీకీ అన్ని క్వార్టర్ల ఫీజు రీయింబర్స్ కాలేదు. గత విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంకా రూ.252కోట్లు బకాయి ఉంది. ట్యూషన్ మిగతా 6లో


ఫైల్‌ఫోటో

అంతా ఇంతే!



అయితే అందర్నీ జైల్లో పెడతారేమో సార్...

ప్రత్యేక హోదా మన హక్కు

- జనంలోకి వెళ్లేందుకు వైసీపీ నిర్ణయం
- కేంద్రంపై ఒత్తిడి పెంచుదాం
- మార్చి ఒకటో తేదీన కలెక్టరేట్ల వద్ద ధర్నాలు
- మార్చి 5న జంతర్‌మంతర్ వద్ద ధర్నా
- బడ్జెట్‌లో ఏపీకి అన్యాయంపై నిరంతర నిరసన
- నెల్లూరులో పార్టీ నేతలతో జగన్ సమీక్ష



(ఏపీ-పొలిటికల్ బ్యూరో) : బడ్జెట్ కేటాయింపుల్లో కేంద్రం ఏపీకి అన్యాయం చేయడంతో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కుతున్నాయి. కేంద్రం రాష్ట్రానికి చేసిన సహాయంపై నిజనిజాలు తేల్చేందుకు జనసేన పార్టీ జేఎఫ్‌సీ ఏర్పాటు చేస్తుంటే, ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మళ్లీ ఏపీకి ప్రత్యేక హోదా అంశంపై హోరెత్తించాలని నిర్ణయం తీసుకొంది. సోమవారంనాడు నెల్లూరు జిల్లాలోని కలిగిరి మండలం పెద్దకొండూరులో వై.ఎస్.జగన్ ప్రజా సంకల్ప యాత్ర కొనసాగింది. ఆ పాదయాత్ర అనంతరం తన కోసం ఏర్పాటు చేసిన శిబిరంలో వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పార్టీ ముఖ్యనేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి జరిగిన అన్యాయం, ప్రత్యేక హోదా తదితర మిగతా 3లో



ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధి దేశానికే ఆదర్శం: మంత్రి జగదీష్‌రెడ్డి

హైదరాబాద్, మేజర్‌న్యూస్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధి చట్టం దేశానికే ఆదర్శమని ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధిపై సచివాలయంలో అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం పూర్తి కావడానికి మరో 50రోజుల గడువు ఉందని, అందుకోసం పెద్మొత్త్ కులాల ప్రత్యేక నిధిని పూర్తిస్థాయిలో ఖర్చు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రణాళిక ప్రకారం నిధులు ఖర్చులు పెడితే సులువుగా లక్ష్యాన్ని చేరుకుంటామని చెప్పారు. నిధులు మురిగిపోకుండా అధికారులు పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగంగానే కేసీఆర్ ఈ చట్టాన్ని తీసుకువచ్చారని మంత్రి గుర్తుచేశారు. ఎస్సీ విద్యార్థుల కోసం గురుకుల పాఠశాలలు నెలకొల్పా మని, మహిళా గురుకుల కళా శాలలు స్థాపించామని చెప్పారు. ఎస్సీ గురుకులాలను మరింత పటిష్టం చేస్తున్నామని, గురుకుల పాఠశాలల విద్యార్థులు చదవి ర్యాంకులు సాధిస్తున్నారని మంత్రి కొనియాడారు. స్టడీ సర్కిళ్లను మరింత బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేరయ్యే ఎస్సీ విద్యార్థుల కోసం స్టడీ సర్కిళ్లలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని మంత్రి జగదీష్ రెడ్డి స్పష్టం చేశారు.



వచ్చేవారం పోలవరం పరిశీలన

● ప్రాధాన్య ప్రాజెక్టుల పనుల పురోగతిపై సమీక్ష ● సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



వెలగపూడి, సూర్య ప్రధాన ప్రతినిధి : పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై సీఎం చంద్రబాబు 51వ సారి వర్చువల్ రివ్యూ నిర్వహించారు. ఈ సమీక్షలో మంత్రి దేవినేని ఉమా, కాంట్రాక్టు కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. పోలవరం ప్రాజెక్టు పనులు 53 శాతం పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. కుడికాల్వ పనులు 91 శాతం, పోలవరం ఎడమ కాల్వ పనులు 61 శాతం, స్పిల్‌వే, స్పిల్‌ఛానల్, హెచ్ తవ్వకం పనులు 71 శాతం, స్పిల్ ఛానల్ కాంక్రీట్ పనులు 14 శాతం, పోలవరం డయాఫ్రమ్ వాల్ నిర్మాణం 68 శాతం, రేడియల్ గేట్ల ఫ్యాబ్రికేషన్ పనులు 58 శాతం పూర్తయ్యాయని సీఎంకు అధికారులు వివరించారు. కొత్త వర్క్ ఆర్డర్లు ఇవ్వాలని పోలవరం ప్రాజెక్టు అధికారి శ్రీధర్‌అన్నారు. కొన్ని డిజైన్ల ఆమోదం కోసం ఎదురు చూస్తున్నామని అధికారులు చెప్పారు. అంతేకాక నిర్దేశిత లక్ష్యాల మేరకు పనిచేస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పురోగతి వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు. వచ్చేవారం పోలవరం పనులను పరిశీలిస్తానన్న సీఎం చంద్రబాబు చెప్పారు. ప్రాధాన్య ప్రాజెక్టుల పనుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. మార్చి 15 నాటికి పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలని తూర్పుగోదావరి జిల్లా అధికారులకు సీఎం ఆదేశించారు. ఈ సందర్భంగా గుండ్లకమ్మ ప్రాజెక్టు పనులపై కూడా చంద్రబాబు సమీక్షించారు. వంశధార-నాగావళి నదుల అనుసంధానంపై సీఎం చర్చించారు. కొండవీటి వాగును ఏప్రిల్‌లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మల్లెమడుగు ప్రాజెక్టును జూన్ లోగా పూర్తి చేయాలన్నారు. ఏడు ప్రాజెక్టులను పూర్తిచేశామని, మరో 6 ప్రాజెక్టులు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.

రాష్ట్ర ప్రజలకు గవర్నర్, సీఎం శివరాత్రి శుభాకాంక్షలు



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: రాష్ట్ర గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ప్రజలకు మహాశివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించేలా భగవంతుడు దీవించాలని ప్రార్థించినట్లు వేర్వేరు ప్రకటనలో చెప్పారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున శివాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికార యంత్రాంగాన్ని సీఎం ఆదేశించారు. భక్తులకు పర్యాటకశాఖ ప్రత్యేక ప్యాకేజీ మహాశివరాత్రి సందర్భాన్ని పురస్కరించుకుని పర్యాటకశాఖ భక్తులకు ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించింది. నాలుగు ప్రముఖ శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులతో పాటు ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్ నుంచి శ్రీశైలం, వేములవాడ, కాళేశ్వరం, రామప్ప ఆలయాలకు పర్యాటకశాఖ ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించింది.

నియోజకవర్గాల కోసం అన్వేషణ

● ఇప్పటి నుంచే సీట్ల కోసం ప్రయత్నాలు ● సీఎం సొంత జిల్లాలో నేతల సన్నాహాలు ● 2019లో చిత్తూరు నుంచే నారా లోకేశ్ పోటీ ?

(అమరావతి నుంచి 'సూర్య' ప్రత్యేక ప్రతినిధి) : ఆంధ్రప్రదేశ్‌లో నియోజకవర్గాల పెంపుపై ఇంకా స్పష్టత రాలేదు. చిత్తూరు జిల్లాలో మాత్రం పెంపు జరుగుతుందన్న ధీమాతో ఉన్నారు. తమకు అనుకూలంగా కొత్త నియోజకవర్గాలు ఉండేట్టుగా చూసుకుంటున్నారు. ఎవరి లెక్కల్లో వారు ఉన్నారు. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే లోకేశ్ కోసం ఇప్పటికే ఒక స్థానాన్ని సిద్ధంచేసి పెట్టానట్లు సమాచారం. నియోజకవర్గాల పెంపు ఉంటుందో? ఉండదో? అన్న విషయాన్ని పక్కన పెడితే ఏపీలో మాత్రం నియోజకవర్గాల పునర్విభజన ఖాయమనే అభిప్రాయంతో నేతలున్నారు. మకు అనుకూలంగా కొత్త నియోజకవర్గాలు ఉండేట్టుగా చూసుకుంటున్నారు. చిత్తూరు జిల్లాలో ప్రస్తుతం జిల్లాలో 14 నియోజకవర్గాలు ఉన్నాయి. ఒకవేళ పెంపు జరిగితే మాత్రం ఓ నాలుగు కొత్తవి రావచ్చు. ఆ నాలుగు ఎక్కడ అన్నదాంట్లో ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్పష్టత ఉంది. ఇదివరకే ఆయన ఈ విషయంలో హోమ్‌వర్క్ చేసి ఉన్నారు. కాకపోతే ఆ నాలుగింటి కోసం టీడీపీ నేతల మధ్య పోటీ తీవ్రమైంది. ఎవరికి వారు తమకు అనుకూలంగా ఆ కొత్తవాటిని ఏర్పాటు చేసుకోవడానికి ప్రయత్నాలు మొదలు పెట్టారు. పునర్విభజన అన్నది కేంద్రం చేతిలో ఉంది కాబట్టి.. జిల్లాను యూనిట్‌గా చేసుకుని నియోజకవర్గాలను పెంచుతారా..? లేక లోక్‌సభ నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని పెంచుతారా? అన్నది తెలియదు. చిత్తూరు జిల్లా మూడు లోక్‌సభ స్థానాల పరిధిలో విస్తరించి ఉంది. చిత్తూరు, తిరుపతి పార్లమెంట్ స్థానాలే కాకుండా జిల్లాలో కొంతభాగం కడప జిల్లాకు చెందిన రాజంపేట లోక్‌సభ పరిధిలో కూడా ఉంది. అయితే చిత్తూరు, తిరుపతి లోక్‌సభ నియోజకవర్గాలను పరిగణనలోకి తీసుకుని ఒక్కో పార్లమెంట్ పరిధిలో రెండేసి కొత్త అసెంబ్లీ స్థానాలను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న 14 నియోజకవర్గాల్లో పూతలపట్టు, గంగాధరనెల్లూరు, సత్యవేడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాలుగా ఉన్నాయి. మిగిలినవి జనరల్ కేటగిరిలో ఉన్నాయి. అయితే ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల నుంచే కొత్తవాటిని ఏర్పాటు చేయవచ్చు. ఇదే ప్రాతిపదిక అయితే మాత్రం పలమనేరు, చిత్తూరు, చంద్రగిరి, పీలేరు, నగరి, తిరుపతి నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంది. ఈ నియోజకవర్గాల నుంచి కొత్త నియోజకవర్గాలు ఏర్పడవచ్చు. పలమనేరు నియోజకవర్గం పరిధిలోని వి.కోటను, చిత్తూరు పరిధిలోని చిత్తూరు రూరల్‌ను, చంద్రగిరి పరిధిలోని తిరుపతి రూరల్‌ను, నగరి పరిధిలోని పుత్తూరును.. పీలేరు పరిధిలోని కలికిరిని కొత్త నియోజకవర్గాలుగా ఏర్పాటు చేయాలని టీడీపీ నేతలు ప్రతిపాదిస్తున్నారు. చంద్రగిరి రూరల్ విషయానికి వస్తే తిరుపతి నగరానికి చెందిన పలువురు సీనియర్లతో పాటు మాజీ మంత్రి గల్లా అరుణకుమారి సైతం కొత్త నియోజకవర్గం కోసం సీరియస్‌గా ట్రై చేస్తున్నట్లు సమాచారం. చిత్తూరు నియోజకవర్గంలో బలిజ సామాజికవర్గం వారు ఎక్కువగా ఉంటారు. అందుకే ఇక్కడి నుంచి పోటీ చేయడానికి మిగతా సామాజికవర్గాలు తటపటాయిస్తాయి. కొత్తగా రూరల్ నియోజకవర్గం ఏర్పాటైతే పోటీ చేసే అవకాశాలు పెరుగుతాయన్న ఉద్దేశంతో కమ్మ సామాజికవర్గం నేతలు ఉన్నారు. ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. పీలేరు పరిధిలోని కలికిరిని నియోజకవర్గంగా మార్చేస్తే అక్కడ వైఎస్‌ఆర్ కాంగ్రెస్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జోరును తగ్గించవచ్చన్నది టీడీపీ నేతల ఆలోచనగా ఉన్నట్లు తెలిసింది. అంతేకాకుండా కలికిరిలో నల్లారి ఫ్యామిలీకి మంచి పట్టుంది. మొన్నీమధ్యనే మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి సోదరుడు కిశోర్‌కుమార్ రెడ్డి టీడీపీలో చేరారు. కలికిరి నుంచి కిశోర్‌ను బరిలో దింపితే ఎదురుండదన్నది టీడీపీ ఆలోచన. పలమనేరు నియోజకవర్గం పరిధిలోని



వి.కోటను కొత్త నియోజకవర్గంగా ఏర్పాటు చేస్తే అక్కడ్నుంచి నారా లోకేశ్‌ను పోటీకి దింపవచ్చునుకుంటున్నారు సీనియర్ నేతలు. ఇదివరకు వి.కోట మండలం కుప్పం నియోజకవర్గంలోనే ఉండేది. నియోజకవర్గాల పునర్విభజనలో అది పలమనేరుకు వచ్చి చేరింది. పలమనేరు నుంచి వి.కోట వేరుపడి కొత్త నియోజకవర్గంగా మారితే...పలమనేరు నుంచి పోటీ చేసేందుకు మంత్రి అమర్‌నాథ్‌రెడ్డికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అయితే నేతలు భావిస్తున్నట్టుగా అన్ని చోట్ల కొత్త నియోజకవర్గాలు ఏర్పాటు చేయడం కుదరని పని అని తెలుస్తోంది. జిల్లాను యూనిట్‌గా తీసుకుంటే ఫర్వాలేదు కానీ, పార్లమెంట్‌ను తీసుకుంటే మాత్రం మరిన్ని మార్పులు జరిగే అవకాశం ఉంటుంది. ఒకవేళ నియోజకవర్గాల పెంపు లేకుంటే పరిస్థితి ఏమిటన్నదానిపై కూడా చర్చ జరుగుతోంది. వచ్చే ఎన్నికల్లో నారా లోకేశ్‌ను చిత్తూరు జిల్లా నుంచే పోటీ చేయించాలన్నది టీడీపీ అధిష్టానం ఆలోచన. జిల్లా పార్టీ నేతల ఉత్సాహానికి కారణం కూడా అదే. నియోజకవర్గాల పునర్విభజనకు ముందు అమర్‌నాథ్‌రెడ్డి, ఆయన తండ్రి రామకృష్ణారెడ్డి అనేకమార్లు పుంగనూరు నుంచే పోటీ చేసి గెలిచారు. జిల్లా కేంద్రమైన చిత్తూరు నుంచి లోకేశ్‌ను బరిలో దింపితే గ్రూపు రాజకీయాలు ముగిసిపోతాయని నేతలు అనుకుంటున్నారు.

కేంద్రానికి మార్చి 5 డెడ్‌లైన్

టీడీపీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు



విజయవాడ, సూర్య బ్యూరో : నాలుగేళ్లు రాష్ట్రాన్ని పట్టించుకోకపోయినా సహించామని, ఇకపై ఊరుకునేది లేదని టీడీపీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు అన్నారు. తాము మాత్రమే మిత్ర ధర్మాన్ని పాటిస్తే సరిపోదని, బీజేపీ కూడా పాటించాలని అన్నారు. మార్చి 5 నాటికి ప్రధాన సమస్యలకు పరిష్కారం చూపకపోతే పార్లమెంట్‌లో పోరాటానికి సిద్ధమని అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రత్యేకించి కేంద్రాన్ని కొత్తగా ఏమీ కోరడంలేదని, విభజనబిల్లులో చట్టపరంగా ఉన్నవే అడుగుతున్నామని అన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా విభజన హామీలను అమలు చేసే బాధ్యత ఉందని కొనకళ్ల అన్నారు. వాటిని అమలు చేయడంలో కేంద్రం జాప్యం చేస్తోందని, మిత్రధర్మాన్ని పాటిస్తూ నాలుగేళ్లుగా ఎదురుచూశామని, సీఎం చంద్రబాబు 28సార్లు ఢిల్లీకి వచ్చారని, కేంద్రంలో పీఎంతోసహా మంత్రులను కలిసి అన్ని విషయాలు వివరించారని, అయినా ఫలితం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్రానికి కావాలసినవన్నీ చేస్తే తాము నిరసన తెలియజేసే అవసరమే లేదని కొనకళ్ల అన్నారు. రాష్ట్ర అవసరాలు తీర్చలేదు కాబట్టే తాము నిరసన తెలియజేస్తున్నామని కొనకళ్ల స్పష్టం చేశారు. కనీసం మిత్ర ధర్మకం కూడా కేంద్రం పాటించడంలేదని, సహనానికి కూడా ఓ హద్దు ఉంటుందని, బడ్జెట్‌లో ఏపీని చిన్నచూపు చూశారని, ఏపీ ప్రజలంతా తీవ్ర నిరాశ చెందారని, తాము కేంద్రంతో శత్రుత్వం కోరుకోవడంలేదని, మిత్రుత్వాన్ని కోరుకుంటున్నామని కొనకళ్ల స్పష్టం చేశారు.

గిన్నిస్ రికార్డుకెక్కిన స్వచ్ఛ సర్వేక్షణ్

● జీహెచ్‌ఎంసీ గిన్నిస్ రికార్డు ● 15,320 మందితో స్వీపింగ్ ● స్వచ్ఛతలో నగరాన్ని అగ్రభాగాన నిలుపుదాం ● మంత్రి కేటీఆర్

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌మహానగరంలోని రాంనగర్ డివిజన్లో చేపట్టిన స్వచ్ఛ సర్వేక్షణ్ గిన్నిస్ రికార్డుల్లోకెక్కింది. సోమవారం ఉదయం 15,320 మంది విద్యార్థులు.. ఏకకాలంలో రోడ్లను ఊడ్చి గిన్నిస్ రికార్డు ను స్వంతం చేసుకుంది. గతేడాది గుజరాత్లో 5,058 మందితో రోడ్లు ఊడ్చి గిన్నిస్ రికార్డు సాధించిన సంగతి తెలిసిందే. నేడు రాంనగర్ డివిజన్లో జరిగిన స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు వివేక్, కార్పొరేటర్ శ్రీనివాస్రెడ్డి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ డాక్టర్ బి.జనార్ధన్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు. వివిధ కళాశాలల నుంచి వేలాదిగా విద్యార్థులు తరలివచ్చారు. జీహెచ్‌ఎంసీ కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

స్వచ్ఛతలో నగరాన్ని అగ్రస్థానంలో ఉంచుదాం కేటీఆర్ : స్వచ్ఛత విషయంలో హైదరాబాద్ మహానగరాన్ని జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో ఉంచుదామని పురపాలక, ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు పిలుపునిచ్చారు. 2017లో స్వచ్ఛ సర్వేక్షణ్లో భారత్ వ్యాప్తంగా ఉన్న మెట్రో నగరాల్లో హైదరాబాద్‌కు అగ్రస్థానం దక్కింది అని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో ఈ ఏడాదికి సంబంధించి చేయాల్సిన పనులు చాలా ఉన్నాయని తెలిపారు. స్వచ్ఛ భారత్ ప్రారంభం కంటే ముందే.. స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమానికి సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. స్వచ్ఛ హైదరాబాద్ కింద నగరాన్ని 400 యూనిట్లుగా విభజించి.. జీహెచ్‌ఎంసీ సహకారంతో నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఉద్ఘాటించారు. హైదరాబాద్‌లో కోటి జనాభా ఉంది. 22 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు నగరాన్ని క్లీన్ చేస్తే సరిపోదు. కాబట్టి నగరంలోని విద్యార్థులందరూ పరిశుభ్రత కోసం కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. తడి, పొడి చెత్త కోసం పంపిణీ చేసిన బుట్టలను వేరే అవసరాలకు ఉపయోగించకుండా చెత్త కోసమే ఉపయోగించాలన్నారు.ఓ బుట్టలో బియ్యం, మరో బుట్టలో పప్పును నిల్వ చేస్తున్నారని మంత్రి అన్నారు. బుట్ల ఎందుకు ఇచ్చారో అందుకే ఉపయోగించాలని కోరారు. మన ఇంటిలోనే తడి, పొడి చెత్తను వేరు చేసేందుకు ప్రతిజ్ఞ తీసుకోవాలని సూచించారు. అప్పుడు కచ్చితంగా హైదరాబాద్ నగరం పరిశుభ్రంగా మారుతుందన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2018 సర్వేలో అందరం పాల్గొని.. హైదరాబాద్‌కు జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో ఉంచేందుకు కృషి చేద్దామన్నారు. స్వచ్ఛత కోసం మంత్రి కేటీఆర్ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ప్రతిజ్ఞ సారాంశం ఇదే.. ఇంట్లోని తడి, పొడి చెత్తను తప్పనిసరిగా వేరు చేస్తాను. తడి చెత్తతో ఎరువు తయారు



చేస్తాను. బహిరంగ ప్రదేశంలో మూత్రం పోయాను. ఇతరులను పోయనివ్వకుండా చైతన్యం తీసుకువస్తాం. మాంసాన్ని తీసుకుపోవడానికి టిఫిన్ బాక్సులను వాడుతాను. ప్లాస్టిక్ బ్యాగులు ఉపయోగించను. కూరగాయాలు, సరుకులు తెచ్చుకోవడానికి ప్లాస్టిక్ బ్యాగులు వాడను. జ్యూట్ లేదా క్లాత్ బ్యాగునే వాడుతాను. పాన్ తిని బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మి వేయను. సిగరె ట్‌ను బహిరంగ ప్రదేశంలో తాగను. ఇతరులను తాగనివ్వను. ఇంటి నిర్మాణ వ్యర్థాలను ప్రభుత్వం సూచించిన ప్రదేశాల్లోనే వేస్తాను. చెత్తను కాల్చను. గాలిని కలుషితం చేయను. హైదరాబాద్ మహానగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కంకణబద్ధుడనై ఉంటాను అని ప్రతిజ్ఞ చేయించారు.


కేసీఆర్‌కు కుంభకర్ణుని అవార్డు ఇవ్వాలి



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: ఏడాది కాలంగా సచివాలయంలోని తన కార్యాలయానికి రాకుండా ఇంటికే పరిమితమైన సిఎం కేసీఆర్‌కు కుంభకర్ణ అవార్డును ఇవ్వాలని కాంగ్రెస్‌పార్టీ నాయకుడు ఎ.రేవంత్ రెడ్డి ఎద్దేవా చేసారు. రాష్ట్రముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు రాష్ట్ర సచివాలయంలో ఉన్న సిఎం కార్యాలయానికి వచ్చి శనివారం నాటికి సరిగ్గా ఏడాది కాలం పూర్తయిందని, ఈ ఏడాదిలో సిఎం తన నివాసానికే పరిమితమైపోయారని మీడియాలో వార్తలు వెలువడిన నేపథ్యంలో రేవంత్ స్పందించారు. తన కార్యాలయానికి వచ్చి నిత్యం తనను కలవడానికి వచ్చే ప్రజలను కలుసుకొని వారి కష్ట సుఖాలను తెలుసుకొని, ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ముఖ్యమంత్రి తన కార్యాలయానికే రాకుండాపోవడం ప్రజల పట్ల, ప్రజాసమస్యల పట్ల ఆయనకు ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. ఉమ్మడి రాష్ట్రంతో కలిపి ఇప్పటిదాకా ఏ ముఖ్యమంత్రి కూడా ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించలేదని చెప్పారు. తెలంగాణాను అభివృద్ధి చేయడంలో చరిత్ర సృష్టిస్తానని చెప్పుకుంటున్న సిఎం అభివృద్ధి సాధించకపోగా సచివాలయంలోని తన కార్యాలయానికి నిరవధికంగా ఏడాది కాలంపాటు రాకుండా కొత్త రికార్డును సృష్టించారని, బహుశా ఈ రికార్డును భవిష్యత్తులో కూడా ఏ ముఖ్యమంత్రి కూడా బ్రేక్ చేయలేకపోవచ్చునని రేవంత్ ఎద్దేవా చేసారు.

పోలవరం ప్రాజెక్టు పనులు 53శాతం పూర్తి

● 12,910 కోట్ల.రూ.లు వ్యయం ● పోలవరం కుడికాలువ పనులు 91శాతం ● ఎడమ కాలువ పనులు 60 శాతం పూర్తి ● హెడ్ వర్క్సు 39 శాతం పూర్తి ● డ్యాం, స్పిల్ వే పనులు 71 శాతం పూర్తి ● 2019 కి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు చర్యలు ● పోలవరం ప్రాజెక్టుకు 58వేల కోట్లు రివైజ్డ్ ఎస్టిమేట్స్ కేంద్రానికి సమర్పణ ● పోలవరం ప్రాజెక్టు పేరిట ప్రత్యేక వెబ్ సైట్ ఏర్పాటు ● ఏపీ జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు




అమరావతి, సూర్య ప్రత్యేక ప్రతినిధి : జాతీయ ప్రాజెక్టైన పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటి వరకూ 12వేల 910 కోట్ల రూ.లు ఖర్చు చేసి 53శాతం పనులను పూర్తి చేయడం జరిగిందని రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు వెల్లడించారు. ఈమేరకు సోమవారం వెలగపూడి సచివాలయంలోని పబ్లిసిటి సెల్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టుపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పటి వరకూ 51సార్లు వర్చువల్ ఇన్సెక్షన్ల ద్వారా సమీక్షించడం జరిగిందని చెప్పారు.సోమవారాన్ని పోలవరంగా ప్రత్యేకంగా ప్రకటించి ప్రతి సోమవారం ప్రాజెక్టుపై వర్చువల్ ఇన్స్పెక్షన్ ద్వారా సమీక్షించడం నెలకు ఒకసారి ప్రాజెక్టు సైట్ ను సందర్శించడం జరుగుతోందని తెలిపారు.ఇప్పటి వరకూ 53శాతం పనులు పూర్తి చేయడం జరిగిందని అన్నారు.కుడి ప్రధాన కాలువకు సంబంధించి 91శాతం,ఎడమ కాలువకు సంబంధించి 60శాతం పనులు,హెడ్ వర్క్సుకు సంబంధించి 39శాతం పనులు, డ్యాం, స్పిల్ వేకు సంబంధించి 71శాతం పనులు పూర్తయ్యాయని వచ్చే 2019 డిశంబరు నాటికి ఈప్రాజెక్టును పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు.డిశంబరు నాటికి 48గేట్లను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.ఈ ప్రాజెక్టుపై ఇప్పటి వరకూ 12వేల 910 కోట్ల రూ.లను ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. ఈ వ్యయంలో ఈప్రభుత్వం వచ్చాక 7వేల 79కోట్ల రూ.లు ఖర్చు చేయగా 2014కు ముందున్న ప్రభుత్వాలు 5వేల 135 కోట్లు ఖర్చు చేశాయని తెలిపారు. అలాగే ఇప్పటి వరకూ కేంద్ర ప్రభుత్వం 4వేల932 కోట్ల రూ.లను విడుదల చేయగా మరో 2వేల 247కోట్ల రూ.లను విడుదల చేయాల్సి ఉందని మంత్రి దేవినేని మీడియాకు వివరించారు. వచ్చే సోమవారం పోలవరం ప్రాజెక్టు పనులను ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు స్వయంగా తనిఖీ చేయనున్నారని మంత్రి దేవినేని మీడియాకు వెల్లడించారు. సోమవారం లోగా బ్యాలెన్సు పనులకు సంబంధించిన పూర్తి వివరాల నివేదికను సమర్పించాలని సియం ఆదేశించారని చెప్పారు.గత ప్రభుత్వాలు పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి కాలువ నిర్మాణాలకు మాత్రమే పరిమితం కాగా ఈప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికిన ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అన్ని పనులను వేగవతంగా నిర్వహించడం జరుగుతోందని అన్నారు.పోలవరం ప్రాజెక్టుపై ఎవరు ఎన్ని ఆటంకాలుసృష్టించినా వాటన్నిటినీ అధికమించి పనులు సకాలంలో పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.ఈప్రాజెక్టుకు సంబంధించిన అన్ని వివరాలను ప్రత్యేక వెబ్ సైట్లో పొందుపర్చడం జరిగిందని ఆవివరాలను ఎవరైనా తెల్సుకోవచ్చని దేశంలో ఇంతకు ముందుక ఏప్రాజెక్టుపై వివరాలను ఈవిధంగా వైబ్ సైట్లో పెట్టలేదని ఆయన స్పష్టం చేశారు. ఈప్రభుత్వం ప్రాధాన్యతగా పెట్టుకున్న 28ప్రాజెక్టుల్లో ఇప్పటికే 6ప్రాజెక్టులు పూర్తి చేయగా మరో 12 ప్రాజెక్టులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని మంత్రి దేవినేని వెల్లడించారు.116 రోజులపాటు సాగా జలసంరక్షణ కార్యక్రమంలో పూర్తి చేసిన ప్రాజెక్టులను ప్రారంభించడం జరుగుతుందని ఈఉద్యమంలో వార్డు సభ్యులు మొదలు ప్రతి ఒక్కరూ పాల్గొనాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో జల సంరక్షణ పనులకు ఇప్పటి వరకూ 10వేల 867కోట్ల రూ.లను ఖర్చు చేయడం జరిగిందని తద్వారా భూగర్భ జలమట్టం పెద్దఎత్తున పెంపొందించుకోగలిగామని పేర్కొన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో 3మీటర్ల కంటే తక్కువ భూగర్భ జలమట్టం గల మండలాలు 52, మూడు నుండి 8మీటర్లు గలవి 207 మండలాలు, 8మీటర్ల కంటే ఎక్కువ మట్టం గలవి 411 మండలాలున్నాయని వివరించారు. రాష్ట్రంలోని ఇతర సాగునీటి ప్రాజెక్టుల గురించి మంత్రి దేవినేని మాట్లాడుతూ వంశధార-నాగావళి అనుసంధానం రెండు పంటలకు నీరందించడం జరుగుతుందని చెప్పారు. అలాగే విశాఖ జిల్లాలో 2లక్షల ఎకరాలకు నీరందించనున్నామని, పురుషోత్త పట్నం ఎత్తిపోతల పథకాన్ని మార్చినాటికి పూర్తి చేయనున్నామని దీనిద్వారా ఏలేరు రిజర్వాయర్లో నీటిని నిల్వచేసి తూర్పుగోదావరి మెట్టపాంత మండలాల్లో లక్ష ఎకరాలకు నీరందించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్టా డెల్టాలో 13వేల ఎకరాలకు నీరందించడంతో ఈఏడాది రూజ10వేల కోట్ల ఆదాయం సమకూరిందని చెప్పారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయని దీనిద్వారా పశ్చిమ గోదావరి జిల్లాల్లో 7లక్షల ఎకరాలకు అదనంగా సాగునీరు అందే వీలుందని పేర్కొన్నారు. గోదావరి-పెన్నా అనుసంధానానికి సియం చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. డిశంబరు నాటికి వెలిగొండ టన్నల్-1 పనులు పూర్తి చేయనున్నామని మంత్రి దేవినేని చెప్పారు. ఈ సమావేశంలో జలవనరుల శాఖ ఇఎన్ సి యం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన వైబ్ సైట్ లో ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి చరిత్ర,ప్రాజెక్టు మొత్తం వివరాలు, ప్రస్తుత స్థితి,ఇప్పటి వరకూ పూర్తయిన వివరాలు, ఖర్చు చేసిన వ్యయం వివరాలను అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. ఇందుకు సంబంధించి జిల్లాల వారీగా వివరాలు తెల్సుకోవాలంటే పశ్చిమ గోదావరి జిల్లాకు ఒక లింక్,తూర్పు గోదావరి జిల్లాకు ఒక లింక్ ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. అలాగే ముఖ్యమంత్రి ప్రతి సోమవారం చేస్తున్న వర్చువల్ ఇన్స్‌పెక్షన్, తనిఖీల వివరాలు, భూసేకరణ, సహాయ పునరావాస చర్యల వివరాలు దీనిలో పొందుపర్చడం జరిగిందని చెప్పారు. అంతేగాక ఈప్రాజెక్టుపై ఇప్పటి వరకూ విడుదల చేసిన ప్రభుత్వ ఉత్తర్వులు, సమావేశాల మినిట్స్, వివిధ సందర్భాల్లో తరచు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు, అధికారులు, ఇంజనీర్లు, కాంట్రాక్టర్ల ఫోన్ నెంబర్ల వివరాలను కూడా వెబ్ సైట్లో అందుబాటులో ఉంచామని తెలిపారు.

కాంగ్రెస్‌ను ప్రజలే ఎన్‌కౌంటర్ చేస్తారు



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఎన్‌కౌంటర్ చేస్తారని, ఆ పార్టీ భవిష్యత్తును మోరీల్లో కలుసేతారని తెలంగాణ విద్యుత్ శాఖా మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. మళ్లీ గెలవలేమన్న భయంతోనే నల్గొండ కాంగ్రెస్ నేతలు రాజకీయాలు చేస్తున్నారని మండపడ్డారు. తాగి గొడవ పడిన హత్యను రాజకీయం చేస్తున్నారని ఆక్షేపించారు. 20 ఏళ్ల క్రితం అంతర్గత తగాదాలతో అదేచోట నరసింహ అనే వ్యక్తి హత్య జరిగిందని గుర్తు చేశారు. ప్రభుత్వం, పోలీసులపై నిందలు వేసేందుకు ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. హత్యకు గురైన శ్రీనివాస్ టీఆర్‌ఎస్‌లో చేరతానని ఇటీవల చెప్పాడని, అందుకు చంపారని తామూ అనొచ్చుకదా అని మంత్రి ప్రశ్నించారు. మిగతా నియోజకవర్గాల్లో లేని హత్యలు ఒక్క నల్గొండలోనే ఎందుకు జరుగుతున్నాయి.

15న ఢిల్లీకి మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15 న కేంద్రప్రభుత్వం ఢిల్లీలో సమావేశం నిర్వహించనున్నది. ఈ సమావేశానికి హాజరు కావలసిందిగా రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి హరీశ్ రావుకు ఆహ్వానం అందింది.కేంద్రజలవనరుల మంత్రి నితీన్ గడ్కరీ ఆధ్వర్యంలో జరిగే సమావేశంలో రాష్ట్రాల నీటిపారుదల మంత్రులు, ఆయా రాష్ట్రాల ఇరిగేషన్, ఆర్థిక శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శులు,కేంద్ర జలసంఘం ఛైర్మన్, నాబార్డు ఛైర్మన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొంటారు. దేశవ్యాప్తంగా ప్రాధాన్యక్రమంలో ప్రధా నమంత్రి కృషి సించాయ్ యోజన కింద పూర్తి చేయతలపెట్టిన 99 సాగునీటి పథకాలు, అవసరమైన నిధులు, ఇప్పటివరకు నాబార్డు నుంచి అందించిన నిధులు ఇతర అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకుంటారు. డిల్లీలోని శ్రమశక్తి భవన్ లో 15 వతేదీ మధ్యానం 1.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుంది.

ఏపీ భవన్‌లో మహాశివరాత్రి వేడుకలు : రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్

న్యూఢిల్లీ, సూర్య ప్రధాన ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ భవన్‌లో ఫిబ్రవరి 13, 14 తేదీలలో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆంధ్ర ప్రదేశ్ భవన్ రెసిడెంట్ కమీషనర్ ప్రవీణ్ ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, శ్రీశైల మల్లిఖార్జున స్వామివార్ల దేవస్థానం, ఆదిలీల ఫౌండేషన్, ఢిల్లీలోని తెలుగు సంస్థల సహకారంతో ఆంధ్రప్రదేశ్ భవన్‌లో అఖండ నాదోపాసన, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కూచిపూడి నృత్యరూపకం, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు రెసిడెంట్ కమీషనర్ ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు. ఈనెల 13న మంగళవారం ఉదయం 10గంటల నుంచి 14న ఉదయం గం.10.00ల వరకు నిర్విరామంగా బ్రహ్మశ్రీ డా. తాడేపల్లి లోకనాథ శర్మ వారిచే అఖండ నాదోపాసన కార్యక్రమం నిర్వహించనునట్లు తెలిపారు. 13న సాయంత్రం 6.30గంటలకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆడిటోరియంలో కృష్ణా జిల్లా కూచిపూడి కళాక్షేత్రంకు చెందిన డాక్టర్ చింతా రవిబాలకృష్ణ బృందంచే కూచిపూడి నృత్య రూపకం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 14న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు శ్రీశైలం దేవస్థానం, శ్రీశైలం ప్రధానార్చకులు, మఠం శివశంకరయ్య స్వామి, శ్రీ భ్రమరాంభ అమ్మవారి ఆలయం, శ్రీశైలం దేవస్థానం ముఖ్య అర్చకులు భాగవతుల వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రిల ఆధ్వర్యంలో సామూహికంగా మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు, ఈకార్యక్రమానంతరం భక్తులకు, ఆహూతులకు శ్రీశైల దేవస్థానం వారిచే శ్రీశైల భ్రమరాంభ సమేత శ్రీ మల్లిఖార్జున స్వామివార్ల విభూతి, కుంకుమ, కైలాస కంకణాలు, శేష వస్త్రాలు, లడ్డు ప్రసాదం అందచేయనున్నట్లు, అనంతరం మహాప్రసాద వితరణ ఉంటుందని రెసిడెంట్ కమీషనర్ ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ కుటుంబ సమేతంగా పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బేషుగ్గా కేంద్ర పథకాలు అమలు

- మరింత సమర్థవంతంగా గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టండి
- కేంద్రం నుండి పూర్తి సహకారం అందిస్తాం
- కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి రాంకృపాల్ యాదవ్
- హరితహారంలో నాటిన మొక్కల మనుగడ రేటుపై సంతృప్తి
- తెలంగాణాకు మరింత సహకారం ఇవ్వాలని కోరిన మంత్రి జూపల్లి
- తెలంగాణాకు ఉపాధి పనిదినాలను, డీడీయూజీకేవై అదనంగా కేటాయించాలనివినతి
- ప్రతి జిల్లాకు కనీసం ఒక రూర్బన్ క్లస్టర్
- టీ సిపార్డ్‌లో కేంద్ర పథకాలపై సుదీర్ఘ సమీక్ష



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి : తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి కోసం కేంద్రం అమలు చేస్తున్న పథకాలు భేషుగ్గా అమలవుతున్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి రాంకృపాల్ యాదవ్ ప్రశంసించారు. రాష్ట్రంలో అమలవుతున్న వివిధ కేంద్ర పథకాలపై మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి రాజేంద్రనగర్‌లోని టీ సిపార్డ్ (తెలంగాణా రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి సంస్థ)లో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా తెలంగాణాలో అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ పథకాల పురోగతిని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. ఉపాధి హామీ, పీఎంజీఎస్‌వైపై, రూర్బన్, డీడీయూజీకేవై, టీఆర్ ఐజీపీ, పింఛన్ల పంపిణీ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి రాంకృపాల్ యాదవ్ మాట్లాడుతూ... తెలంగాణాలో గ్రామీణా భివృద్ధి శాఖ కార్యక్రమాల అమలు బాగుందని...మరింత ఉత్సాహంగా పనిచేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసుకొని ముందుకు పోవాలని సూచించారు. హరిత హారంలో భాగంగా నాటిన మొక్కల మనుగడ రేటు 70 శాతం వరకు ఉందని అధికారులు వివరించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ...దేశానికే ఆదర్శంగా గ్రామీణాభివృద్ధి శాఖను మార్చేందుకు తాము సిద్దంగా ఉన్నామని...కేంద్రం నుండి మరింత సహకారం అందజేయాలని కోరారు. పెద్ద ఎత్తున ఉపాధి హామీని అమలు చేస్తున్నామని, ఈ ఆర్థిక సంవత్సరంలో మొదట్లో ఇచ్చిన 8 కోట్ల పనిదినాల లక్ష్యాన్ని ఇప్పటికే అధిగమించామన్నారు. పనిదినాల లక్ష్యాన్ని 16 కోట్లకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రూ.750 కోట్ల మెటీరియల్ కాంపోనెంట్ చెల్లించాల్సి ఉందని...దానిని కూడా విడుదల చేసేట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణాలో తీసుకువచ్చిన నూతన పారిశ్రామిక విధానం ద్వార పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు ఏర్పడుతున్నాయని... వీటిని అందిపుచ్చుకునే విధంగా దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన కింద యువతకు పెద్ద ఎత్తున శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 2019 వరకు 47 వేల మందికి శిక్షణను లక్ష్యంగా కేంద్రం ఇచ్చిందని.. దీనిని మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే 2003-04లో జరిగిన పొరపాటు నివేధిక వల్ల రాష్ట్రానికి ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన కింద రావాల్సిన 1230 కిలో మీటర్ల రహదారులను మంజూరు చేయలేదన్నారు. దీనిపై ఇప్పటికే కేంద్ర బృందాలు క్షేత్ర స్థాయిలో పర్యటించి నివేధిక కూడా ఇచ్చాయని.. దీనికి సంబంధించి 800 కోట్ల రూపాయల విలువైన రహదారుల నిర్మాణానికి పీయంజీఎస్వైపై - 2 కింద అనుమతి ఇవ్వాలని కోరారు. అలాగే రాష్ట్రానికి మూడు విడుతల్లో 16 రూర్బన్ క్లస్టర్లను మంజూరు చేశారని...కనీసం జిల్లాకు ఒక్కటైన ఇవ్వాలని కేంద్ర సహాయ మంత్రి కి మంత్రి జూపల్లి వినతి పత్రం అందజేశారు. ఈ సమీక్షా సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, కమిషనర్ నీతూ ప్రసాద్, సెర్ప్ సీఈఓ పౌసమి బసు, పంచాయితీరాజ్ విభాగం ఈ ఎన్ సీ ఎం.సత్యానారాయణరెడ్డి, స్త్రీ నిధి ఎండీ విద్యాసాగర్ రెడ్డి, సెర్ప్ డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, బాలయ్య, ఆర్డీ అడిషనల్ డైరెక్టర్లు సైదులు, ఆశా తదితరులు పాల్గొన్నారు.

ఇఎస్ఐ ఆసుపత్రుల నిర్మాణానికి కేంద్రం సానుకూలం

- విశాఖపట్నంలో 500 పడకల ఇఎస్ఐ ఆసుపత్రికి గ్రీన్ సిగ్నల్
- అమరావతిలో 300 పడకల సూపర్ స్పెషాలిటీ ఇఎస్ఐ ఆసుపత్రి
- రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, శిక్షణ శాఖ మంత్రి పితాని
- తిరుపతి ఆసుపత్రి ప్రారంభోత్సవానికి కేంద్ర మంత్రికి ఆహ్వానం



న్యూఢిల్లీ, సూర్య ప్రత్యేక ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్‌లో ఇఎస్ఐ ఆసుపత్రుల నిర్మాణానికి సత్వర చర్యలు చేపట్టాలని కేంద్ర కార్మిక ఉపాధికల్పన శాఖా మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్, ఆ శాఖ ఉన్నతాధికారులను కలసి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, శిక్షణ శాఖ మంత్రి పితాని సత్యనారాయణ చేసిన విజ్ఞప్తికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి చెప్పారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, శిక్షణ శాఖ మంత్రి పితాని సత్యనారాయణ కేంద్ర కార్మిక ఉపాధికల్పన శాఖా మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్ ను సోమవారం న్యూఢిల్లీ లోని ఆయన కార్యాలయంలో కలసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిలో ఇఎస్ఐ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి అనుమతి, మంజూరు, రాష్ట్రంలో ఇఎస్ఐ ఆసుపత్రుల స్థాయి పెంపుదల, నూతన డిస్పెన్సరీలు మంజూరు, ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన, చంద్రన్న భీమా పథకం అనుసంధానానికి, నేషనల్ స్కాలర్ షిప్ పోర్టల్‌లో విద్యార్థుల డేటా పొందుపరచే అంశాలపై కేంద్ర మంత్రితో చర్చించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రధా నంగా విశాఖ పట్నంలో నిర్మాణానికి మంజూరు చేసిన 500 పడకల ఇ ఎస్ ఐ ఆసుపత్రి నిర్మాణానికి, రాష్ట్ర రాజధాని అమరావతి సూపర్ స్పెషాలిటి ఇఎస్ఐ ఆసుపత్రిని 300 పడకలతో విజయవాడలోని ఇఎస్ఐ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మాణానికి అనుమతి మంజూరు చేయాలని, విజయనగరంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన భూములను రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి అందచేసినందున ఈ ఆసుపత్రుల నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుని సత్వర నిర్మాణం చేసి కార్మికుల సంక్షేమానికి సహకరించవలసినదిగా కేంద్ర మంత్రి, ఆ శాఖ అధికారులను కలసి సమగ్రంగా చర్చించినట్లు మంత్రి పితాని సత్యనారాయణ వివరించారు. తిరుపతిలో చేపట్టిన 100 పడకల ఆసుపత్రి నిర్మాణం పనులు పూర్తి కావచ్చినందున, ఈ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి రావలసినదిగా కేంద్ర మంత్రిని ఆహ్వానించగా తన అంగీకారాన్ని తెలియచేస్తూ ఏప్రిల్ నెల 2వ వారంలో ప్రారంభోత్సవానికి రానున్నట్లు మంత్రి అంగీకరించినట్లు చెప్పారు. రాజమండ్రిలో వున్న 50 పడకల ఇఎస్ఐ ఆసుపత్రిని 200 పడకల ఆసుపత్రిగా మార్పు చేసి, ఇందుకు అవసరమైన భవననిర్మాణ పనులను చేపట్టాలని కోరామన్నారు. రాష్ట్రంలో 3 పడకలు, 6 పడకల స్థాయి గల 25 డిస్పెన్సరీలను మంజూరు చేసి అవసరమైన వైద్యులను, సిబ్బందిని నియమించాలని కోరినట్లు చెప్పారు. కార్మికుల సంక్షేమానికి కేంద్రం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి జన జీవన్ భీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన, ఆమ్ ఆద్మీ భీమా యోజన పథకాలను, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చంద్రన్న భీమా యో జన పథకంతో అనుసంధానం చేసి రాష్ట్రంలో కార్మికుల సంక్షేమానికి చేయూ తనివ్వాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేసినట్లు మంత్రి పితాని సత్యనారాయణ చెప్పారు. ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించుట, ప్రమాద భీమా మొత్తం చెల్లించ డంలో ఉన్న వ్యత్యాసాలను సవరిస్తే ఎంతో మంది కార్మికులకు ప్రయోజనం చేకూరుతుందని కేంద్రమంత్రికి చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించారని, ఈ అంశంపై అధికారులతో చర్చించి తగు నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 2, 2016 వ సంవత్సరం నుంచి అమలు చేస్తున్న చంద్రన్న భీమా పథకం క్రింద 2.50 కోట్ల మంది కార్మికులు ఆధార్ కార్డుల అనుసంధానంతో నమోదు చేసుకున్నారని చెప్పారు. ప్రమాదం సంభవించినప్పుడు వీరికి ప్రమాద భీమా క్రింద 5లక్షల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందని, కేంద్ర ప్రభుత్వం 2 లక్షల రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నదని ఈ వ్యత్యాసాన్ని సవరించాలని కోరినట్లు చెప్పారు. అసంఘటిత కార్మికులు 2.50 కోట్ల మంది ఉన్నారని చెప్పారు. పి ఎం జెజె బి వై పథకం క్రింద 18 నుంచి 50 సంవత్సరాల వయస్సులోపు వారు, ఏఏబివై పథకం క్రింద 51 నుంచి 60 సంవత్సరాలోపు వయస్సు వారికి కేంద్ర ప్రభుత్వం భీమా పథకాలను అమలు చేస్తుండగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 18 నుంచి 70 సంవత్సరముల వయస్సు కలవారికి భీమా ప్రయోజన చేకూరుస్తున్నదని మంత్రికి వివరించినట్లు చెప్పారు. నేషనల్ స్కాలర్ షిప్ పోర్టల్‌లో అర్హులైన విద్యార్థుల వివరాలను పొందుపరచుటకు డిబిటిలో వెసలుబాటు కల్పించాలని కోరినట్లు చెప్పారు. రాష్ట్రంలో 22 ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌లు ఉండగా చిత్తూరు, అనంతపురంలో మోడల్ కెరీర్ సెంటర్లు మంజూరైనట్లు చెప్పారు. చిత్తూరు కేంద్రానికి రూ. 37.45 లక్షలు మంజూరు చేయగా రూ.22.47 లక్షలు మంజూరు చేయడం జరిగిందని, అనంతపురం కేంద్రానికి 31.91 లక్ష లకు గాను 19.14 లక్షల రూపాయలు విడుదల చేసినట్లు పేర్కొంటూ మిగి లిన మొత్తాన్ని విడుదల చేయాలని కోరినట్లు, రూ.6.36 కోట్లతో 14 కేంద్రాలలో మోడల్ కెరీర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరుతూ ఇప్పటికే ప్రతిపాదనలు కేంద్రానికి సమర్పించినట్లు మంత్రి పితాని సత్యనారాయణ పాత్రికేయులకు వివరించారు. మంత్రి వెంట రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన, శిక్షణ శాఖ కమీషనర్ వర్రప్రసాద్, ఇఎస్ఐ ఆసుపత్రుల సంచాలకులు విజయ్ కుమార్ పాల్గొన్నారు.



ప్రాజెక్టు నివేదిక ఆధారంగా స్థలం

- నవ్యాంధ్రలో ఏపిహెచ్ఆర్‌డి ఇనిస్టిట్యూట్ ఏర్పాటు
- అమరావతిలో 25 ఎకరాల స్థలం ఇవ్వాలని కోరిన అధికారులు
- స్థలం కేటాయింపుపై సీఎస్ దినేష్‌కుమార్ సమీక్ష

వెలగపూడి, సూర్య సచివాలయ ప్రతినిధి : అమరావతిలో ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి సంస్థకు అవసరమైన స్థలం కేటాయింపు ఇతర అంశాలపై సోమవారం వెలగపూడి సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ అధికారులతో సమీక్షించారు. ఇందుకు సంబంధించి వెంటనే సవివర ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్)ను తీసుకుని దానిని సీఆర్‌డిఏ ప్లానింగ్ విభాగంతో పరిశీలించిన మీదట అవసరమైన స్థలం కేటాయించే అంశంపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. హెచ్ఆర్‌డి ఇనిస్టిట్యూట్ పరిపాలనా భవనం, రెసిడెన్సియల్ క్వార్టర్లు, శిక్షణా కేంద్రాలు, ఇతర వసతు లకు సంబంధించి ఎంతమేరకు భూమి కావాల్సి ఉందనేది ఆడిపిఆర్ ను పరిశీ లించిన తదుపరి అమరావతిలో స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని సీఎస్ చెప్పారు. అదేవిధంగా ప్రస్తుతం పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధీనంలో నిర్వహించబడుతున్న సామర్లకోట, బాపట్ల, శ్రీకాళహస్తిలోని విస్తరణ, శిక్షణా కేంద్రాలు(ఇటిసి)లను ఎపిహెచ్ఆర్‌డీ పరిధి లోకి తీసుకువచ్చే ప్రతిపాదనలపై ఆయా కేంద్రాల్లోని పరిస్థితులను పరిశీలించి త్వరలో ఒక నివేదిక సమర్పించాలని సాధారణ పరిపాలనాశాఖ కార్యదర్శి ఎన్.శ్రీకాంత్‌ను సీఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ఆ నివేదిక రాగానే ఈవి షయమై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎపిహెచ్ఆర్‌డిఐ సంస్థ డెరెక్టర్ జనరల్ చక్రపాణి మాట్లాడుతూ అమరావతిలో హెచ్ఆర్‌డీ సంస్థ ఏర్పాటుకు 25ఎకరాల స్థలం కేటాయించాలని కోరారు. సిఆర్‌డిఏ పరిధిలోని కొండపావు లూరు గ్రామంలో ఈ ఇనిస్టిట్యూట్ నిర్మాణానికి 135 ఎకరాల స్థలాన్ని పరిశీలించామని అయితే ఆభూమి రాజధానికి దూరంగా ఉండడంతో పాటు ఆక్రమణలు ఉన్నాయని కావున అమరావతిలో స్థలాన్ని కేటాయించాలని కోరారు. హెచ్ఆర్‌డిఐ ఏర్పాటుకు సంబంధించిన వివిధ అంశాలపై ఈసమా వేశంలో సిఎస్ దినేష్ కుమార్ అధికారులతో చర్చించారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాంబశివరావు, సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి ఎన్.శ్రీకాంత్, ఆర్థికశాక కార్యదర్శి హేమ మునివెంకటప్ప, పంచాయితీరాజ్ శాఖ కమీషనర్ బి.రామాంజనేయులు, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ సాంకేతిక కొండలరావు, సిసిఎల్ఏ కార్యదర్శి బి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

శంకర.. శుభకర

- శివాలయాల్లో మహాశివరాత్రికి ఏర్పాట్లు
- ఆరాధన, జాగరణ, సాంస్కృతిక కార్యక్రమాలకు సన్నద్ధం

హైదరాబాద్, మేజర్‌న్యూస్ : లయకారుడు ఆది దేవుడు భక్తవశంకురుడు నీలకంఠుడి పర్వదినమైన మహాశివరాత్రి వచ్చేస్తోంది. ఈనెల 13న జరిగే వేడుకల కోసం నగరంతోపాటు శివార్లలోని శివాలయాలు ముస్తాబవుతున్నాయి. అభిషేకాలు, ప్రత్యేక పూజలు, శివకల్యాణోత్సవాలు, కుంకుమార్చనలు, జాగరణలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తెలంగాణాలోని శైవ దేవాలయాలన్నీ మహాశివరాత్రికి సన్నద్ధం అయ్యాయి. హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్న ప్రాచీన శైవక్షేత్రం కీసరగుట్ట. ద్వాదశ జ్యోతిర్లింగాలతో సమానంగా ఇక్కడ గర్భాలయంలో కొలువు దీరిన రామలింగేశ్వరస్వామి విశేష పూజలు అందుకుంటున్నాడు. స్వామి దర్శనం అపమృత్యు బారి నుంచి రక్షణ ఇస్తుందని భక్తుల విశ్వాసం. స్వామికి కుడివైపున గణపతి, భవానీ అమ్మవారు, వామభాగంలో దుర్గ, వల్లీదేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వరుడు..ఆలయానికి ఎదురుగా ధ్వజ స్తంభం వద్ద కాలభైరవుడు, చండీశ్వరుడి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈనెల 11 నుంచి 16 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. లక్షలాదిగా తరలి వచ్చే భక్తులకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లుచేసింది. కాళేశ్వరంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే వేములవాడలోని రాజరాజేశ్వరీ దేవాలయం, యాదాద్రి లక్ష్మినరసింహాస్వామి దేవాలయంలో భక్తులరద్దీని దృష్టిలో పెట్టుకొని ఏర్పాట్లు చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ సమీపంలోని రామేశ్వరాలయంలో శివరాత్రి జాతరకు ఏర్పాట్లు పూర్తి చేవారు. మహబూబ్‌నగర్ జిల్లా మణ్యంకొండలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు పూర్తిచేశారు.

ఆర్థికేతర సంబంధిత ఫిర్యాదులను పరిష్కరించండి

అధికారులకు సీఎస్ దినేష్‌కుమార్ ఆదేశం



వెలగపూడి, సూర్య బ్యూరో : రాష్ట్రంలో ప్రజల నుండి జన్మభూమి, ఇతర సందర్భాల్లో వచ్చిన ఆర్థికేతర సంబంధితమైన ఫిర్యాదులన్నిటినీ త్వరితగతిన పరిష్కరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. గ్రీవియెన్స్ ఫిర్యాదుల పరిష్కారం, ముఖ్యమంత్రి హామీలు అమలుపై సోమవారం వెలగపూడి సచివాలయంలో ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈసం దర్భంగా సీ.ఎస్ మాట్లాడుతూ ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులన్నిటినీ నిర్దిష్ట వ్యవధిలోగా సకాలంలో పరిష్కరించాలని ముఖ్యంగా ఆర్థికేతర పరమైన ఫిర్యాదులన్నింటినీ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే ఆర్థికప రమైన ఫిర్యాదులు, వినతులు ఎన్ని ఇంకా పరిష్క రించాల్సి ఉంది. వాటికి ఎంతమేరకు నిధులు అవసరం ఉందనేదానిపై ఆయా శాఖలవారీగా ఒక నివేదికను సిద్ధం చేసి వాటిని కూడా త్వరగా పరిష్కరిం చేందుకు చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈఅంశానికి సంబంధించిన ఫిర్యా దులను ప్రత్యేకంగా మానిటర్ చేసేందుకు రియల్ టైమ్ గవర్నెన్స్ లో ప్రత్యేకంగా ఒక అధికారిని ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. అంతేగాక శాఖాధి పతుల వారీగా పెండింగ్ వివరాలను జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆర్థికేతరమైన ఫిర్యాదులన్నిటినీ వెంటనే పరిష్కరించడంతోపాటు ఆర్థికప రమైన వాటిని నిధుల లభ్యతను బట్టి వీలైనంత త్వరగా పరిష్కారమయ్యేలా చూడాలని సీ.ఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. అనంతరం ముఖ్యమంత్రి హామీలు విషయమై సిఎస్ సమీక్షిస్తూ సుమారు 1400 వరకూ సియం హామీలు అమలు చేయా ల్సి ఉందని వాటిని శాఖలవారీ విభజించి ఎన్ని అమలు చేశారు ఇంకా ఎన్ని చేయాల్సి ఉందో జాబితా రూపొందించాలని రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా ఎప్పటికప్పుడు సమీక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి హామీలకు సంబంధించి మంజూరు, పనులు పూర్తయి ప్రారంభోత్సవం కాకున్నా ఆహామీలు నెరవేరి నట్టుగా భావించాలని చెప్పారు. ఈహామీలు అమలుపై సంబంధిత శాఖల అధికారులు సకా లంలో చర్యలు తీసుకోవాలని సిఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ సిఇఓ బాబు అహ్మద్ ఫిర్యాదుల పెండింగ్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తూ జిల్లాల వారీ ఆర్థిక,ఆర్థికేతర ఫిర్యాదుల పెండింగ్ వివరాలను తెలియజేశారు. గృహనిర్మాణ శాఖకు సంబంధించి అత్యధికంగా 28లక్షల 98వేల 907 ఫిర్యాదులు రాగా వాటిని ప్రజాసాధికార సర్వే జాబితాతో పరిశీలించగా వాటిలో 9లక్షల 23వేల 530 అర్హమైనవిగా తేలగా వాటిలో 8లక్షల 38వేల 413 అత్యంత అవశ్యక మైనవిగా తేలడం జరిగిందని వివరించారు. ఈసమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాంబశివరావు,సర్వీసెస్ శాఖ ముఖ్య కార్యదర్శి గోపాల కృష్ణ ద్వివేది,ప్రణాళికాశాఖ కార్యదర్శి సంజయ్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

మా సహనాన్ని ఇంకా పరీక్షించవద్దు

కేంద్ర ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కేఈ కృష్ణమూర్తి



రాజమహేంద్రవరం,సూర్యబ్యూరో: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కి అన్యాయం జరిగిందని టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తోన్న విషయం తెలిసిందే. ఏపీకి న్యాయం చేయకపోతే బీజేపీతో తాడోపేడో తేల్చుకుంటామంటూవారు మండిపడుతున్నారు. తాజాగా, సోమవారం రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధి కార్యక్ర మాలపై అధికారులతో సమీక్ష నిర్వహించిన కేఈ కృష్ణమూర్తి అనంతరం మీడియాతో మాట్లాడుతూ తాము అసంతృప్తితో ఉన్నామని, వచ్చేనెల 5 వరకు వేచి చూస్తామని, తమ సహనాన్ని ఇంకా పరీక్షించవద్దని వ్యాఖ్యానించారు. ఏపీకి కేంద్ర ప్రభుత్వం చేసిన అన్యాయం జాతీయ అంశంగా మారిందని, తమకు న్యాయం చేయాల్సిందేనని అన్నారు. ఏపీకి అన్యాయం జరిగితే కేంద్రపై నిరసనలు తెల్పడానికి సిద్దం అన్నారు.

అదానీ, అంబానీల కోసమే మోడీ సర్కార్: ఉత్తమ్



హైదరాబాద్, మేజర్‌న్యూస్: దేశంలో బడా పారిశ్రామిక వేత్తలైన ఆదానీ, అంబానీల కోసమే మోదీ సర్కార్ పనిచేస్తోందని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం ఐఎన్టీయూసీ కార్మిక నాయకులు, కార్మిక నేతలతో ఏఐసీసీ నేత కుంతియా, ఉత్తమ్ భేటీ అయ్యారు. కార్మికుల సమస్యలు, ఉపాధి హామీ పనుల కూలీలపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. నరేగాను నిర్వీర్యం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని ఉత్తమ్ హెచ్చరించారు.

కేంద్రం ఇచ్చిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలి



హైదరాబాద్, మేజర్‌న్యూస్: రాష్ట్రాభివృద్ధికి కేంద్రం ఇచ్చిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కేంద్రం ఇచ్చిన నిధులు మురిగి పోతున్నాయని, నగరాలు, పట్టణాలలో పరిస్థితి చాలా దారుణంగా ఉందన్నారు. కేంద్రం ఇచ్చే నిధులను పూర్తిసాయిలో ఖర్చు చేయకుండా, నగరాల అభివృద్ధి ఎలా జరుగుతుందని ఆయన ప్రశ్నించారు. కేంద్రం ఇచ్చే నిధులపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులను తెస్తున్నామంటూ ప్రజలను మోసం చేస్తూ..మంత్రి కల్వకుంట్ల తారక రామారావు విదేశీ మోజులో పడ్డారని విమర్శించారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ ప్రచార బృందాలు పర్యటిస్తాయని, ప్రజావ్యతిరేకతపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని డాక్టర్ కె.లక్ష్మణ్ తెలిపారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసం పనిచేస్తాం

హైదరాబాద్, మేజర్‌న్యూస్: ఏపీ హక్కుల సాధన కోసం, రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్టీలకు అతీతంగా అందరితో కలిసి పనిచేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ స్పష్టం చేశారు. జేఏసీ, జేఎఫ్‌సీ ఏర్పాటుపై సోమవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18న విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆ సమావేశంలో అందరి అభిప్రాయాలు సేకరిస్తామని అన్నారు. విభజన హామీలు ఏమున్నాయో, అందులో కేంద్ర ప్రభుత్వం ఎంతవరకు అమలు చేసింది ఇంకా చేయాల్సినవి ఏమున్నాయన్నదానిపై సమగ్రమైన అవగాహనతో ముందుకు వెళ్లాలని ప్రయత్నం చేస్తున్నట్లు ఆయన చెప్పారు. జేపీ, ఉండవల్లి, పవన్‌తో కలిసి ఇదే ఆలోచనతో ముందుకు రావడం సంతోషించదగ్గ విషయమని రామకృష్ణ అన్నారు.

నాలుగేళ్లపాటు ఎందుకు మౌనంగా ఉన్నారు

సీఎంకు విజయసాయిరెడ్డి ప్రశ్న



తిరుపతి, మేజర్‌న్యూస్ : తన వైఫల్యాలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రంలోని ఎన్డీఏ సర్కారుపై రుద్దుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి అన్నారు. ఏపీకి అన్యాయం జరుగుతున్నా నాలుగేళ్లపాటు మౌనంగా ఉన్న వ్యక్తి సీఎం చంద్రబాబు కాదా అని విజయసాయిరెడ్డి ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసమే టీడీపీ ఎంపీలు పార్లమెంట్‌లో గొడవ చేశారని తెలిపారు. ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో చంద్రబాబు ఎందుకు మాట్లాడటం లేదని ఆయన ప్రశ్నించారు. చిత్తూరు జిల్లా తిరుపతిలో విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడారు. ఏపీ ప్రయోజనాల కోసం ప్రతిపక్ష వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు పోరాటం చేస్తూనే ఉన్నారని, కానీ అధికార టీడీపీ నేతలు మాత్రం తమ రాజకీయ లబ్ధి కోసమే పని చేస్తున్నారని మండిపడ్డారు. కేవలం పార్టీ ప్రయోజనాల కోసం పార్లమెంట్‌లో తాము కూడా పోరాడినట్లు టీడీపీ ఎంపీలు వ్యవహరించడాన్ని ఆయన తప్పుపట్టారు.

సంపాదకీయం

editpage@suryaa.com

> “దక్షిణాఫ్రికాలోని కేప్ టౌన్ నగరం మంచి నీటి ఎద్దడిని ఎదుర్కొనబోతున్న తొలి ఆధునిక నగరంగా అపఖ్యాతి మూట కట్టుకోవచ్చు. ప్రస్తుతం దక్షిణాఫ్రికాలో క్రికెట్ సీరీస్ కోసం పర్యటిస్తున్న భారత జట్టు కేప్ టౌన్‌కు వెళ్లిన పుడు ఆ నగర వాసులతో పాటు జట్టు సభ్యులకు కూడా ఆ సమస్య ప్రత్యక్ష అనుభవంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (బిబిసి) అటువంటి నీటి కొరత ఎదుర్కొంటున్న 11 నగరాల జాబితాను వెలువరించింది. మన దేశంలో సిలికాన్ వ్యాలీగా ఖ్యాతినొందిన ఉద్యాన నగరం ‘బెంగళూరు’ పేరు కూడా ఆ జాబితాలో ఉండడం విశేషం. అయితే, బెంగళూరు సమస్యలు కొత్తవేమీ కావు. అవి గతంలోనే వార్తలలో ప్రము ఖంగా చోటు చేసుకున్నాయి. కాని అటువంటి జాబితాలో బెంగళూరు నగరం పేరు కనిపించడం ఇప్పటికీ కలవరపరుస్తోంది. బెంగళూరు నీటి ఇబ్బందులు అధిగమించేవిగా కనిపించకపోవడం దారుణం.(నగరంలోని ట్రాఫిక్ సమస్యల గురించి కొందరు అదే మాట అంటుంటారు.) దేశంలోని అనేక ప్రాంతాలలో సుదీర్ఘ కాలంగా నీటి కొరత నెలకొని ఉన్నప్పటికీ ఆ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి నవ్యంగా లేదు. ప్రభుత్వం మందకొడిగా, హ్రస్వ దృష్టితో వ్యవహరిస్తోంది.”

నగరాలకు సవాల్‌గా తాగునీటి కొరత

నలుపక్కలా నీరు ఉన్నా తాగు నీటికి సమస్యే. దీవుల వాసులకు, సాగరయానం చేసేవారికి ఎదురయ్యే ప్రధాన సమస్య అది. తదుపరి యుద్ధాలు నీటి కోసమే జరుగుతాయని కొందరు జోస్యం చెబుతున్నారు కూడా. వాస్తవానికి అమెరికాలోని కాలిఫోర్నియాలో పెను సమస్యగా ఉన్న నీటి కొరత అంశంపై ప్రముఖ సైన్స్ నవలలు రెండు వెలువడ్డాయి కూడా. పాలో బాసి గలుపి రాసిన ‘ది వాటర్ నైఫ్’, క్లెయిర్ వయె వాట్కిన్స్ రాసిన ‘గోల్డ్ ఫేమ్ సిట్రస్’ పుస్తకాలు రెండూ 2015లో ప్రచురితమయ్యాయి. కాలిఫోర్నియా రాష్ట్రం చరిత్రలో అత్యంత తీవ్రమైన నీటి ఎద్దడి ఎదుర్కొన్న సంవత్సరాలలో ఒకటి 2015. వాస్తవానికి అమెరికా నుంచి ఆస్ట్రేలియా, ఆఫ్రికా వరకు, తుదకు మన భారతదేశంలో కూడా గర్వకారణమైన నగరాలు దారుణమైన నీటి కొరతతో సతమతం అయ్యాయి... అవుతున్నాయి.

దక్షిణాఫ్రికాలోని కేప్ టౌన్ నగరం మంచి నీటి ఎద్దడిని ఎదుర్కొనబోతున్న తొలి ఆధునిక నగరంగా అపఖ్యాతి మూట కట్టుకోవచ్చు. ప్రస్తుతం దక్షిణాఫ్రికాలో క్రికెట్ సీరీస్ కోసం పర్యటిస్తున్న భారత జట్టు కేప్ టౌన్‌కు వెళ్లినప్పుడు ఆ నగర వాసులతో పాటు జట్టు సభ్యులకు కూడా ఆ సమస్య ప్రత్యక్ష అనుభవంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (బిబిసి) అటువంటి నీటి కొరత ఎదుర్కొంటున్న 11 నగరాల జాబితాను వెలువరించింది. మన దేశంలో సిలికాన్ వ్యాలీగా ఖ్యాతినొందిన ఉద్యాన నగరం ‘బెంగళూరు’ పేరు కూడా ఆ జాబితాలో ఉండడం విశేషం. అయితే, బెంగళూరు సమస్యలు కొత్తవేమీ కావు. అవి గతంలోనే వార్తలలో ప్రముఖంగా చోటు చేసుకున్నాయి. కాని అటువంటి జాబితాలో బెంగళూరు నగరం పేరు కనిపించడం ఇప్పటికీ కలవరపరుస్తోంది. బెంగళూరు నీటి ఇబ్బందులు అధిగమించేవిగా కనిపించకపోవడం దారుణం. (నగరంలోని ట్రాఫిక్ సమస్యల గురించి కొందరు అదే మాట అంటుంటారు.) దేశంలోని అనేక ప్రాంతాలలో సుదీర్ఘ కాలంగా నీటి కొరత నెలకొని ఉన్నప్పటికీ ఆ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి నవ్యంగా లేదు. ప్రభుత్వం మందకొడిగా, హ్రస్వ దృష్టితో వ్యవహరిస్తోంది. స్వేచ్ఛా విపణి ఆర్థిక సూత్రాలను, మన కన్నా చిన్నవైన ఇతర దేశాలు నీటి కొరతను అధిగమించేందుకు అనుసరించిన సాంకేతిక, ఆధునిక పద్ధతులను అంగీకరించేందుకు ప్రభుత్వం సుముఖత కనబరచడం లేదు.

మరొక విధంగా చెప్పాలంటే భారత్ నికర నీటి ఎగు మతిదారుగా కొనసాగుతోంది. అంటే, నీటి వాడకం అధికంగా అవసరమైన వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసే దేశంగా ఉంటోందని అర్థం. క్షార జలాన్ని శుద్ధి చేసే సాంకేతిక పద్ధతులను అనుసరించడంలో దేశం నింపాదిగా వ్యవహరిస్తోంది. ఇజ్రేల్ వంటి కొన్ని దేశాలు ఆ విషయంలో చాలా ముందడుగు వేశాయి. ఇంకా చెప్పాలంటే చాలా దశాబ్దాల క్రితమే అవి ఆ పద్ధతులను అనుసరించసాగాయి. నదులలో కాలుష్యం కూడా మన దేశంలో మంచి నీటి కొరతను తీవ్రం చేస్తున్నది. కేంద్రంలో గాని, రాష్ట్రాలలో గాని ఏ ప్రభుత్వం వచ్చినా నదుల ప్రక్షాళన గురించి ప్రకటనలు చేస్తుంటాయి. కాని అవి శుష్క ప్రియాలుగానే మిగిలిపోతున్నాయి. స్థానిక పరిశ్రమలు, జనావాసాలు నదులను మురుగు నీటి కాలువలుగా ఉపయోగించుకుంటున్నాయి.

ఇది ఇలా ఉండగా, దేశంలో శీఘ్రగతిని సాధిస్తున్న ప్రగతి వల్ల నగరాలలో జనాభా ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయింది. అంతే కాదు. నగరాలలో నిర్మాణాలు కూడా ఉద్ధృతంగా సాగుతున్నాయి. వాటిలో చాలా వరకు నియంత్రణ కరవవుతోంది అనేది వేరే విషయం. ఉదాహరణకు, బెంగళూరులో ఒకప్పుడు నగరానికి నీటి సరఫరాకు ఉపయోగించిన మంచినీటి చెరువులను ఆక్రమించి భవనాలు నిర్మించారు. హైదరాబాద్ వంటి నగరాలలో కూడా చెరువులు అటువంటి పరిస్థితికే గురయ్యాయి. దేశ రాజధాని న్యూఢిల్లీలో యమునా నది ప్రవాహ ప్రాంతంలో ఆక్రమణలు చోటు చేసుకున్నాయి. మరొక వైపు ఆ నది ఒక డ్రెయి న్‌గా కూడా కనిపిస్తోంది. కాలుష్య కాసారాలుగా మారిన గంగ, యమున వంటి నదుల ప్రక్షాళనలో అలక్ష్యం వహిస్తున్న ప్రభుత్వాలకు, నగర పాలక సంస్థలకు ఉన్నత న్యాయస్థానాలు ఎప్పటికప్పుడు మొట్టికాయలు వేస్తున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు. నగరాలలో నీటి పైప్‌లైన్లు తగినన్ని ఉన్నా వాటిలో చాలా వరకు పాతబడిపోయాయి. అటువంటి పైప్‌లైన్ల ద్వారా సంఫరా అయ్యే నీరు వృథాగా పోతుంటాయి. నగరాలలోని నీటి సరఫరా సంస్థలు లేదా విభాగాలు ఆ పైప్‌లైన్లను, నీటి సరఫరా వ్యవస్థను ఎలా నిర్వహిస్తున్నాయో అంతుపట్టడం లేదు. అదే విధంగా నీటి చార్జీల నిర్ణయం కూడా గందరగోళంగానే ఉంటున్నది. కొన్ని నగరాలు ఈ విషయంలో ప్రైవేట్ సంస్థలను ఆశ్రయించాయి. కాని ఏ విధంగాను మెరుగుదల కానరావడం లేదు. కాగా, బిబిసి జాబితాలో బెంగళూరు పేరు ఉండడం దేశంలోని ఇతర నగరాలకు మేలుకొలుపు కావాలి. మెరుగైన ప్రణాళికా రచన, మార్కెట్ ఆధారిత ఆలోచన, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ఆ నగరాలకు ఆవశ్యకం. ముఖ్యంగా స్థానిక జనాభాను, ప్రభుత్వాలను ఈ ప్రక్రియలో భాగస్వాములను చేసినట్లయితే ప్రయోజనకరంగా ఉంటుంది. బెంగళూరు విషయంలో ఇప్పటికే ఆలస్యం అయి ఉండవచ్చు. కాని దేశంలోని ఇతర నగరాలు ఈ విషయంలో ముందుకు అడుగు వేసేందుకు అవకాశం ఇంకా ఉంది. దేశంలో నదులను అనుసంధానించి ఉంటే ఇప్పుడు ఈ సమస్య తలెత్తి ఉండేది కాదనే అభిప్రాయాన్ని కొందరు విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇందిరా గాంధి ప్రధానిగా ఉన్నప్పుడు నీటిపారుదల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన సుప్రసిద్ధ ఇంజనీర్ కెఎల్ రావు నదుల అనుసంధానానికి ప్రతిపాదన చేశారు. కాని అది ఆచరణ సాధ్యం కాదంటూ అధికారులు అడ్డం కొట్టడంతో అది వెనుకకు వెళ్లిపోయింది. ఆమధ్య డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలామ్ రాష్ట్రపతిగా ఉన్నప్పుడు నదుల అనుసంధానం గురించి ప్రతిపాదన చేశారు. దానితో ఆ విషయమై కొంత చర్చ జరిగి ఆగిపోయింది. ఇప్పుడైనా నదుల అనుసంధానం విషయమై ముందుకు అడుగు వేస్తే నీటి సమస్యకు ఒక పరిష్కారం లభించవచ్చు.

ఇక ప్రత్యక్ష పోరుకు ‘దేశం’ సిద్ధం



ఇస్కా రాజేష్‌బాబు,
‘సూర్య’ అమరావతి బ్యూరో చీఫ్, 96520 39780

- విభజన హామీలపై వెనక్కి తగ్గబోమన్న దేశం ఎంపీలు
- ప్రత్యేకంగా ఇచ్చిన నిధులు ఎక్కడని కేంద్రానికి నిలదీత
- బిజెపి నేతలది అంతా అంకెలగారడి అని మండిపాటు
- అదిగో... ఇదిగో అన్న రైల్వేజోన్ ఎక్కడ అని సూటి ప్రశ్న
- వెనుక బడిన జిల్లాలకు సహాయం ఏమాత్రం?

విభజన సమస్యలతో సతమతమవుతున్న నవ్యాంధ్రకు కేంద్రం చేసిన అన్యాయంపై ప్రజాప్రతినిధులు ప్రత్యక్షపోరుకు సిద్ధమయ్యారు. కేంద్రంపై ఇక అధికార పార్టీ దూకుడుగా వెళ్లేందుకు మానసికంగా సిద్ధమైంది. విభజన హామీలు తీర్చాల్సిందేనని పట్టుపట్టేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణా ళిక రూపొందించింది. మరోవైపు విభజన హామీలపై ఎంపీలు చేసిన ఆందోళన పై దర్శకుడు రాంగోపాల్ వర్మ చేసిన ట్వీట్‌పైనా అధికార పార్టీ నేతలు మండి పడుతు ఖన్నారు. సినిమాలు తీసుకునే వారువాటిని వదిలి రాజకీయాలు చేయ డంపై ధ్వజమెత్తారు. మరోవైపు పవన్ కళ్యాణ్ ఏర్పాటు చేసిన జేఏసీపై కూడా అధికార తెలుగుదేశం కన్నేసి సమగ్ర సమాచారం సేకరించే పనిలో ఉంది...’మిగతా రాష్ట్రాలకు ఇచ్చినట్లే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికీ నిధులిచ్చారు. అదేదో ప్రత్యేకంగా నవ్యాంధ్రకే ఇచ్చినట్లు చెబుతున్నారు. ఏపీ కూడా దేశంలో భాగం గా ఉంది. మనకు రావలసిన దానికోసం ప్రతిసారీ కేంద్రాన్ని అడుక్కోవాలా? భిక్షాపాత్ర పట్టుకుని వెళ్లాలా? ఏమనుకుంటున్నారంటూ బీజేపీ నేతలపై టీడీపీ మండిపడుతోంది. రాష్ట్రానికి సాయం చేయకుండా జాప్యం చేసేందుకు జాతీయ స్థాయిలో ఆ పార్టీ ఎత్తులు వేస్తుండగా రాష్ట్రస్థాయిలో బీజేపీ అసంబద్ధమైన అంకెలను చెబుతోందని ఆరోపించారు. జాతీయరహదారులకు రూ.లక్ష కోట్లుఇచ్చారా? మూడేళ్లలో ఇచ్చింది రూ. 5,900 కోట్లు. అదీ మొత్తంగా కేంద్రం జేబులో నుంచి కాదు. పబ్లిక్-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) ప్రాజెక్టులు, టోల్ రోడ్ల రూపంలోనే. అలాంటి జాతీయ రహదారుల ప్రాజెక్టులు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర ఇలా ప్రతి రాష్ట్రానికీ ఇచ్చారు. ఇళ్ల కోసంప్రధానమంత్రి ఆవాస్‌యోజన (పీఎంఏవై) కింద రూ.7,952 కోట్లు ఇచ్చామన్నారు. మూడేళ్లలో ఇచ్చింది రూ.1038 కోట్లే. పైగా పీఎంఏవై కింద దేశం మొత్తానికీ ఇచ్చారు. అవన్నీ మన రాష్ట్రానికే ఇచ్చినట్లు చెబుతున్నారు. నష్టపోయిన రాష్ట్రానికి ఇస్తామన్న ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చారా? ప్రత్యేక హోదాతో సమానంగా అన్నీ చేస్తామన్న ఆ ప్యాకేజీలో రావలసింది రూ.16,447కోట్లు కాగా ఇచ్చింది రూ.400 కోట్లు. పునర్విభజన చట్టంలో ఉన్న 19 హామీలు, నాటి ప్రధాని ఇచ్చి న ఆరు హామీలు అమలు చేశారా? టీడీపీ ఎంపీలు అడిగేది న్యాయ సమ్మతమై నదేనని కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, శివసేన, టీఆర్ఎస్, అకాలీదళ్, ఎన్సీ పీ ఇలా అన్ని పార్టీల ఎంపీలు పార్లమెంటు లోపల, బయట రాజకీయాలకు అతీతంగా చెప్పారు. కేంద్రం, ప్రధాని మోదీ ఏపీకి న్యాయం చేయాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు.

ఏపీకి జరిగిన అన్యాయం ఇప్పుడు జాతీయ అంశంగా మారింది. బీజేపీని మనం నమ్మగలమా. మనల్నీ ఇలాగే మోసం చేస్తుందేమోనని అన్ని పార్టీలూ సందేహిస్తున్నాయి. అమరావతి, పోలవరం, రెవెన్యూలోటు, ప్రత్యేక ప్యాకేజీ, రైల్వేజోన్‌పై బీజేపీ నేతలు మాట్లాడడం లేదు. ముఖ్యమైన ఈ ఐదు అంశాలను వదిలేసి మిగతావన్నీ చెబుతున్నారు. అమరావతి నిర్మాణానికి రూ.1.3 లక్షల కోట్లు అవుతుందని అంచనా. అందులో రూ.48 వేల కోట్లు అసెంబ్లీ, సచివాలయం, ముఖ్యమంత్రి కార్యాలయం, రాజ్‌భవన్ తదితరాలతో పాటు మౌలిక వసతుల కల్పనకు ఖర్చవుతుంది. ఇందులో ఇప్పటివరకు రూ.2,500 కోట్లు ఇచ్చామంటున్నారు. ఇంకో రూ.1000 కోట్లే ఇస్తామంటున్నారు. గుంటూరులో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికే రూ.1000 కోట్లయితే రాజధానికి కేంద్రం ఇచ్చేది రూ.3,500 కోట్లేనా? పోలవరం జాతీయ ప్రాజెక్టు. మేమే పూర్తి చేస్తామన్నారు. భూసేకరణ, పునరావాసానికి రూ.33 వేల కోట్లు ఇస్తామని ఇవ్వలేదు. ఇంతవరకూ రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన ఖర్చు వెనక్కివ్వలేదు. దుగరాజపట్నం పోర్టుకు ప్రత్యామ్నాయం చూపలేదు. రామాయపట్నంలో పోర్టు పెట్టాలని ఎప్పుడో చెప్పినా ఫలితంలేదు. కడప ఉక్కు కర్మాగారం సాధ్యం కాద న్న నివేదిక ఎప్పుడొచ్చింది? ఇప్పుడేవచ్చిందా? ఏళ్లతరబడిఆలోచిస్తూనే ఉం టారా? రైల్వే మంత్రి మాటలను బట్టి రైల్వే జోన్ రాదని తెలుస్తోంది. బుందేల్ ఖండ్‌కు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కింద రూ.6 వేల కోట్లు ఇచ్చారు. ఏపీలోని ఏడు జిల్లాలకు మూడేళ్ల కాలానికి రూ.1050 కోట్లే ఇచ్చారు. దేశంలో ఒక రాష్ట్రంగా ఏపీకి ఇచ్చినవాటిని చెబితే ఎలా? ఆసాయమైనా ఊరికే ఇచ్చే దా. దానమా? ప్రతిసారీ కేంద్రాన్ని అడుక్కోవాలా? భిక్షాపాత్ర పట్టుకుని వెళ్లా లా? న్యాయబద్ధంగా.. దేశంలో భాగంగా ఉన్నందుకు రావలసినవి కూడా అడుక్కోవాలా? అని ఎంపీలు ప్రశ్నిస్తున్నారు. కర్ణాటక మెట్రోకు రూ.17 వేల కోట్లు, మహారాష్ట్రకు వేల కోట్లు కేటాయించి విజయవాడ, విశాఖపట్నం మెట్రోలకు ఏమీ ఇవ్వరా అని ప్రశ్నించారు. ఆంధ్ర గుర్తుకురాదా? ప్రపంచంలో అత్యు త్తమ రాజధాని నిర్మించుకోవాలని ఆంధ్రులు కలలు కనకూడదా? ఢిల్లీని తలదన్నే రాజధానికి సాయంచేస్తామని మోదీయే ప్రకటించారు. ఆకలేసినప్పుడే అన్నం పెట్టాలి. అలా కాకుండా చేస్తాం చూస్తామంటే ఎంతకాలం? కేంద్రంపై ఒత్తిడికి ప్రతి ఒక్కరూ కలిసిరావాలి. జాతీయస్థాయి విద్యాసంస్థల ఏర్పాటుకు రాష్ట్రం రూ.12వేల కోట్ల విలువైన భూములిచ్చింది. ఆ సంస్థలకు మౌలిక సదుపాయాల కల్పనకే రూ.11 వేల కోట్లు అవుతుంది. కానీ కేంద్రం ఇప్పటివరకూ ఇచ్చింది కేవలం రూ.450 కోట్లు. భవనాలకు నిధులిచ్చే బాధ్యత కేంద్రానిది కాదా అని ప్రశ్నించారు.



రాష్ట్ర విభజన తరువాత టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఇన్నాళ్లు మౌనం దాల్చారు. ఇప్పుడు పార్లమెంటు వేదికగా పోరాటం చేయాలని తన ఎంపీలకు ఆదేశిలిచ్చారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై పార్ల మెంటు వేదికగా ఇక ఆ పార్టీ ఎంపీలు గళం విప్పనున్నారు. అమరావతిలోని చంద్రబాబు నివాసంలో జరిగిన పార్టీ పార్లమెంటరీ సమావేశంలో కీలక నిర్ణయాలు లేవు. కానీ విడతల వారీగా ఎన్డీఏ ప్రభుత్వానికి టీడీపీ ఎంపీలు తమ నిరసన తెలపనున్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎంపీలందరూ పార్ల మెంటులో తమ గళాన్ని గట్టిగా వినిపించాలని చెప్పడంతో నేతలు ఇందుకు సిద్ధమవుతున్నారు. అవసరమైతే సభను స్తంభింపజేయాలని చంద్రబాబు చెప్పారంటున్నారు. బీజేపీ పొత్తు నుంచి వైదొలుగుతారనే ప్రచారం రావడంతో జాతీయ మీడియా అంతా అమరావతి పరిణామాలపై దృష్టి సారించింది. కానీ చంద్రబాబు ఆ పని చేయలేదు. ఇంకా వేచి చూసే ధోరణితోనే ఉన్నారని చేతల ద్వారా అర్థమవుతోంది. అదే సమయంలో ప్రతిపక్ష నేత జగన్ మాత్రం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నాడని ఆ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని చంద్ర బాబు చెప్పారు. వరుసగా నాలుగు బడ్జెట్లను చూశాం. ఇక సహనంతో ఉంటే జనాలు మనలను పక్కన పెడతారని చెప్పారు చంద్రబాబు. కేంద్రంతో ఇక అటో ఇటు తేల్చుకునే దిశగా కదులుతోంది టీడీపీ సైన్యం. మనకు న్యాయంగా దక్కాల్సిన ప్రయోజనాలు వచ్చేంత వరకు పోరాటం ఆపకుండానే కొనసాగా లనేది చంద్రబాబు తీసుకున్న నిర్ణయం. బీజేపీ కావాలని ఏపీని అణగదొక్కే ప్రయత్నం చేస్తుందని ఎంపీలు ఈ సమావేశంలో నిప్పులు చెరిగారు. మిత్ర పక్షంగా ఉన్నా కేంద్రం ఇలా చేయడం పట్ల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రమంత్రులు రాజీనామా చేయాలని ఎంపీలు డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి సుజనాచౌదరి ఈ సమావేశానికి హాజరవడమే కాకుండా మీడియాతోను ఆ సంగతి చెప్పారు. అశోకగజపతిరాజు ఈ భేటీకి రాకపోయినా ఎంపీలు తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పారాయన.

మరోవైపు బీజేపీ ఎమ్మెల్సే సోము వీర్రాజు దూకుడు ఏ మాత్రం తగ్గలేదు. రెండు ఎకరాల ఆసామి రెండు లక్షల కోట్లు ఎలా సంపాదించాడని సిఎం చంద్రబాబు పై నిప్పులు చెరిగారాయన. అమిత్ షాతో భేటీ తర్వాత బీజేపీ స్థానిక నేతలు దూకుడు తగ్గిస్తారని అంతా భావించారు. కానీ సోము వీర్రాజు అంతకు ముందు కంటే మరింత ఎక్కువగా చంద్రబాబుపై విమర్శలు గుప్పించడం ఆశ్చర్యకరం. కేంద్ర ప్రభుత్వ పథకాలను తనవిగా చెప్పుకుంటూ చంద్రబాబు ప్రచారం చేసుకుంటున్నారని బీజేపీ నేత ఆరోపించారు.

రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన నిధులు, వాటిని ఏ మేరకు ఖర్చు పెట్టారనే దానిపై లెక్కలు చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ డిమాండ్ చేయడంతోపాటు నిధుల వివరాలతో ఈ నెల 15లోగా శ్వేతపత్రం విడుదల చేయాలని గడువు విధించారు. లేకపోతే భవిష్యత్ కార్యాచరణ గురించి ఆలోచిస్తానని వెల్లడించారు. బీజేపీ, టీడీపీ వాళ్లు చెబుతున్న వాటిపై తాను గందరగో ళంలో ఉన్నానని చెప్పారు. ప్రత్యేక హోదా హామీ నెరవేరలేదనే అసంతృప్తి తనకూ ఉందన్నారు. ఉండవల్లి, జేపీ వంటి మేధావులతో ఏర్పడే నిజనిర్ధారణ కమిటీ వాటిపై అధ్యయనం చేసి అబద్ధాల లెక్క తేలుస్తుందని చెప్పారు.

జనసేన అధినేత పవన్ కళ్యాణ్, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ భేటీపై తెలుగుదేశం ఆరా తీస్తోంది. వారిద్దరి మధ్య ఎలాంటి అంశాలు చర్చకు వచ్చాయి. వాస్తవం ఏంటనే విషయంపై కూపీ లాగుతోంది. పవన్ కళ్యాణ్ అనుచరులు, కీలక వ్యక్తుల నుంచి ఈ సమాచారం తెలుసుకునేందుకు పావులు కదపడం ఆసక్తికరంగా మారింది.

(రేపు తరువాయి)

తమిళనాట కమల్, రజనీ పార్టీల పొత్తు?

సత్య ఎం.వి.ఎస్ - హైదరాబాద్
833011972

- రజనీకి స్నేహ హస్తం అందించేందుకు సిద్ధమన్న కమల్
- కాషాయంతో జత కడితే పొత్తు ఉండదని స్పష్టీకరణ
- మిత్రత్వం, రాజకీయాలు వేర్వేరుగా చూడాలని సూచన
- జనం కోసం పార్టీకి సంబంధించి అంతర్జాలం ఏర్పాటు
- ఎన్నికలలో గెలవటం కాదు మంచి చేయటమే లక్ష్యం

దేశంలో తమిళ రాజకీయమంత గందరగోళం మరొకటి ఉండదు. జయలలిత మరణం తర్వాత ట్విస్ట్ల మీద ట్విస్టు... షాక్‌ల మీద షాకులు. అయితే సినిమా స్టార్లు రజనీ, కమల్ హాసన్ కూడా పొలిటికల్ ఎంట్రీ ఇవ్వడంతో రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారాయి. తమిళనాడులో రాజకీయాలు కాక వుట్టిస్తున్నాయి. సూపర్ స్టార్లు కమల్ హాసన్, రజినీకాంత్ కొత్త పార్టీలతో ప్రజల ముందుకు రానుండటంతో ఆ రాష్ట్ర రాజకీయాలు వేడెక్కనున్నాయి. ఇద్దరూ కూడా ’రాజకీయాల్లో మార్పు’ నినాదంతో ముందుకు వస్తున్నందున జతకడతారా అనే ప్రశ్న కూడా వినిపిస్తోంది. నిన్నటి వరకు ఎడ మొహం పెడ మొహంగా ఉండే ఈ స్టార్ హీరోలు ఇప్పుడు ఒకరికొగరు తెగ పొగిడేసు కుంటున్నారు. ఒకరి కోసం మరొకరు అన్నంతలా కాస్త రూటు మార్చినట్లు కనిపిస్తోంది. కమల్ చేసిన తాజా వ్యాఖ్యలు ఇప్పుడు తమిళ రాజకీయ వర్గా లలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ మధ్య కమల్ రాజకీయాలతో పాటు కీలక విషయాలను ప్రస్తావించారు. భవిష్యత్ వ్యూహాలపై ఓ ప్రతికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అనేక ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేయటమే కాదు. రాష్ట్ర రాజకీయాలపై రజనీ రాజకీయ ప్రవేశంపైనా తీవ్రంగా స్పందించారు.

ఇప్పటికే రాజకీయాల్లోకి వస్తున్నట్టు ప్రకటించిన కమల్‌కు పొత్తుల ప్రస్తావన విషయంలో స్పందిస్తూ, రజనీ కూడా పార్టీ పెట్టేస్తున్నారు. ఆయనతో దోస్తీ విషయంపై ఇప్పటికిప్పుడు తీసుకునే నిర్ణయం కాదని వ్యాఖ్యానించారు. అయితే ఇవన్నీ మాకు ఉండే రాజకీయ విధానాలను బట్టి నిర్ణయం ఉంటుందనితేల్చి చెప్పడంతో ఇక ముందు ఇద్దరి మధ్య పొత్తులకు కూడా అవకాశం ఉందని చెప్పకనే చెప్పాడు. అదే కనుక జరిగితే... రజనీ కమల్ ప్రతిపాదనపై ఎలా స్పందిస్తారన్నది కూడా కీలకమే. అయితే వీరిద్దరు రాజకీయాల్లో చేతులు కలిపితే సూపర్ సక్సెస్ అయ్యే ఛాన్స్ కూడా ఉంటుందంటున్నారు రాజకీయ పండితులు.



నిజానికి రజనీకాంత్, కమల్ హాసన్ సినీరంగంలో మంచి స్నేహితులు.. సినీ పరిశ్రమలోకి ప్రవేశించిన మొదట్లో కలిసి ప్రయాణం చేశారు. కలిసి సినిమాల్లో నటించారు. సూపర్‌స్టార్లుగా ఎదిగారు. ఇప్పుడు రాజకీయాల్లోకి వస్తున్నారు. రాజకీయాల్లోనూ వీరిద్దరి మధ్య ఆ స్నేహబంధం వెల్లివిరిస్తుందా? ఈ ఇద్దరూ కలిసి పోటీ చేసే అవకాశముందా? రజనీ-కమల్ మధ్య పొత్తు కుదురుతుందా? అంటే ఇప్పటికిప్పుడు ఇథమిత్థంగా చెప్పలేని పరిస్థితి.

అయితే, రజనీతో పొత్తు పెట్టుకోవడం కుదరదని కమల్ తాజాగా సంకేతాలు ఇస్తుండటం గమనార్హం. రజనీకాంత్ రాజకీయాల్లో కాషాయ రంగు ఛాయలు కనిపిస్తున్నాయి. అది మారకపోతే.. అతనితో నేను పొత్తు పెట్టుకునే అవకాశం లేదు. మేం మంచి స్నేహితులమే కానీ రాజకీయాలు భిన్నమైనవి అని కమల్ ఆదివారం తేల్చేశారు. రజనీ బీజేపీ అనుకూల విధానాలు వీడకపోతే.. ఆయనతో కలిసి వెళ్లే ప్రసక్తే లేదని కమల్ స్పష్టం చేశారు.’రజనీ రాజకీయాల్లో ’కాషాయం’ జోడింపు ఉంటుందనే మాట వినిపిస్తున్న క్రమంలో అది వదులు కుంటేనే పొత్తుపై దృష్టి సారించే అవకాశం ఉందన్న భావన కమల్ వ్యక్తం చేస్తున్నా... మిత్రత్వం వేరు, రాజకీయాలు వేరు’ అని కమల్ చెపుతు న్నా, రానున్న ఎన్నికలలో ఇద్దరు కలసి పోటీకి దిగటం వల్ల రాజకీయంగా ఇరువురికీ లాభం చేకూరుతుందని, అధికారంలోకి వచ్చే అవకాశం కూడా లేక పోలేదన్నది రాజకీయ వర్గాల విశ్లేషణ. ఎన్నికల్లో చేతులు కలపాల్సి వస్తే.. తాను, రజినీ తప్పనిసరిగా ఆలోచించాల్సి ఉంటుందని, అన్నివర్గాల ప్రజలు పాల్గొనేలా తమ పార్టీ తరపున ఓ ఇది రూపకల్పన చేయబడిందన్నారు. ఇందు లో ప్రజల కు తక్షణ అవసరాలైన ఆరోగ్యం, విద్య, పర్యావరణం, వ్యవసాయం, ఫైనాన్స్, అనేక రంగాల విషయాలపై తమను తాము నమోదు చేసుకోనేలా రూపొందించారాయన. ముందస్తు రాజకీయ ప్రణాళికతో కమల ముందుకు సాగుతున్నప్పటికీ రజనీ కాంత్ పార్టీ వ్యవహారం ఎన్నికల తేదీ విషయమై ఓ స్పష్టమైన ప్రకటన వచ్చేవరకు తేలే పరిస్థితి కనిపించడం లేదు. కాగా ఇక రాజకీయాల్లో గెలవడమంటే అభ్యర్థులను ఎంపిక చేసి, మెజారిటీతో గెలిచి, ముఖ్య మంత్రి అయిపోవడం ఒక్కటే రాజకీయ పార్టీగా చేయాల్సిన ప్రక్రియ కాదని ప్రజల నమ్మకాన్ని కోల్పోకుండా, వారికి మంచి చేయడం కూడా గెలుపేనంటూ కమల్ చేస్తున్న ప్రకటనలపై రజనీ కాంత్ ఇప్పటి వరకు స్పందించలేదు. అయితే బిజెపితో జతకలిసి రజనీ వెళ్లాలని భావించినా, ఇటీవల కొంత కాలంగా ప్రక్కరాష్ట్రాలలో బిజెపి మిత్రపక్షాలతో వ్యవహరించిన తీరును గమనించి ముందుకు సాగాలన్న హెచ్చరికలు ప్రారంభం కావటం విశేషం.

మీ లేఖలు, వ్యాసాలు పంపవలసిన చిరునామా:
Editor, Surya, Surya Soudha, Plot.No.185, MCH no. 258/1/185, Siddi vinayk nagar,
Opp:Hi-Tech City, Hyd-57
Mail: e d i

చరిత్రలో ఈరోజు

ఫిబ్రవరి 13

1879: సరోజినీ నాయుడు, భారత కోకిల జననం.
1880: గట్టి లక్ష్మీనరసింహ శాస్త్రి, సుప్రసిద్ధ పండితులు జననం.
1914: మాదాల నారాయణస్వామి, సీనియర్ కమ్యూనిస్టునేత జననం
1930: నూతి శంకరరావు, ఆర్యసమాజ్ కు చెందిన ప్రముఖ జననం. నిజాం వ్యతిరేక ఉద్యమం వహించాడు.
1972: నూనె శ్రీనివాసరావు, సామాజిక శాస్త్రవేత్త జననం.
2014: బాలు మహేంద్ర, ఛాయాగ్రహకుడు, దర్శకుడు మరణం.
2015: పి. కేశవ రెడ్డి, ప్రముఖ తెలుగు నవలా రచయిత మరణం.
2015: ఎస్.మునిసుందరం కవి, నాటకరచయిత, కథకుడు, నటుడు మరణం.

ఎస్. మునిసుందరం

ఎస్.మునిసుందరం కవి, నాటకరచయిత, కథకుడు, నటుడు. ప్రముఖ రచయిత మునిసుందరం. ఆయన 1937, సెప్టెంబర్ 14న జన్మించి, ఫిబ్రవరి 13, 2015న మరణించారు. మునిసుందరం గారి ప్రాథమిక విద్య వీధిబడిలోను మాధ్యమిక విద్య తిరుపతిలోను నడిచింది. మెట్రిక్ నుండి ఎం.ఏ వరకు ప్రైవేటుగా చదివారు. చిన్నప్పుడు పల్లెలలో జరిగే జానపద కళల ప్రదర్శనలు చూసి కళలపట్ల అభిరుచిని ఏర్పరచుకున్నారు. ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణ చేసిన ఈయన తుది శ్వాస విడిచే వరకు సాహితీ వ్యవసాయం సాగిస్తూ జిల్లా రచయితల సంఘంలో క్రియాశీల పాత్ర పోషించారు. కథలు, కథానికలు, నవలలు, నాటకాలు అనేకం రాశారు. ఈయన రచించిన నాటకాలలో ఏ విలువలకు ఏ ప్రస్థానం సుప్రసిద్ధమైంది.

సరోజినీ నాయుడు



సరోజినీ నాయుడు ఫిబ్రవరి 13, 1879న జన్మించి, మార్చి 2, 1949న మరణించారు. భారత కోకిల (నైటింగేల్ ఆఫ్ ఇండియా)గా ప్రసిద్ధి చెందిన ఈమె స్వాతంత్ర్య సమరయోధురాలు, కవయిత్రి. సరోజినీ దేవి 1925 డిసెంబరులో కానుపూరులో జరిగిన అఖిల భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలకి తొలి మహిళా అధ్యక్షురాలు, స్వతంత్ర భారత దేశవు తొలి మహిళా గవర్నరు కూడా. తండ్రి అఘోరనాథ్ చటోపాధ్యాయ హైదరాబాదు కాలేజికి అనగా నేటి నిజాం కాలేజీ మొట్టమొదటి ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసారు. తల్లి వరదాదేవి చక్కని రచయిత్రి. స్వాతంత్ర్య సాధనలో తనూ పాలుపంచుకోవాలని ఆలోచించిన శ్రీమతి సరోజినీ నాయుడు కాంగ్రెస్ జాతీయ భావాలకు అనుగుణంగా నడుచుకోనారంభించింది. 1915వ సంవత్సరం బొంబాయిలో జరిగిన కాంగ్రెస్ మహాసభలకూ, 1916లో జరిగిన లక్నో కాంగ్రెస్ సభలలో ఆమె పాల్గొనటం జరిగింది. ఆనాటి కాంగ్రెస్ భావాలు చాలా ఆదర్శంగా ఉండేవి. సరోజినీనాయుడు భారత దేశములో గల ముఖ్యమైన, నగర, పట్టణాలు తిరుగుతూ స్వాతంత్ర్యోద్యమ ఉపన్యాసాలిచ్చి, ప్రజలతో భాష విప్లవము వచ్చేందుకు కారకురాలయింది.

బాలు మహేంద్ర



బాలు మహేంద్ర 20 మే 1939న జన్మించి, ఫిబ్రవరి 13, 2014న మరణించారు. ఆయన చలనచిత్ర దర్శకుడు, రచయిత, నిర్మాత, ఛాయాగ్రాహకుడు, ఎడిటర్. బాలు దక్షిణభారతీయ సుప్రసిద్ధ ఛాయాగ్రహకుడు, దర్శకుడు. కళాత్మక చిత్రాలను తీయడంలో పేరుగాంచిన ఈయన ఇప్పటివరకు ఐదు జాతీయ అవార్డులు అందుకున్నారు. మొదట ఛాయాగ్రాహకుడిగా తమిళచిత్ర సీమలో ప్రవేశించారు. అనంతరం ఆయన స్క్రీన్ ప్లే, దర్శకత్వ, నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టి తనదైన శైలిలో చిత్రాలను రూపొందించారు. సొమ్మొకడిది సోకుకడది, తరం మారింది, లంబాడోళ్ల రాందాసు, మనవూరి పాండవులు, శంకరాభరణం తదితర చిత్రాలకు ఆయన ఛాయాగ్రాహకుడిగా పనిచేశారు. తమిళం, హిందీ, మలయాళం, కన్నడ, తెలుగు భాషల్లో ఆయన పలుఅద్భుతమైన సినిమాలు తెరకెక్కించారు.



భారత యువ ఇంజనీర్‌కు సైన్స్-టెక్ ఆస్కార్ అవార్డు

న్యూఢిల్లీ: ముంబైలో పెరిగిన యువ ఇంజనీరు వికాస్ సతాయేని ప్రతిష్ఠాత్మక ఆస్కార్ అవార్డు వరించింది. అమెరికాలోని బెవర్లీ హిల్స్‌లో శనివారం నాడు నిర్వహించిన ఆస్కార్స్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ అవార్డ్స్–2018 ప్రదానోత్సవంలో సైంటిఫిక్ అండ్ ఇంజనీరింగ్ అవార్డును గెల్చుకున్న నలుగురు సభ్యుల బృందంలో వికాస్ కూడా ఒకరు కావడం విశేషం. 'షాట్‌ఓవర్ కే1 కెమెరా సిస్టమ్' కాన్సెప్ట్, రూపకల్పన, ఇంజనీరింగ్, అమలుకు గాను వారికి ఈ అవార్డు లభించింది. ఈ సిస్టమ్ చాలా అద్భుతమైనదంటూ అకాడెమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ ప్రశంసించింది. అవార్డును అందుకున్న సందర్భంగా వికాస్ మీడియాతో మాట్లాడుతూ, 2009లో న్యూజిలాండ్‌లోని క్వీన్స్‌టౌన్‌లో షాట్ ఓవర్ కెమేరా సిస్టమ్ అనే ఓ కొత్త కంపెనీలో చేరినట్లు ఆయన చెప్పారు. అందులో తాను ఏరియల్ మౌంట్ వ్యవస్థపై పనిచేసినట్లు ఆయన చెప్పారు. అనేక మంది చలనచిత్ర నిర్మాతలు, దర్శకులను ఎంతగానో ఆకర్షించే క్వీన్స్‌టౌన్ సహజసిద్ధమైన అందం, మనోహరమైన ప్రకృతి సౌందర్యమే అక్కడ కంపెనీ ఏర్పాటుకు ప్రధాన కారణమని వికాస్ తెలిపారు.

కాగా, అంతకుముందు పూణేలోని కమిన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఫర్ ఉమెన్‌లో ఏడేళ్ల పాటు బోధనావృత్తిలో ఆయన ఉన్నారు. ఆ సమయంలోనే ఫియట్ కంపెనీ ప్రాజెక్టు కోసం తనను ఇటలీ పంపారని, అక్కడే మూడు నెలల పాటు పనిచేశానని ఆయన చెప్పారు.




11-2-2018 ... మార్కెట్ సమాచారం

సెన్సెక్స్	
ఆరంభం	34,630.72
గరిష్ఠం	34,850.21
కనిష్ఠం	34,621.67
ముగింపు	**34,300.47**
మార్పు (పా)	294.71
మార్పు (శా)	0.87

&

నిఫ్టీ	
ఆరంభం	10,518.20
గరిష్ఠం	10,553.20
కనిష్ఠం	10,489.30
ముగింపు	**10,539.75**
మార్పు (పా)	84.80
మార్పు (శా)	0.81

ఎన్‌ఎస్‌ఈ ఇండియా మార్కెట్ గ్రాఫ్



సెక్టోరల్ ఇండెక్స్‌లు

ఇండెక్స్	ప్రస్తుతం	మార్పు (పా)	మార్పు (శా)
S&P BSE SENSEX 50	10,992.24	+81.50	+0.75
S&P BSE SENSEX Next 50	34,977.71	+534.60	+1.55
S&P BSE 100	10,946.65	+94.93	+0.87
S&P BSE Bharat 22 Index	3,711.16	+26.42	+0.72

అత్యధిక లాభాల్లో...

కంపెనీ (కోడ్)	ప్రస్తుతం	మార్పు (రూ)	మార్పు (శా)
LTTS	1480.65	+172.40	+13.18
SCI	85.50	+8.00	+10.32
FSL	47.50	+3.55	+8.08
BANKBARODA	168.65	+12.25	+7.83
IDBI	67.60	+4.80	+7.64

భారీ నష్టంలో...

కంపెనీ (కోడ్)	ప్రస్తుతం	మార్పు (రూ)	మార్పు (శా)
FORTIS	139.30	-9.00	-6.07
NAUKRI	1246.30	-47.00	-3.63
HEXAWARE	329.60	-11.85	-3.47
BAJAJELEC	518.90	-18.05	-3.36
SBIN	288.50	-7.90	-2.67

టాప్ టర్నోవర్

కంపెనీ (కోడ్)	ధర (రూ)	టర్నోవర్	వాల్యూమ్
KRBL	599.30	387.47	6522940
TCS	2967.90	358.34	1196687
TATASTEEL	712.50	94.92	1335158
BANKBARODA	168.65	94.23	5621748
SBIN	288.50	75.60	2614328

రూపాయి మారకపు విలువ

కరెన్సీ	మారకపు విలువ	కరెన్సీ	మారకపు విలువ
డాలర్	64.2838	యూరో	78.9341
యన్	59.1400	పౌండ్	89.0202

డిసెంబర్‌లో పెరిగిన పారిశ్రామిక ఉత్పత్తి

జనవరిలో తగ్గిన రిటైల్ ద్రవ్యోల్బణం



● డిసెంబర్‌లో 17 నెలల గరిష్ఠస్థాయిలో చిల్లర ద్రవ్యోల్బణం ● జనవరిలో కాస్తంత తగ్గి 5.07 శాతంగా నమోదు ● అయినప్పటికీ ఆర్‌బీఐ టార్గెట్‌కన్నా ఎక్కువే ● ద్రవ్యోల్బణంపై ఇంధన ధరల పెరుగుదల ప్రభావం ● 2.4 శాతం వృద్ధిని నమోదు చేసిన పారిశ్రామికోత్పత్తి




న్యూఢిల్లీ: రీటైల్ ద్రవ్యోల్బణం కొద్దిగా దిగివచ్చింది. డిసెంబరునాటి 17 నెలల గరిష్టంతో పోలిస్తే జనవరిలో కాస్త తగ్గి 5.07శాతంగా నమోదైంది. అయితే రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా మధ్యస్థ లక్ష్యం 4 శాతం కంటే ఎక్కువగానే ఉంది. ముఖ్యంగా ఆహార, ఇంధర ధరల పెరుగుదలను దీన్ని ప్రభావితం చేసింది. మంత్రిత్వశాఖ సోమవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం వినియోగదారుల ధరల ద్రవ్యోల్బణం కొలమానం, సిపిఐ ఇండెక్స్ జనవరి నెలలో 5.07 శాతానికి పెరిగింది. డిసెంబరులో 5.21 శాతం నుంచి 5.14 శాతానికి తగ్గనుందని రాయిటర్స్ విశ్లేషకులు అంచనా వేశారు. ఇంధనం, ద్రవ్యోల్బణం డిసెంబరులో 7.90 శాతంతో పోలిస్తే 7.58 శాతంగా నమోదైంది. గృహ ద్రవ్యోల్బణం గత నెలలో 8.25 శాతం నుంచి 8.33 శాతానికి పెరిగింది. జనవరి–మార్చి త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 5.1 శాతానికి చేరింది. అక్టోబరు–డిసెంబరులో 4.6 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం ఫిబ్రవరి నెలలో బడ్జెట్లో ప్రకటించిన అధిక దిగుమతి పన్నుల ధరల ఒత్తిడి కారణంగా ఆహార, ఇంధన ధరలు పెరిగినట్టు విశ్లేషకులు భావిస్తున్నారు. కాగా డిసెంబరులో పారిశ్రామిక ఉత్పత్తి 7.1శాతంగా నమోదుకాగా, ఉత్పత్తి సామర్థ్యం మరింత మెరుగుపడినట్లయ్యింది. ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం డిసెంబరు 2016లో ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ ఇండెక్స్ 2.4శాతం వృద్ధి చెందింది. అది గడచిన 2017 నవంబరు నాటికి 8.8శాతంగా వృద్ధి చెందుతుందని అంచనా వేయగా, 8.4శాతంగా నమోదై ఆశాజనక పరిస్థితులు కనిపించాయి. ఈ డేటాలో నమోదైన వివరాల ప్రకారం రిటైల్ ద్రవ్యోల్బణం జనవరిలో 5.07శాతం దిగజారడంతో కూరగాయలు, పండ్లు తదితరాల ధరలు తగ్గుముఖం పట్టాయి. కాగా ఈ గణాంకాలను ఎస్ఎస్ఎస్ఓకు చెందిన ఫీల్డ్ ఆపరేషన్స్ డివిజన్ ఎంపిక చేసిన పట్టణాల నుంచి సేకరించింది. కాగా జనవరి–మార్చి త్రైమాసికానికి రిటైల్ ద్రవ్యోల్బణం సుమారు 5శాతం వద్ద ఉండవచ్చని తరువాత వేసవినాటికి సీపీఐ 6శాతంగా నమోదుకావచ్చని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సీనియర్ ఎకనామిస్ట్ తుషార్ అరోరా తెలిపారు.

ప్రింటింగ్ ప్రెస్ నుంచి బయలుదేరి ఆర్బీఐకి చేరని

రూ. 23 వేల కోట్లు ఎక్కడ?

● 46,93,16,000 పీస్ ల రూ. 500 నోట్లు మాయం ● ముద్రించిన నోట్ల కన్నా అదనంగా రూ. 1000 నోట్లు ● ప్రశ్నించిన ఆర్టీఐ కార్యకర్త మనోరంజన్ రాయ్ ● విచారణ చేపట్టిన బాంబే హైకోర్టు



న్యూఢిల్లీ: సమాచార హక్కు చట్టాన్ని వినియోగించి, ఓ వ్యక్తి అడిగిన ప్రశ్నకు వచ్చిన సమాధానంలో అవాక్కయ్యే నిజాలు వెల్లడయ్యాయి. నోట్ల రద్దుకు ముందు ప్రింటింగ్ ప్రెస్ లో ముద్రితమైన కరెన్సీలో రూ. 23 వేల కోట్లకు పైగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చేరుకోలేదన్నది ఆర్టీఐ కార్యకర్త మనోరంజన్ రాయ్ పిటిషన్ కు వచ్చిన సమాధానం. ఆర్బీఐ, నోట్ల ముద్రణా కేంద్రాల్లో వివరాలను కోరుతూ ఆయన పిటిషన్ వేయగా సమాధానం లభించింది. దీని ఆధారంగా బాంబే హైకోర్టులో ఆయనో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశాడు కూడా. ఇక, రూ. 500 డినామినేషన్ లో 19,45,40,00,000 నోట్లను ఆర్బీఐకి పంపగా, 18,98,46,84,000 నోట్లు మాత్రమే చేరాయట. మిగతా 46,93,16,000 నోట్ల (వీటి విలువ రూ. 23,465 కోట్లు) కరెన్సీ ఎక్కడికి వెళ్లిందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇక రూ. 1000 కరెన్సీ నోట్లను 4,44,13,00,000 ముద్రించినట్టు లెక్కలుండగా, ఆర్బీఐ 4,45,30,00,000 నోట్లను అందుకున్నట్టు ఉంది. అంటే అదనంగా రూ. 1,170 కోట్ల నోట్లు అందుకున్నట్టు చెబుతోంది. ఈ నోట్లు ఎక్కడివన్న వివరాలు లేవు. ఈ లెక్కల్లో తీవ్ర అయోమయం ఉందని చెబుతూ మనోరంజన్ రాయ్ వేసిన పిటిషన్‌పై బాంబే హైకోర్టులో విచారణ ప్రారంభించడంతో ఈ విషయమై దేశ వ్యాప్తంగా ఆసక్తి కలుగుతోంది.

హనీవెల్‌కు గోల్డెన్ పీకాక్ అవార్డు



బెంగళూరు: ప్రముఖ హనీవెల్ ఇండియా సంస్థాగత కార్పొరేట్ సామాజిక బాధ్యతకు గాను 2017 సంవత్సరానికి సంబంధించి బంగారు నెమలి అవార్డును దక్కించుకుంది. తెలంగాణలో హనీవెల్ సేఫ్ వాటర్ నెట్‌వర్క్‌కు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. భూగర్భ జలాలు కలుషితమైన ప్రాంతాల్లో 3 లక్షల మందికి హనీవెల్ తాగునీటిని అందిస్తున్నది. ఈ సందర్భంగా హనీవెల్ ఇండియా ప్రెసిడెంట్ వికాస్ చద్దా మాట్లాడుతూ సేఫ్ వాటర్ నెట్‌వర్క్‌తో మా దీర్ఘకాలిక భాగస్వామ్యానికి ఈ అవార్డు గుర్తింపుగా భావిస్తున్నాం. ఈ నెట్‌వర్క్ సాయంతో తెలంగాణలో వందకు పైగా సేఫ్ వాటర్ స్టేషన్స్‌ను నిర్మించాం. అలాగే నీటి కారణంగా వచ్చే వ్యాధులను తగ్గించడంలో, ఉత్పాదకతను పెంచడంలో సీసీఆర్ కార్యక్రమం తోడ్పాటునందిస్తుందన్నారు.

చిన్న మొత్తాల పొదుపు పథకాలకు కొత్త రూపం

అవసరమైనప్పుడు వెనక్కి తీసుకునే సౌలభ్యం



● బడ్జెట్లో మార్పుల్ని ప్రతిపాదించిన కేంద్ర ప్రభుత్వం ● దీంతో ఈ పథకాలకు ఆదరణ పెరిగే అవకాశం ● పాత చట్టాల రద్దు

న్యూఢిల్లీ: పోస్టాఫీసు పథకాలుగా అందరికీ దగ్గరైన చిన్న మొత్తాల పొదుపు పథకాలకు కేంద్ర ప్రభుత్వం మార్పుల్ని ప్రతిపాదించింది. పీపీఎఫ్ సహా అన్ని రకాల స్మాల్ సేవింగ్స్ స్కీమ్స్ నుంచి అవసరమైనపుడు తప్పుకునే అవకాశం ఇవ్వనుంది. ఈ ప్రతిపాదన వల్ల ఈ పథకాలకు ఆదరణ పెరిగే అవకాశాలున్నాయి. ఫిబ్రవరి 1 బడ్జెట్ లో ఈ మేరకు కేంద్రం మార్పుల్ని ప్రవేశపెట్టింది. గవర్నమెంట్ సేవింగ్స్ ప్రమోషన్ యాక్ట్ ను ప్రతిపాదించింది. ప్రస్తుతమున్న పీపీఎఫ్ యాక్ట్ 1968, గవర్నమెంట్ సేవింగ్స్ సర్టిఫికెట్ యాక్ట్ 1959, గవర్నమెంట్ సేవింగ్స్ బ్యాంకు యాక్ట్ 1873లను రద్దు చేయనుంది. అలాగే, చిన్న మొత్తాల పొదువు పథకాల నుంచి వైదొలిగే నిబంధనలను ఎప్పటికప్పుడు సవరించే అధికారం కేంద్రానికి ఉంటుంది. వైద్యం, ఇతర అత్యవసరాల్లో డబ్బుల్ని ఈ పథకాల నుంచి వెనక్కి తీసుకునే అవకాశం రానుంది. అలాగే, మైనర్లను వారసులుగా నామినేట్ చేసుకోవచ్చు. అన్ని పథకాల్లోనూ మైనర్ల తరఫున సంరక్షకులు డిపాజిట్ చేసుకోవచ్చు. చిన్న మొత్తాల పొదువు పథకాలు అన్నింటిలోనూ ఒకే విధమైన నిబంధనలు ఉండేందుకు కేంద్ర సర్కారు ఈ మేరకు మార్పులకు పూనుకుంది.

ఆటోఎక్స్‌పోలో హుందాయ్‌కి అనూహ్య స్పందన



న్యూఢిల్లీ: దేశంలో పాసింజర్ కార్ల ఉత్పత్తిలో రెండవ అతిపెద్ద సంస్థగా గుర్తింపు పొందిన హుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్(హెచ్‌ఎంఐఎల్) ప్రస్తుతం జరుగుతున్న ఆటో ఎక్స్‌పోలో ఏర్పాటుచేసిన బీ ది బ్యాటరీ గై జోన్‌కు అనూహ్య స్పందన లభించిందని తెలిపింది. మొత్తం 1,25,00 మంది రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. రోడ్డు నియమనిబంధనలపై వినియోగదారులకు అవగాహన కల్పించేందుకే ఈ హుందాయ్ ఈ జోన్ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా హెచ్‌ఎంఐఎల్ మార్కెటింగ్ గ్రూప్ హెడ్, జనరల్ మేనేజర్ పునీత్ ఆనంద్ మాట్లాడుతూ రోడ్డు భద్రతపై హుందాయ్ ఏర్పాటుచేసిన జోన్‌ను అధికసంఖ్యలో వాహనదారులు సందర్శించారని తెలిపారు.

వరల్డ్ యూనివర్సిటీ ఆఫ్ డిజైన్ నుంచి పీఎం ప్రోగ్రాం

న్యూఢిల్లీ: క్రియేటివ్ డొమైన్ విద్యనందిస్తున్న దేశంలోని ఏకైక యూనివర్సిటీ ది వరల్డ్ యూనివర్సిటీ ఆఫ్ డిజైన్(డబ్ల్యుడీ) తాజాగా ప్రొఫిషినల్ ఆటోమోటివ్ మోడెలింగ్(పీఎం)లో ప్రత్యేక డిప్లమో ప్రోగ్రాంను అందిస్తున్నట్లు వెల్లడించింది. అలాగే అడ్వాన్స్‌డ్ డిప్లమో కోర్సును కూడా దేశ్‌మానియా అటోస్టూడియో సౌజన్యంతో అందిస్తున్నట్లు తెలిపింది. పీఎం ప్రోగ్రాంను డిజైన్ ఇండస్ట్రీలో ఉన్నవారికోసం రూపొందించారు. ఈ సందర్భంగా వరల్డ్ యూనివర్శిటీ ఆఫ్ డిజైన్ వైస్ ఛాన్సలర్ సంజయ్ గుప్తా మాట్లాడుతూ దేశ్‌మానియా అటోస్టూడియో భాగస్వామ్యంతో ఈ డిప్లమో కోర్సును అందిస్తున్నట్లు తెలిపారు. కాగా ఈ ప్రోగ్రాం 2018, ఆగస్టు 1 నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

జనవరిలో రికార్డు స్థాయిలో వాహన విక్రయాలు



● ప్రయాణికుల వాహనాల్లో వృద్ధి 7.57 శాతం ● వాణిజ్య వాహనాలు, మోటారు సైకిళ్ల అమ్మకాలు అధికం ● 33 శాతానికి పైగా వృద్ధి

న్యూఢిల్లీ: దేశీయంగా వాహన రంగానికి ఈ జనవరి కలిసొచ్చింది. రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిగాయి. భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘం సియామ్ విడుదల చేసిన గణాంకాలను గమనిస్తే, ప్రయాణికుల వాహనాలు (కార్లు, జీపు, వ్యాన్లు) జనవరిలో 2,85,477 అమ్ముడు పోయాయి. 2017జనవరిలో అమ్మకాలతో చూస్తే 7.57 శాతం ఎక్కువ. వాణిజ్య వాహనాలు 85,660 అమ్ముడయ్యాయి. ఇది 39.73 శాతం అధికం. అలాగే, ద్విచక్ర వాహనాలు సైతం 16,84,066 యూనిట్లు అమ్ముడయ్యాయి. ఇది 33.43 శాతం అధికం. ముఖ్యంగా ద్విచక్ర వాహనాల్లో స్కూటర్లు 48.29 శాతం వృద్ధితో 5,53,695 విక్రయమయ్యాయి. మోటారు సైకిళ్లు 28.64 శాతం వృద్ధితో 10,54,062 అమ్ముడు పోయాయి. మొత్తం మీద పరిశ్రమ వారీగా చూస్తే వాహన విక్రయాలు 30 శాతం వృద్ధితో 21,17,746 యూనిట్లుగా నమోదయ్యాయి.

ఇ-ట్రియో నుంచి కాలుష్య రహిత వాహనాలు



హైదరాబాద్: పర్యావరణహిత విద్యుత్ వాహనాలను అందుబాటులోకి తెస్తున్నట్లు ఇ–ట్రియో ఆటో మొబైల్ వ్యవస్థాపకులు సత్యా యలమంచిలి తెలిపారు. తాము మూడు వేరి యంట్లలో ఇవి 100, ఇవి 180, మరో హచ్ బ్యాక్‌ను అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. త్వరలోనే వీటిని విడుదల చేయనున్నామని చెప్పారు. 2018 మార్చి నుంచి మార్కెటింగ్‌ను ప్రారంభించనున్నామని చెప్పారు. వీటి టెక్నలాజీ కోసం అమెరికన్ కంపెనీతో భాగస్వామ్యం కుదుర్చుకున్నామన్నారు. కాగా ఈ కార్లు 25 నిమిషాల్లోనే చార్జింగ్ అయ్యేలా చైనా కంపెనీతో భాగస్వామ్యం కానున్నామన్నారు. నెలకు 1500 కార్ల తయారీ సామర్థ్యంతో బొల్లారంలో ప్లాంటు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వచ్చే 15 నెలల్లో ఈ ప్లాంట్ అందుబాటులోకి రానుందన్నారు.

వేలంటైన్స్‌డే సందర్భంగా డిస్కౌంట్ ఆఫర్లు

● వి7+ స్పెషల్ ఎడిషన్ ధర రూ.22,900 ● ఉచిత మూవీ టికెట్లు ● అన్ని మోడళ్లపై డిస్కౌంట్లు, ఎక్ఛేంజ్ ఆఫర్లు




న్యూఢిల్లీ: ప్రముఖ ఈ కామర్స్ సంస్థ అమేజాన్ డాట్ ఇన్ ప్రేమికుల దినోత్సవం (ఫిబ్రవరి 14) ఆగమనం సందర్భంగా వివో ఫోన్లపై డిస్కౌంట్ ఆఫర్లతో వివో కార్నివాల్ నిర్వహిస్తోంది. ఈ నెల 12 నుంచి 14 వరకు ఈ కార్నివాల్ కొసాగుతుంది. ఇందులో భాగంగా తగ్గింపు ధరలు, ఎక్స్చేంజ్ ఆఫర్లు, నోకాస్ట్ ఈఎంఐ ఉన్నాయి. వివో లిమిటెడ్ ఎడిషన్ అయిన వి7 హ్యాండ్ సెట్ ధర రూ.22,900. ఈ హ్యాండ్ సెట్ రెడ్ కలర్ లో ఉంటుంది.

వీటితో పాటు రూ.500 విలువైన ఫెర్న్ అండ్ పెటల్స్ వోచర్, బుక్ మై షోలో రూ.500 విలువకు సమానమైన మూవీ టికెట్లు ఆఫర్ చేస్తోంది. అలాగే ఎక్చేంజ్ కింద 18,752 వరకు తగ్గింపు పొందొచ్చు. ఈ హ్యాండ్ సెట్ 5.99 అంగుళాల ఫుల్ హెచ్ డీ డిస్ ప్లేతో ఉంటుంది. 24 మెగా పిక్సల్స్ సెల్ఫీ కెమెరా, వెనుక వైపు 16 మెగా పిక్సల్స్ కెమెరా ఉన్నాయి. ఇక వివో వి7 రెగ్యులర్ వెర్షన్ ధర రూ.21,999. దీనిపై ఎటువంటి తగ్గింపు లేదు. ఎక్చేంజ్ పై రూ.2,000 వరకే తగ్గింపునిస్తోంది.


ఇక వివో వి7 ధర రూ.18,990 కాగా, తగ్గింపు కింద రూ.16,990కే అందిస్తోంది. ఎక్చేంజ్ కింద మరో రూ.2,000 తగ్గింపు పొందొచ్చు. వి5 ప్లస్ పై రూ.6,000 తగ్గింపుతో రూ.19,990కే ఆఫర్ చేస్తోంది. వి5ఎస్ ను రూ.3,000 తగ్గింపుతో రూ.15,990కు అందిస్తోంది. వివో వై69, వివో వై66 హ్యాండ్ సెట్ లపై రూ.1,000 డిస్కౌంట్ ఆఫర్ చేస్తోంది. బడ్జెట్ మోడళ్లు వై55ఎస్ ను తగ్గింపు తర్వాత రూ.10,990కు, వై53ని రూ.8,990కు సొంతం చేసుకోవచ్చు.

ఫరెవర్ మార్క్‌లో వాలెంటైన్స్ డే సంబరాలు



హైదరాబాద్: ప్రేమకు ప్రతిబింబంగా, వాలంటైన్స్ డే సందర్భంగా ఫరెవర్ మార్క్ పలు ఆభరణాల శ్రేణిని విడుదల చేసింది. జీవిత భాగస్వాముల అనుబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రత్యేక ఆభరణాలను రూపొందించినట్లు ఫరెవర్ మార్క్ తెలిపింది. రింగ్, పెండెంట్, ఇయర్ రింగ్ ఫరెవర్ మార్క్ డైమండ్స్ మొదలైన ఆభరణాలను ప్రేమకు ప్రతిరూపంగా తీర్చిదిద్దింది. పరస్పరం వీటిని ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా ప్రేమానుభంధాలు మరింత బలోపేతం అవుతాయన ఫరెవర్‌మార్క్ తెలిపింది. డీ బీర్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌కు చెందిన డైమండ్ బ్రాండ్‌ను ప్రేమికులకు అందుబాటులో ఉంచింది.

మాల్యాకు మరో షాక్



లండన్: బ్యాంకులకు వేల కోట్ల రూపాయల రుణాల ఎగవేతకేసులో నిందితుడైన లిక్కర్ కింగ్ విజయ్ మాల్యాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ విమానాలను అద్దెకు తీసుకున్న బీఓసీ ఏవియేషన్‌కు 90 మిలియన్ డాలర్లు చెల్లించాలని బ్రిటన్ హైకోర్టు తేల్చిచెప్పడంతో మాల్యాకు న్యాయపోరాటంలో భంగపాటు తప్పలేదు. లీజింగ్ అగ్రిమెంట్ ప్రకారం కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌కు సింగపూర్‌కు చెందిన బీఓసీ ఏవియేషన్ మూడు విమానాలను సరఫరా చేసింది. కాగా, లండన్ కోర్టు వెలువరించిన తీర్పును బీఓసీ ఏవియేషన్ స్వాగతించింది. మరోవైపు రుణ ఎగవేతకేసులో నిందితుడైన విజయ్ మాల్యాను భారత్‌కు అప్పగించే కేసుపై లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ కోర్టులో విచారణ కొనసాగుతున్న విషయం తెలిసిందే.

పెను ప్రమాదాన్ని తప్పించిన

పైలట్ అనుపమపై ప్రశంసలు

● పెను ప్రమాదాన్ని తప్పించిన ఎఐ పైలట్ అనుపమ ● తమ సిబ్బంది తప్పులేదంటోన్న విస్తారా యాజమాన్యం



న్యూఢిల్లీ: ముంబై గగనతలంలో గత బుధవారం (ఫిబ్రవరి 7) ఓ పెను ప్రమాదం తప్పడంలో కీలక పాత్ర పోషించిన ఎయిరిండియా మహిళా పైలట్ కెప్టెన్ అనుపమ కోహ్లీని అందరూ ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. ముంబై నుంచి భోపాల్ వెళ్తున్న ఎయిరిండియా విమానం 'ఏ–319'కి, ఢిల్లీ నుంచి పూణే వెళ్తున్న విస్తారా విమానం 'ఏ–320' నియో మధ్య ప్రమాదం తృటిలో తప్పిన సంగతి తెలిసిందే. రెండు విమానాల్లో 261 మంది ప్రయాణికులు ఉన్నారు. సమయస్ఫూర్తితో పెను ప్రమాదాన్ని తప్పించి ప్రయాణికుల ప్రాణాలను నిలిపినందుకు ఆమెకు అన్ని వైపుల నుండి ప్రశంసలు దక్కుతున్నాయి. ఏటీసీ, విస్తారా కాక్‌పిట్ మధ్య నెలకొన్న సమన్వయ లోపంతో అయోమయం నెలకొంది. ఆ సమయంలో రెండు కాక్ పిట్లలో ఇద్దరు మహిళలు సంభాషిస్తున్నారు. విస్తారా విమాన కెప్టెన్ టాయిలెట్‌కు వెళ్లినవుడు అందులోని మహిళా కో పైలట్ కాక్‌పిట్‌లో సంభాషిస్తూ విమానాన్ని నడిపారు. ఆ సమయంలో ఎయిరిండియా విమానంలో కెప్టెన్ అనుపమ కోహ్లీ కమాండర్‌గా ఉన్నారు. కాక్‌పిట్లకు అందిన సమాచారం అయోమయానికి గురి చేయడంతో 20 ఏళ్లకు పైగా అనుభవమున్న ఎయిరిండియా కెప్టెన్ అనుపమ కోహ్లీ తెలివిగా సమయస్ఫూర్తితో వ్యవహరించారు. విస్తారా విమానం తన విమానం దిశగా వస్తున్నట్లు ఆమె గమనించారు. విస్తారా విమానం యూకే 997కి ఏటీసీ ఇచ్చిన సమాచారాన్ని కాక్‌పిట్‌లో ఆమె విన్నారు. అదే సమయంలో ఓ రిజల్యూషన్ అడ్వైజరీ (ఆర్‌ఏ) 'ఎత్తు పెంచు... ఎత్తు పెంచు' అంటూ ఇచ్చిన సమాచారాన్ని అందుకున్న అనుపమ వెంటనే ఎత్తు పెంచారు. దాంతో 261 మంది ప్రయాణిస్తున్న రెండు విమానాలు పరస్పరం ఢీకొనకుండా పెను ప్రమాదం తప్పినట్లయిందని ఎయిరిండియా వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు ఏటీసీ సూచనల మేరకు తమ సిబ్బంది నడుచుకున్నారని, నిబంధనలను ఉల్లంఘించలేదని విస్తారా యాజమాన్యం సమర్థించుకుంటోంది.

హైదరాబాద్‌లో అడుగిడిన లెట్స్‌ట్రాక్

హైదరాబాద్: ప్రతీనిత్యం ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం సూచించే విధంగా లెట్స్‌ట్రాక్ సరికొత్త యాప్‌ను ఆవిష్కరించింది. లండన్‌కు చెందిన లెట్స్ ట్రాక్ కంపెనీ సమాజ భద్రత కోరి ఈ నూతన ఆవిష్కరణలను ప్రవేశపెట్టింది. తద్వారా మన సమాజం మరింత రక్షణ పొందుతుందని తెలిపింది. ఇది ఇంటర్నెట్ అండ్ టెక్నాలజీ ఆధారితంగా రూపొందించిన యాప్ అని పేర్కొంది. ఈ సందర్భంగా లెట్స్ ట్రాక్ సీఈవో, వ్యవస్థాపకుడు విక్రం కుమార్ మాట్లాడుతూ సీసీ టీవీలను ట్రాక్ చేయడం నిత్యకృత్యంగా మారిపోయింది. ఇది ప్రతీ ఇంట్లోనూ వ్యాపారంలోనూ అత్యవసరంగా మారింది. ప్రపంచం శాతియుతంగా, మరింత రక్షణతో మెలగాలన్నదే మా ధ్యేయం అన్నారు.

వాట్సాప్‌లో పేమెంట్స్ సేవలు

న్యూఢిల్లీ: ఫేస్ బుక్ కు చెందిన వాట్సాప్ సంస్థ ఎట్టకేలకు పేమెంట్స్ సదుపాయాన్ని యూజర్ల కోసం అందుబాటులోకి తీసుకొచ్చింది. వాట్సాప్ తాజా వెర్షన్ 2.18.46 పైనే ఇది అందుబాటులో ఉంటుంది. ఆండ్రాయిడ్, ఐవోఎస్ యూజర్లకు సైతం అందుబాటులోకి వచ్చింది. పేమెంట్స్ చేసేందుకు ఆండ్రాయిడ్ యూజర్లు వాట్సాప్ లో ఫ్రెండ్స్ ప్రొఫైల్ కు వెళ్లాలి. అటాచ్ మెంట్ (పేపర్ క్లిప్ ఆకారంలో ఉన్నది) ను సెలక్ట్ చేయాలి. ఇక్కడ పేమెంట్ ఆప్షన్ కనిపిస్తుంది. దాన్ని సెలక్ట్ చేసుకోవాలి. అప్పుడు మీ ఫ్రెండ్ వాట్సాప్ యూపీఐ ఫీచర్ ను కలిగి లేరన్న సందేశం కనిపించొచ్చు. అలాంటప్పుడు మీ ఫ్రెండ్స్ వాట్సాప్ యూపీఐ ఫీచర్ ను ఎనేబుల్ చేసుకోవాల్సి ఉంటుంది. తర్వాత యాప్ లోని సెట్టింగ్స్ లోకి వెళితే అక్కడ పేమెంట్స్ ఆప్షన్ కనిపిస్తుంది. మీ ఫ్రెండ్స్ ను కూడా యూపీఐ సేవల్లోకి ఆహ్వానించొచ్చు.

రాజధానికి తరలివస్తున్న పరిశ్రమలు

అమరావతి, సూర్య ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతికి తరలివస్తున్న పరిశ్రమల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. విభజన తర్వాత రాష్ట్రానికి తరలిరావాలన్న ఆకాంక్ష మేరకు హైదరాబాద్, జీడిమెట్ల, నాచారం ప్రాంతానికి చెందిన ఏపీ పారిశ్రామిక వేత్తలు రాష్ట్రంలోనూ పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు కృష్ణా జిల్లా బాపులపాడులోని మల్లవెల్లి పారిశ్రామిక క్లస్టర్‌లో 400కు పైగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటుకానున్నాయి. తొలిదశలో 216 పరిశ్రమలకు ప్రభుత్వం భూములు కేటాయించింది. రూ. 800 కోట్లతో రానున్న ఈ పరిశ్రమలు ప్రాథమికంగా 7,250మందికి ప్రత్యక్షంగా, ఉపాధి అవకాశాలను కల్పించనున్నామని మల్లవెల్లి ఇండస్ట్రీస్ సహాయ కార్యదర్శి జీఎన్‌బీ చౌదరి తెలిపారు.




సీఎం ప్రత్యేక దృష్టి సారించారు

మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

కడప,సూర్యబ్యూరో: చంద్రబాబు రాయలసీమపై ప్రత్యేక దృష్టి సారించారని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. విభజన సమస్యలపై జగన్ ఎప్పుడూ మాట్లాడలేదని ఆయన తెలిపారు. సోమవారం మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ జగన్‌కు రాష్ట్ర సమస్యలు పట్టవన్నారు. విభజన చట్టంలోని అంశాలపై కేంద్రం స్పందించకుంటే 2019 ఎన్నికల్లో బీజేపీకి రాంరాం అని మంత్రి ఆదినారాయణ రెడ్డి తెలిపారు.

‘చుట్టం’ కోసమే కొత్త ‘చట్టం’!

- అసైన్డ్ భూముల ఆర్డినెన్స్
- ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన రేవంత్ రెడ్డి



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః రాష్ట్రంలో ఇతరుల చేతుల్లోకి వెళ్లిన అసైన్డ్ భూములను అస్మదీయులకు దోచిపెట్టాలనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం అసైన్డ్ భూముల ఆర్డినెన్స్‌ను తీసుకురావాలని తొందరపడుతోందని కాంగ్రెస్ నేత ఏ. రేవంత్ రెడ్డి ఆరోపించారు. ముఖ్యంగా ఈ వ్యవహారంలో సిఎం కేసీఆర్ తన సమీపబంధువైన మైహోం రామేశ్వర్ రావుకు లబ్ది చేకూర్చాలనే లక్ష్యంతోనే ఆర్డినెన్స్ భాగోతానికి తెరలేపారని ధ్వజమెత్తారు.


సోమవారం సిఎల్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో రేవంత్ మాట్లాడుతూ అసైన్డ్ భూముల విషయంలో ప్రభుత్వ చర్యలపై నిప్పులు చెరిగారు. ముందుగా ల్యాండ్ సీలింగ్ యాక్ట్–1972, ఎపి అసైన్‌ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ ప్రొహిబిషన్ యాక్ట్–1977ల నేపథ్యాన్ని వివరించిన రేవంత్ ఈ ఆర్డినెన్స్ విషయంలో ప్రభుత్వానిది సదుద్దేశమే అయితే వాస్తవంగా ఫిబ్రవరి మాసంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను నిర్వహించాల్సి ఉంటుందని, ఆ సమావేశాలు ఏర్పాటు చేసి అందులో చర్చించకుండా అసెంబ్లీని ప్రొరోగ్ చేసి ఇంత హడావిడిగా ఆర్డినెన్సును తీసుకురావాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు.తాను నేరుగా ముఖ్యమంత్రి మీదనే ఆరోపణ చేస్తున్నానని చెప్పారు.సిఎం బినామీగా ఆరోపణలు ఎదుర్కొంటున్న, సిఎం సమీప బంధువు మైహోం రామేశ్వర్ రావు, ఆయన బంధువులు శంషాబాద్, మహేశ్వరం మండలాల్లోని ముచ్చింతల, నాగారం, నాగిరెడ్డిపల్లి తదితర పది గ్రామాలలో 4 వేల నుంచి 5 వేల ఎకరాల భూములను సేకరించడం జరిగిందని తెలిపారు. ఈ భూములలో 1500 నుంచి 2 వేల ఎకరాల దాకా అసైన్డ్ భూములు ఉన్నాయని ఆరోపించారు.వీటిని రెండు రకాలుగా సేకరిస్తున్నారని చెప్పారు.గ్రామాలలో ఉన్న అసైన్డ్ భూములను రైతుల నుంచి తీసుకొని వాటికి బదులుగా ఇతర గ్రామాల్లోని అసైన్డ్ భూములను కొని ఇస్తున్నారని, మరోవిధానంలో అసైన్డ్ భూములను టిఎస్ ఐఐసికి స్వాధీనం చేయించి పరిశ్రమల పేరుమీద ఆ భూములను తక్కువ ధరలకు టిఎస్ ఐఐసి ద్వారానే తాము దక్కించుకుంటున్నారని ఆరోపించారు. ఇది కాకుండా జిల్లాలలో ఉన్న అసైన్డ్ భూములలో ఇతరుల ఆధీనంలో ఉన్న భూములను అవి ఎవరి ఆధీనంలో ఉంటే వారికి రెగ్యులరైజ్ చేయాలంటూ ప్రభుత్వ కార్యదర్శి బిఆర్ మీనా గత డిసెంబర్ 18, 2017న కలెక్టర్లకు మెమోను కూడా జారీ చేసారని, అయితే దీనిని అడ్డంపెట్టుకొని భూబదలాయింపులపై నిషేధం హెచ్.ఎం.డి.ఎ. పరిధిలోని రంగారెడ్డి జిల్లాలోనూ వేలాది ఎకరాల భూములను అక్రమంగా బదలాయించడానికి సిఎం బంధువైన ఆ జిల్లా కలెక్టర్ చేసిన ప్రయత్నాలను బిఆర్ మీనా అడ్డుకొని సహాయనిరాకరణ చేసారన్నారు. అందుకే ఆయనను ఉన్న పళాన బదిలీ చేసారని రేవంత్ ఆరోపించారు.వందల వేల ఎకరాలను రామేశ్వరరావుకి బదిలీ చేయడానికి, అందుకు అవసరమైన సహకారం అందించడానికి సిఎం బంధువైన కలెక్టర్ ద్వారా వందలఎకరాల దోపిడీకి పాల్పడుతున్నారని , అందులో భాగంగానే అసైన్డ్ భూముల ఆర్డినెన్స్ తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు.ప్రస్తుతం ప్రభుత్వం తీసుకురావాలని ప్రయత్నిస్తున్న చట్టం 2007లో శాసనసభలో ఆమోదం పొందిందని వెల్లడించారు. దీనిపై బొజ్జా తారకం కోర్టుకు వెళ్లడంతో దీని అమలు ఆగిందని చెప్పారు. ఆ చట్టప్రకారంగా 2007, మే 29 నాటికి అసైన్డ్ భూములలో ఉన్న వారికి మాత్రమే వర్తిస్తుందని తెలిపారు.అయితే ఈ గడువు తేదీతో అసైన్డ్ భూముల ఆర్డినెన్సును తీసుకొస్తే దానివల్ల తన బంధువైన రామేశ్వర్ రావుకు మేలు జరగదని, దీనిని 2014, జూన్ 2 దాకా పొడిగించాలని సిఎం నిర్ణయించారని దుయ్యబట్టారు. కేసీఆర్ నిజంగా పేద ప్రజల మేలుకోసమే ఈ చట్టాన్ని తీసుకొస్తున్నట్లయితే శాసనసభలో దీనిపై చర్చించిన తర్వాతనే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. అలా కాకుండా హడావిడిగా నిర్ణయం తీసుకోవాలని ప్రయత్నించడం ఎందుకని ప్రశ్నించారు. రిజిస్ట్రేషన్ యాక్ట్ 1908 ప్రకారంగా అసైన్డ్ భూములను రిజిష్టర్ చేసినా చెల్లదని, అలాంటప్పుడు మహేశ్వరం, శంషాబాద్ మండలాల్లో వేల ఎకరాల భూములు మైహోం అధినేత, ఆయన బంధువుల పేరిట ఎలా రిజిష్టర్ చేస్తారని నిలదీసారు. రిజిస్ట్రేషన్ యాక్ట్ 1908 ప్రకారంగా అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లు రద్దు చేసి ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని రేవంత్ డిమాండ్ చేసారు.సమగ్రభూ సర్వేలో తేలిన అసైన్డ్ భూముల వివరాలు, వాటి ఆక్రమణదారుల సమగ్ర వివరాలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పెట్టాలని ఆయన డిమాండ్ చేసారు. తాను చేస్తున్న ఆరోపణలన్నింటికీ ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు. మహేశ్వరం,శంషాబాద్ మండలాల్లో మైహోం ఆధీనంలో ఉన్న పది గ్రామాల భూముల వివరాలను బయటపెడతామని, విచారణాధికారిని నియమిస్తే ఈ విషయాన్ని నిరూపించడానికి తాను సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. ఈ వ్యవహారంపై దీర్ఘకాలికపోరాటం చేస్తామని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.

మంత్రి సోమిరెడ్డిని కలిసిన వైసీపీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



కడప, మేజర్‌న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే రవీందన్రాథ్ రెడ్డి కలిశారు. కడప జిల్లాలో రైతులకు రావాల్సిన బుడ్డశనగ పంట ఇన్సూరెన్స్ రూ. 276 కోట్లు వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వినతిపత్రం మంత్రికి అందజేశారు. రవీందన్రాథ్ రెడ్డి విజ్ఞప్తిపై సోమిరెడ్డి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతానని చెప్పినట్లుగా తెలియవచ్చింది

నయీం బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం: చాడ వెంకట్‌రెడ్డి



హైదరాబాద్, మేజర్‌న్యూస్ః గ్యాంగ్‌స్టర్ నయీం బాధితులతో కలిసి న్యాయ పోరాటం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం నయీం బాధితులతో సీపీఐ నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ కొండను తవ్వి ఎలకను కూడా పట్టలేకపోయారని విమర్శించారు. సిట్ వల్ల ఒక్క బాధితుడికి కూడా న్యాయం జరుగలేదన్నారు. చిన్న చేపలను పట్టుకుని పెద్ద వాళ్లను విడిచి పెట్టారని ఆయన ఆరోపించారు. నయీం బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని చాడ వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

మొదటి పేజీ తరువాయి

ప్రత్యేక హోదా మన హక్కు



అంశాలపై ఆయన పార్టీ నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ భేటీకి వైసీపీ ముఖ్యనేతలు, ఎంపీలు, హాజరయ్యారు. ఎంపీలు విజయసాయిరెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వరప్రసాద్, పార్టీ సీనియర్ నేతలు ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యనారాయణ, మోపిదేవి వెంకటరమణ, పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తలు హాజరయ్యారు. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు, ప్రత్యేక హోదా సాధనపై ఈ సమావేశంలో కార్యాచరణను రూపొందించే దిశగా చర్చించారు. వచ్చే నెల ఐదో తేదీన జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించాలని ఈ మేరకు ఆ పార్టీ నిర్ణయం తీసుకొంది. ఏపీకి ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ వద్దని, ప్రత్యేక హోదాయే ముద్దు అన్న నినాదంతో పోరాటం సాగించాలని ఆ పార్టీ నాయకత్వం నిర్ణయం తీసుకొంది. ఎన్డీఏ ప్రభుత్వంలో మిత్రపక్షంగా ఉన్న టీడీపీ సాగిస్తున్న నాటకాలను ఆడుతోందని, వాస్తవాన్ని ప్రజలకు వివరించేందుకు ఏవిధంగా ముందుకు వెళ్లాలనేదానిపై కూడా చర్చించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంలోని ఎన్డీయేలో భాగస్వామ్యమైనట్లు నాడు టీడీపీ ప్రకటించిన వాటినే జనంలోకి తీసుకెళ్లి ఇప్పుడు బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం చేసినా తెలుగుదేశం పార్టీ కేంద్రం నుంచి ఎందుకు బయటకు రావడంలేదన్న అంశాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ నిర్ణయం తీసుకొన్నట్లు సమాచారం. అదే సందర్భంలో ఏపీకి ప్రత్యేక హోదాతోనే న్యాయం జరుగుతుందని, ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ వల్ల నిధులు రావని, అందుకు ఇటీవల జరిగిన బడ్జెట్‌లో ఏపీకి జరిగిన అన్యాయమే నిదర్శనమని జనంలోకి తీసుకెళ్లాలని వైసీపీ నిర్ణయించింది. ఏపీకి ప్రత్యేక హోదా కోసం పోరాడకుండా ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని స్వాగతించి టీడీపీ రాష్ట్రానికి తీరని నష్టంచేసిందన్న దాన్ని కూడా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని వైసీపీ నిర్ణయం తీసుకొన్నట్లు సమాచారం. అదే సందర్భంలో బడ్జెట్‌లో ఏపీకి జరిగిన అన్యాయంపై పార్లమెంటులో, రాష్ట్రంలోనూ నిరంతర నిరసనలు తెలిపే కార్యక్రమం చేపట్టాలని ఆ పార్టీ నిర్ణయం తీసుకొంది.

వైసీపీ కార్యచరణ ఇదే : ప్రత్యేక హోదా మన హక్కు–ప్యాకేజితో మోసపోవద్దు అనే నినాదంతో మార్చి 1వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించాలని వైసీపీ నిర్ణయం తీసుకొంది. వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. పార్టీ నాయకులతో కీలక సమావేశం జరిగింది. ముఖ్య నిర్ణయంగా వచ్చే నెల 1వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ఎదుట ప్రత్యేక హోదా మన హక్కు–ప్యాకేజితో మోసపోవద్దు అనే నినాదంతో ధర్నాలు చేయాలని నిర్ణయించాం. మార్చి 5వ తేదీన ప్రత్యేక హోదా మన హక్కు– ప్యాకేజి మాకొద్దు అన్న నినాదంతో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్యేలు, నేతలతో కలసి ధర్నా చేస్తాం. దీనికి సంబంధించి మార్చి 3వ తేదీన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ జెండా ఊపి నాయకులను ఢిల్లీకి పంపుతారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించేంత వరకూ వైసీపీ ఎట్టిపరిస్థితుల్లోనూ విశ్రమించబోదు. అనేక సార్లు ఏపీకి ప్రత్యేక హోదా కోసం వైఎస్ జగన్ ఆమరణ దీక్షలు, యువభేరీ సభలు నిర్వహించారు. ఆయన పిలుపు మేరకు వైసీపీ బంద్‌లు నిర్వహించింది. ప్రత్యేక హోదా సంజీవని అని, దాని వల్ల రాష్ట్ర ప్రజానీకానికి ఎనలేని ప్రయోజనాలు ఒనగూరుతాయని చెప్పింది ఒక్క వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీనే. ప్రత్యేక హోదాకు సమాధి కట్టేందుకు చంద్రబాబు ప్రభుత్వం చూస్తున్న సమయంలో వైసీపీ మళ్లీ పోరాటానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వాల మీద తిరగబడటం ప్రతిపక్షాల లక్షణం. దృఢమైన సంకల్పం ఉంది కాబట్టే మేం ప్రత్యేక హోదాను డిమాండ్ చేస్తున్నాం.

ఫలితం రానటువంటి పరిస్థితుల్లో ఎంపీలు కచ్చితంగా రాజీనామా చేస్తారు. దీనిపై పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ గతంలోనే స్పష్టమైన ప్రకటన చేశారు. వైఎస్ఆర్ సీపీ అభాండాలు వేయడానికి, అనునిత్యం మమ్మల్ని దోషులుగా నిలబెట్టేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు చూస్తున్నారు. మనది ప్రజాస్వామ్యం ప్రజలు అన్నీ చూస్తున్నారన్న విషయాన్ని గుర్తుంచుకోండి. సన్నాయి నొక్కులు నొక్కుతున్నది చంద్రబాబు. బాబు కేంద్ర ప్రభుత్వానికి వంగి, లొంగి ప్రత్యేక హోదాపై రోజుకో మాట చెప్పి తన స్థాయిని దిగజార్చుకున్నారు. ప్రత్యేక ప్యాకేజి ఏ మాత్రం ప్రజలకు మేలు చేయదు. ప్రత్యేక హోదా మాత్రమే ప్రజలకు మంచి చేయగలుగుతుంది.” అని ఆయన పేర్కొన్నారు.

చంద్రబాబు మౌనంగా ఉన్నారెందుకు–వైసీపీ నేతల ఆగ్రహం

విభజన హామీల సాధనలో సీఎం చంద్రబాబు విఫలమయ్యారని వైసీపీ నాయకులు విమర్శించారు. స్వప్రయోజనాల కోసం ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టారని ఆరోపించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన నెల్లూరు జిల్లా కలిగిరి మండలం పెద్దకొండూరులో జరుగుతున్న కీలక సమావేశానికి వైసీపీ ముఖ్య నేతలు హాజరయ్యారు. భేటీకి ముందు వారు మీడియాతో మాట్లాడారు.

డ్రామాలేంటి బాబు–ధర్మాన ప్రసాదరావు

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగినా చంద్రబాబు మౌనంగా ఉన్నారు. ఆయన వల్లే రాష్ట్రానికి ఈ దుర్గతి పట్టింది. విభజన హామీలు అమలు చేయాల్సిన బాధ్యత కేంద్రానిదే. కేంద్రంపై చంద్రబాబు ఎందుకు ఒత్తిడి తేవడం లేదు, కేంద్ర ప్రభుత్వంలో ఉండి డ్రామాలేంటి, రాష్ట్రానికి అన్యాయం చేసి సంబరాలు చేసుకోవడమేంటి, ప్రజల ఆగ్రహం నుంచి బయటపడేందుకు డ్రామాకు తెర లేపారు

తేడా ఉంది–ఎంపీ వర్రపసాద్

ప్రత్యేక హోదాకు, ప్యాకేజీకి చాలా తేడా ఉంది. హోదాతోనే ఏపీ అభివృద్ధి సాధ్యం. ప్యాకేజీతో ఒరిగేదేమీ ఉండదు. ప్యాకేజీతో చంద్రబాబుకు మేలు జరుగుతుంది. ప్రజలకు మాత్రం తీవ్ర అన్యాయం జరుగుతుంది. హోదాకోసం మేం నాలుగేళ్లుగా పోరాడుతున్నాం. జగన్ నిరవధిక నిరాహార దీక్ష చేశారు. హోదా సహా విభజన హామీలన్నీ అమలు చేయాలి. అప్పటివరకు వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగుతుంది

ఎన్నికల్లో ఇక పోటీ చేయను

- బీజేపీ సీనియర్ నేత ఉమాభారతి సంచలన నిర్ణయం
- ఎలాంటి ఎన్నికల్లోనుపోటీ చేయనని ప్రకటన
- వయోభారం, అనారోగ్యమే కారణమని వెల్లడి
- పార్టీకి సేవలు కొనసాగుతాయని స్పష్టీకరణ



ఝాన్సీ : బీజేపీ ‘అగ్గి బరాటా’గా పేరు తెచ్చుకున్న కేంద్ర మంత్రి, సీనియర్ నాయకురాలు ఉమాభారతి భవిష్యత్తు ఎన్నికల్లో తాను పోటీ చేయబోనని స్పష్టం చేశారు. కానీ, పార్టీకి మాత్రం తన సేవలు కొనసాగుతాయని ఆమె ఆదివారం ఝాన్సీలో మీడియా ముఖంగా స్పష్టం చేశారు. వయోభారం, ఆరోగ్య సమస్యల కారణంగా ఎన్నికల్లో పోటీ చేయరాదని తాను నిర్ణయం తీసుకున్నట్లు ఆమె చెప్పారు. ఇప్పటివరకు తాను రెండు పర్యాయాలు ఎంపీగా పని చేశానని, పార్టీ కోసం ఎంతో కష్టపడ్డానని, తన ఆరోగ్యం ప్రస్తుతం బాగోలేదని ఆమె అన్నారు. మోకాళ్లు, వెన్ను నొప్పితో చాలా బాధపడుతున్నానని ఆమె తెలిపారు. ప్రస్తు తం ఝాన్సీ ఎంపీ గా ఉన్న ఆమె గతంలో ఖజుర హోకి ప్రాతినిధ్యం వహించిన సంగతి తెలిసిందే.

మొదటి పేజీ తరువాయి

మరో సర్జికల్ దాడికి వస్తే తీవ్ర పరిణామాలు

పేర్కొంది. పాకిస్తాన్ భూభాగంలోకి అక్రమంగా చొచ్చుకువస్తున్న భారత్‌ను అడ్డుకోవాలని అంతర్జాతీయ సమాజాన్ని కోరింది. కాగా, సుంజువాన్ ఆర్మీ క్యాంపుపై జరిగిన ముష్కరుల దాడిలో ఐదుగురు జవాన్లు అమరవీరులు అయ్యారు. మరో జవాను తండ్రి కూడా ప్రాణాలు విడిచారు. పది మంది జవానుల కుటుంబీకులు కూడా ఈ దాడిలో గాయపడ్డారు. సోమవారం శ్రీనగర్‌లోని ఆర్మీ క్యాంపుపై ఉగ్ర దాడికి జరిగిన యత్నాన్ని భద్రతా దళాలు సమర్ధంగా తిప్పికొట్టాయి.

జమ్మూ కాశ్మీర్‌లో శనివారం తెల్లవారు జామున జరిగిన సుంజ్వాన్ ఘటనను మరచిపోక ముందే పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు మరో పన్నాగం పన్నారు. సరిహద్దులు దాటి వచ్చిన ఇద్దరు ఉగ్రవాదులు శ్రీనగర్‌లోని సీఆర్పీఎఫ్ (సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్) క్యాంపులోకి భారీ ఎత్తున ఆయుధాలతో చొరబడ్డారు. ఈ విషయాన్ని తెలుసుకున్న సైనికులు, ఆ ప్రాంతాన్నంతా తమ అధీనంలోకి తీసుకుని గాలింపు ప్రారంభించారు. సోమవారం ఉదయం నుంచి గాలింపు జరుగుతుండగా ఇప్పటి వరకూ ఉగ్రవాదులు పట్టుబడలేదు.

వారి వద్ద ఏకే–47 గన్స్, పెద్ద పెద్ద బ్యాగులు ఉన్నాయని తెలుస్తోంది. సైనిక క్యాంపుపై దాడి చేసే ఉద్దేశంతోనే వారు వచ్చి ఉంటారని అధికారులు భావిస్తున్నారు. సీఆర్పీఎఫ్ క్యాంపులోకి ఉగ్రవాదులు చొరబడిన ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. మరో వైపు సుంజ్వాన్ ఆర్మీ క్యాంపులో కూడా గాలింపు కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

నేడు ఉనికి పోరు

ద్వారా అడుగడుగునా ఆటంకాలు కల్పిస్తోందని దుయ్యబట్టారు. తెలిసిచేసినా తెలియక చేసినా రాష్ట్రప్రయోజనాలకు విరుద్ధంగా ఫిర్యాదులు పంపడం ప్రతిపక్షం అరాచకాలకు పరాకాష్ట అని మండిపడ్డారు. నేటినుంచి 116 రోజులు జలసంరక్షణ పనుల్లో అందరూ భాగస్వాములు కావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. రెండో దశ జల సంరక్షణ ఉద్యమాన్ని విజయవంతం చేస్తూ చెరువుల్లో పూడికతీత, ముళ్లకంపల తొలగింపు పనులు ముమ్మరం చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి వర్షపు చుక్కను సద్వినియోగం చేసుకోవాలని, రబీ పంట రుణాల లక్ష్యం 76శాతం చేరుకున్నామన్నారు.

116 రోజులపాటు నీరు–ప్రగతి...

116 రోజులపాటు నీరు–ప్రగతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. సోమవారం ప్రాధాన్యత ప్రాజెక్టుల పనులపై ఆయన మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని నదులను అనుసంధానం చేస్తామన్నారు. రాయలసీమను రతనాల సీమగా చేసి చూపిస్తామని సీఎం స్పష్టం చేశారు. రెండేళ్లు వర్షాలు పడకపోయినా నీటికి కొదవ లేకుండా చేస్తామన్నారు. రాష్ట్రంలో రెండు కోట్ల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలన్నదే తమ లక్ష్యమని చంద్రబాబు పేర్కొన్నారు. కొండవీటివాగు, పాలవాగులను సమర్థవంతంగా పూర్తి చేస్తామని, పులిచింతల నుంచి సముద్రం వరకు జల రవాణాను అభివృద్ధి చేస్తామని, బ్లూ అండ్ గ్రీన్ నగరంగా అమరావతిని అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

కేంద్రం సహకారం అందించాలి...

మూడున్నరేళ్లుగా కేంద్రానికి అన్నివిధాలా సహకరించాం. జిఎస్‌టి, పెద్దనోట్ల రద్దు తదితర అంశాలలో అండగా నిలిచాం. విభజనవల్ల తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ కు కేంద్రం మరింత సహకారం అందించాలి. పొరుగు రాష్ట్రాలతో సమాన స్థాయివచ్చేదాకా కేంద్రం చేయూత ఇవ్వాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. సోమవారం తన నివాసం నుంచి నీరు–ప్రగతి, వ్యవసాయం పురోగతిపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

స్వాతంత్ర్య పోరాటం గత చరిత్ర...

స్వాతంత్ర్యం కోసం పోరాడటం గత చరిత్ర. రాష్ట్రప్రయోజనాల కోసం పోరాడటం ప్రస్తుత చరిత్ర. రాష్ట్రప్రయోజనాల కోసం పోరాడుతున్న ఎంపీలు అందరికీ అభినందనలు. ఇదే స్ఫూర్తితో అధికార యంత్రాంగం పనిచేయాలి. మూడున్నరేళ్లుగా ప్రభుత్వ యంత్రాంగం తోడ్పాటువల్లే అన్ని సమస్యలు అధిగమించగలిగాం. బాధ్యత పెంచాం, సమర్ధత చూపాం. దీనిని ఇకపై కూడా మరింత బాధ్యతాయుతంగా, పారదర్శకంగా కొనసాగించాలి అని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

రాష్ట్ర ప్రజలను ఇబ్బంది పెట్టడమే...


ప్రతిపక్షం లేఖల ద్వారా అడుగడుగునా ఆటంకాలు కల్పిస్తోంది. రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్లమెంటులో పట్టుబట్టిన కేంద్రమంత్రి మీద ప్రతిపక్షం ఫిర్యాదులు శోచనీయం. తెలిసిచేసినా తెలియక చేసినా ఇది రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధం. ప్రతిపక్ష పోకడలు ప్రజాప్రయోజనాలను కాలరాసేలా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడం అంటే ప్రజలను ఇబ్బంది పెట్టడమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. నరేగా డిమాండ్ డ్రివెన్ ప్రోగ్రాం అంటూ, దానిపై కూడా ఫిర్యాదులు పంపడం ప్రతిపక్షం అరాచకాలకు పరాకాష్టగా దుయ్యబట్టారు. కన్వర్జన్స్ ద్వారా నరేగాలో ప్రతి రూపాయి ప్రజోపయోగం చేశామన్నారు. నరేగా నిధులు రాష్ట్రానికి వచ్చేందుకు దోహదపడిన యంత్రాంగాన్ని అభినందించారు. రబీ వ్యవసాయ పనులు పూర్తికావచ్చాయని, రాబోయే రెండునెలలు నరేగా పనులు ముమ్మరం చేయాలని సూచించారు. మరో కోటి 80లక్షల మేండేట్ కు అవకాశం ఉందంటూ, నరేగా పనిదినాల లక్ష్యం చేరుకోవాలన్నారు.

అందరూ భాగస్వాములు కావాలి...

నేటినుంచి 116రోజులు జలసంరక్షణ పనుల్లో అందరూ భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. రెండవదశ జలసంరక్షణ ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.చెరువుల్లో పూడిక తీత, ముళ్లకంపల తొలగింపు, గట్ల పటిష్టం తదితర పనులను ముమ్మరం చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 14వేల చెరువులు, 2,500 సెలయేళ్లు, 10వేల చెక్ డ్యామ్ లలో చేపట్టిన జలసంరక్షణ పనులను విజయవంతం చేయాలని కోరారు. ప్రతి వర్షపు చుక్కను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాలవాగు పనుల్లో తాను స్వయంగా పాల్గొంటున్నానంటూ, ఆయా జిల్లాల్లో జరిగే పనుల్లో కలెక్టర్లు, మంత్రులు విధిగా పాల్గొనాలని ఆదేశించారు.

ఇ–నామ్ లో మనరాష్ట్రమే ముందుండాలి...

రబీ పంటరుణాల లక్ష్యం 76%చేరుకున్నామంటూ,మిగిలిన రుణాలు కూడా వెంటనే అందజేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. కౌలురైతులకు పంటరుణాల పంపిణీ శ్రీకాకుళం,కడపలో మరింత ముమ్మరం కావాలన్నారు. నీతి అయోగ్ వ్యవసాయ కమిటీ సభ్యుడు రమేష్ చంద్ర పశ్చిమ గోదావరి జిల్లా పర్యటనలో మన రాష్ట్రంలో జరుగుతున్న ఇ–నామ్(ఇ–నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్) ను ప్రశంసించారని వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ పేర్కొనగా, ఇ–నామ్ లో దేశంలో మనరాష్ట్రం ముందుండాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ప్రపంచంలో మేలైన విధానాలు, శాస్త్రసాంకేతికత రాష్ట్రంలో రైతులకు చేరువ చేస్తున్న విషయం ప్రస్తావించి ఉద్యానరంగం, పాడి పరిశ్రమలో మరింత పురోగతి సాధించాలన్నారు. ఈ బడ్జెట్‌లో కేంద్రం పెట్టిన నిధు లను పశు గణాభివృద్ధి రంగం, మత్స్య రంగాలలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధికి వినియోగిం చుకోవాలని సూచించారు.



త్వరలో లక్షన్నర సామూహిక గృహప్రవేశాలు...

అక్టోబర్ 2న లక్షగృహాల సామూహిక గృహ ప్రవేశం విజయవంతం చేశాం. త్వరలోనే జరిగే లక్షన్నర గృహాల సామూహిక గృహప్రవేశం కూడా విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి కోరారు. ప్రస్తుతం రోజుకు 100ఇళ్ల నిర్మాణం పూర్తిచేస్తున్నామని, దీనిని 150ఇళ్లకు పెంచాలని ఆదేశించారు. ప్రతిరోజూ 150 ఇళ్ళ నిర్మాణం పూర్తికావాలన్నదే లక్ష్యంగా పేర్కొన్నారు. 2016–17 పనులు ప్రారంభమైన అన్ని ఇళ్లను వెంటనే పూర్తిచేయాలన్నారు. 2017–18, 2018–19 మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. అంగన్ వాడి భవనాల నిర్మాణం ముమ్మరం చేయాలన్నారు. గాలినాణ్యత (ఎయిర్ క్వాలిటి)లో మనరాష్ట్రమే ముందుండాలన్నారు. అటవీశాఖ మిగిలిన శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు.పర్యావరణం బాగుంటే పర్యాటకంలో గణనీయ ప్రగతి సాధిస్తామన్నారు.దేశంలో ఇప్పటికే 3వస్థానంలో ఉన్నామంటూ అగ్రస్థానం పొందే దిశగా కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో పింఛన్లకు నగదు కొరత లేకుండా చూడాలన్నారు. వయోవృద్ధులు,వితంతువులు,దివ్యాంగులకు ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్ పంపిణీ చేస్తున్న విషయం ప్రస్తావించారు. నగదు కొరత పింఛన్ల పంపిణీకి ప్రతిబంధకం కారాదన్నారు. నగదు కొరత నివారణకు ఆర్బీఐకి లేఖ రాయనున్నట్లుగా తెలిపారు.

పేర్లు నేషనల్ పోర్టల్ లో నమోదు చేయాలి...

ప్రధానమంత్రి–చంద్రన్న బీమా పథకంపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. మార్చి31లోపుగా కార్మికుల బిడ్డలందరి పేర్లు నేషనల్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. కార్మికుల బిడ్డలకు రూ. 1,200 ఉపకార వేతనం అందేలా చూడాలన్నారు. దీనిపై ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు సమన్వయంగా పని చేయాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్ లోప్రణాళికా మండలి ఉపాధ్యక్షులు కుటుంబరావు, జల వనరులు, వ్యవసాయం అనుబంధ రంగాలు, గ్రామీణాభివృద్ధి శాఖల ముఖ్య కార్యదర్శులు శశిభూషణ్, రాజశేఖర్, గోపాలకృష్ణ ద్వివేది, జవహర్‌రెడ్డి, పంచాయితీరాజ్ కమిషనర్ రామాంజనేయులు, హౌసింగ్, రియల్ టైం గవర్నెన్స్ ఎండిలు కాంతిలాల్ దండే, అహ్మద్ బాబు, సెర్ప్ సీఈవో కృష్ణమోహన్, వివిధ జిల్లాల కలెక్టర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫీజులేవి బాబూ?

ఫీజు రీయింబర్స్‌మెంట్ కాలేజీల ఖాతాలకు జమచేసి, స్కాలర్‌షిప్‌లను విద్యార్థుల ఖాతాల్లో వేయాల్సి ఉంది. ఈ రెండూ పూర్తి స్థాయిలో జరగలేదు. దీంతో 70శాతం కాలేజీలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. రాష్ట్రంలోని సింహభాగం ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ వృత్తి విద్యా కాలేజీల్లో పనిచేసే టీచర్లకు గత 6నెలల నుంచి జీతాలు చెల్లించడం లేదు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజులు వసూలు చేసుకునే అవకాశం ఇవ్వమంటే, అలా కుదరదంటున్నారని చెబుతున్నాయి. సిబ్బంది జీతాలతోపాటు ఇంటిపన్ను, విద్యుత్ బిల్లులు చెల్లించలేకపోతున్నామని, ప్రావిడెంట్ ఫండ్, ఇన్‌కమ్‌టాక్స్, బ్యాంక్ రుణాలపై వడ్డీలు, ఇంటర్నెట్ చార్జీలు, తదితర చెల్లింపులన్నీ పెండింగ్‌లో పెట్టాల్సిన అసాధారణ పరిస్థితి ఏర్పడిందంటున్నాయి. దీనివల్ల తమ విద్యాసంస్థల ఆస్తులను జప్తు చేస్తామంటూ నోటీసులు జారీ చేస్తున్నారని యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఫీజుల బకాయిలు రూ. కోట్లకు పెరిగిపోతున్నాయని, ఈ పరిస్థితుల్లో కాలేజీలను నిర్వహించలేమని ఏపీ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజ్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం. శాంతిరాముడు, జనరల్ సెక్రెటరీ ఎన్. విజయభాస్కరచౌదరి తదితరులు తేల్చిచెప్పారు. వృత్తి విద్యా సంస్థలకు పన్నుల నుంచి మినహాయింపు ఇవ్వాలని వారు కోరారు.



విజయవాడలో హ్యాపీ సిటీస్ సమ్మిట్

విజయవాడ, సూర్యబ్యూరో : వచ్చే ఏప్రిల్‌లో ఆంధ్రప్రదేశ్ లో నిర్వహించే హ్యాపీ సిటీస్ సమ్మిట్-2018 సదస్సుకు విజయవాడ ఏ-1 కన్వెన్షన్ సెంటర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఖరారు చేశారు. సోమవారం సచివాలయంలో నిర్వహించిన సీఆర్డీఏ సమీక్షా సమావేశంలో హ్యాపీ సిటీస్ సమ్మిట్ కు సన్నాహక ఏర్పాట్లపై ఆయన మాట్లాడారు. సదస్సులో అతిథులకు ఆర్గానిక్ వంటకాలను వడ్డించాలని, అతిథుల భద్రతకోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పార్కింగ్ సదుపాయాలు పక్కాగా ఉండాలని సూచనలు చేశారు. హ్యాపీ సిటీస్ సమ్మిట్ అమరావతి-2018 కి లోగో రూపకల్పనపై చర్చించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కొన్ని నమూనాలు పరిశీలించారు. మరింత ఆకర్షణీయంగా రూపొందించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ సంస్కృతిని ప్రతిబింబించాలని, కూచిపూడి డ్యాన్స్ ఐకాన్ ను ఉంచాలని సూచించారు. హ్యాపీ సిటీస్ సమ్మిట్ లోగో లో ఇంకా అసెంబ్లీ భవనం, హరిత, జల రాజధాని ఇతివృత్తాన్ని ప్రతిబింబించాలన్నారు. సదస్సులో వివిధ అంశాలపై చర్చలకు వేదికలను రూపొందించాలని కోరారు. ఇదిలా ఉంటే ఆంధ్రప్రదేశ్ తాత్కాలిక హైకోర్టు భవనంగా సిటీ సివిల్ కోర్టు కాంప్లెక్స్ ను వినియోగించవచ్చని సీఆర్డీఏ ప్రతిపాదించగా ముఖ్యమంత్రి పరిశీలిద్దామన్నారు. రాజధాని అమరావతిలో రోడ్ల నిర్మాణం ఎక్కడిదాకా వచ్చిందని సీసీడీ ఎంసీ ఎండీ లక్ష్మీ పార్థసారథిని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. వర్షాకాలం వచ్చేలోగా రహదారుల నిర్మాణం పూర్తికావాలని చంద్రబాబు ఆదేశించారు. దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో తనను కలసిన దస్సాల్ట్ సిస్టమ్స్ ప్రతినిధులు సోమవారం సచివాలయంలో సీఆర్డీయే సమావేశంలో పాల్గొని వర్చువల్ 3సిటీ ప్రతిపాదనపై ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వ డేటాబేస్‌కు తక్షణ సమాచారం అందు తుందని, వాస్తవిక సమయ దృశ్యాలను చూడవచ్చని అన్నారు. నిఘా వ్యవస్థకు, ట్రాకింగ్‌కు సహాయకారిగా ఈ విధానం ఉంటుందని సీఎం చెప్పారు. సమా వేశంలో మంత్రి నారాయణ, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్ చంద్ర, సీఎం ముఖ్యకార్యదర్శి జి. సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బి-థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని

ఎన్టీపీసీకి అప్పగిస్తే ఊరుకునేది లేదు

- జెన్‌కో వారికి చేతకాకపోతే సింగరేణికి అప్పగించండి
- జెన్‌కో సిఎండి ఏది చెపితే అదే చేయడం సరికాదు
- రాజ్‌ఠాకూర్ చేస్తున్న దీక్ష పైనే రామగుండం భవిష్యత్తు
- సిఎల్‌పి ఉపనేత, మాజీ మంత్రి టి. జీవన్‌రెడ్డి


గోదావరిఖని, మేజర్‌న్యూస్ : తెలంగాణ ప్రభుత్వం రామగుండం బి-థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని మూసి వేసి ఆ స్థలాన్ని ఎన్టీపీసీకి అప్పగించాలని చూస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ పార్టీ శాసనసభ పక్ష ఉపనేత, మాజీ మంత్రి టి. జీవన్‌రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం రామగుండం పట్టణంలోని జీరో పాయింట్ వద్ద శాప్ మాజీ చైర్మన్ మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ బి-థర్మల్ పాజెక్టును మూసివేయకుండా విస్తరణకు ప్రభుత్వం బడ్జెట్ కెటాయించాలని డిమాండ్ చేస్తూ ఒక్క రోజు నిరహార దీక్షను చేపట్టారు. ఈ దీక్ష శిభిరాన్ని మాజీ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి జీవన్‌రెడ్డి సందర్శించి రాజ్‌ఠాకూర్ దీక్షకు సంఘీభావం తెలుపడంతో పాటు ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన పై నిప్పులు చెరిగారు. సెంట్రల్ ఎలక్ట్రిసిటి అథారిటి(సిఇఎ) సూచన ప్రకారం ఇక్కడ అధునాతన సూపర్ క్రిటికల్ 800 మెగావాట్ల సామర్థ్యం విద్యుత్ కేంద్రాలను స్థాపించాలని సిఫారస్సు చేస్తే, ముఖ్యమంత్రి కేసీఆర్ ఏకంగా బి-స్టేషన్‌ను మూసివేసి ఆ స్థలాన్ని ఎన్టీపీసీకి అప్పగించాలని చూడడం గర్హనీయమని అన్నారు. అంతే కాకుండా బి-స్టేషన్ స్థానంలో 800 మెగావాట్ల సామర్థ్యం గల రెండు యూనిట్‌లను పెట్టేందుకు వివరణాత్మక ప్రాజెక్టు రిపోర్ట్(డిపిఆర్) సిద్ధంగా ఉన్నా ప్రభుత్వం కేవలం కాంగ్రెస్ పార్టీ హయాంలో అనుమతులు ఇచ్చి ప్రాజెక్టులు కాదని, స్వంతంగా ప్రాజెక్టులు ఏర్పాటు చేసు కుంటూ వారి స్వలాభం కోసం పరితపిస్తోందని అన్నారు. జెన్‌కో సిఅండ్‌ఎండి ఆడింది ఆట-పాడింది పాటగా మారిందని, ముఖ్యమంత్రి ఏది చెపితే అది చేయడానికి మాత్రమే ఆయన ఉన్నాడని..సాంకేతిక అంశాలను పరిశీలిం చాల్సిన భాద్యత సిఅండ్‌ఎండికి లేదా అని ప్రశ్నించారు. బి-థర్మల్ ప్రాజెక్టును విస్తరించే సత్తా జెన్‌కోకు లేకుండా ఆ భాద్యతలను సింగరేణి సంస్థకు అప్పగించాలని, సింగరేణి సంస్థ జైపూర్ పవర్ ప్రాజెక్టును 94 పిఎల్‌ఎఫ్ వద్ద దిగ్విజయంగా నడిపించడం గర్వకారమణని అన్నారు. ఇదిలా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును రిడిజైన్ చేసి మేడిగడ్డ, అన్నారంలో రెండు ఎత్తిపోతల పథకాలను అదనంగా పెట్టడం ద్వారా వెయ్యి మెగావాట్ల విద్యుత్ అదనంగా ఖర్చు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం కాంగ్రెస్ పార్టీకి ఎక్కడ పేరు వస్తుందో అనే ఒకేఒక్క కారణంతో అదనంగా రెండు ఎత్తిపోతల పథకాలను తీసుకవచ్చి రూ.5 వేల కోట్ల భారాన్ని ప్రజల పై మోపడం కేవలం వారి పెద్దరికం కోసమేనని జీవన్‌రెడ్డి ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రాంతం 58 యేండ్ల సమైఖ్య పాలనలో రూ.67వేల కోట్ల అప్పులు, రాష్ట్రం ఏర్పడ్డాక 2015 మార్చి నాటికి అంటే 34 నెలలకే లక్ష 35 వేల కోట్ల రూపాయల అప్పుల్లోకి వెళ్ళడాన్ని ప్రజలు గమనించాలని కోరారు. కరీంనగర్ మిడ్‌మానేరు నుంచి 14 టిఎంసిల నీటిని హరీశ్‌రావు వారి ప్రాంతాలకు తరలించుకపోవడం ద్వారా పెద్దపల్లి, మంథని ప్రాంతాల ప్రజలు, రైతులు నీళ్లు లేక అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టిఆర్‌ఎస్ పార్టీ ప్రభుత్వ పాలనలో ఉత్తర తెలంగాణ ప్రాంతం పూర్తిగా అన్యాయానికి గురవుతోంద ని, రామగుండం బి-థర్మల్ ప్రాజెక్టును మూసి వేయడం ద్వారా రామగుండం పట్టణం పూర్తిగా అందకారం అయిపోయే ప్రమాదం ఉందని జీవన్‌రెడ్డి వివరించారు. మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ చేస్తున్న దీక్ష తన స్వలాభం కోసం ఏ మాత్రం కాదనే వాస్తవ విషయాన్ని ఇక్కడి ప్రజలు గమనించాలని, ఆయన చేపడుతున్న దీక్ష పైనే ఈ ప్రాంత భవిష్యత్తు ఆధారపడి ఉందని, ఎట్టి పరిస్థితుల్లో బి-థర్మల్ ప్రాజెక్టును మూసివేయకుండా



పరిరక్షించుకోవాల్సిన భాద్యత ప్రజల పైనే ఉందని గుర్తు చేశారు. రాజ్‌ఠాకూర్ చేపట్టిన ఒక్కరోజు నిరహార దీక్షకు రామగుండం ప్రాంతం నుంచి ప్రజలు స్వచ్ఛందంగా వేలాది తరలిరావడం కనిపించింది. సాయంత్రం జీవన్‌రెడ్డి, శ్రీధర్‌బాబు మక్కాన్‌సింగ్‌కు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ దీక్షలో కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కటకం మృత్యుంజయం, మాజీ ఎమ్మెల్యే సిహెచ్.విజయరమణారావు, సీనియర్ నాయకులు హర్కర వేణుగోపాల్‌రావు, మాజీ జెడ్‌పి చైర్మన్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కార్పోరేటర్‌లు మహంకాళి స్వామి, బొంతల రాజేశ్,గోపాల్‌రావు, పెద్దెల్లి ప్రకాశ్, కొలిపాక సుజాత, పద్మ తదితరులతో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన రామగుండం కార్పోరేషన్, మండల స్థాయి అధినేతలు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ట్రీ కవర్ (పచ్చదనం పెంపు)లో ఏపి నంబర్ వన్

ఏపి ప్రభుత్వానికి సర్వే ఆఫ్ ఇండియా ప్రశంస



విజయవాడ, సూర్య బ్యూరో : ఆంధ్రప్రదేశ్ సిగలో మరో కలికితురాయి చేరింది. ఏపి అటవీశాఖ అధికారులు పచ్చదనం పెంచడంలో అవిరళ కృషి చేసిన కారణంగా పూర్తిస్థాయిలో దేశంలోనే సఫలీకృతంమైంది అని ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా, సోమవారం వెబ్‌సైట్ నందు వెల్లడించింది. ప్రతీ రెండు సంవత్సరాలకు ఒకసారి ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా నివేదించే నివేదికలో ఈఏడాది ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచింది. 2141 చ.కీ.మీ ఏరియా విస్తీర్ణంలో పచ్చదనం పెంపొందించడం జరిగిందని నివేదికలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు 2016 లో వనంమనం కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజలు, వివిధ శాఖల భాగస్వామ్యంతో ఇప్పటివరకూ వనంమనం కార్యక్రమంలో 49.93 కోట్ల మొక్కలను నాటటం జరిగిందని అటవీశాఖ దళాదిపతి (పి.సి.సి.ఎఫ్) పి. మల్లిఖార్జునరావు వెల్లడించారు. అటవీ ప్రాంతాల్లో వివిధ మిశ్రమ జాతుల మొక్కలను 26,853 హెక్టార్లలో నాటటం జరిగిందని ఆయన వివరించారు. రహదారుల వెంట 1415 కీ॥మీ పొడవున ఇప్పటివరకూ మొక్కలు నాటటం జరిగిందని ఆయన తెలిపారు. 2936 మెట్రిక్ టన్నుల విత్తనాలు చల్లటం జరిగిందని ఆయన వివరించారు. 3 వేల కిలోమీటర్ల మేర అటవీ సరిహద్దుల వెంట కందకాలు తవ్వటం జరిగిందని తెలిపారు. అడవిలో కార్చిచ్చు నివారణకు భూసారం కొట్టుకు పోకుండా, కోత నివారణ, భూగర్భ జలాల పెంపు తదితరాలకు ప్రభుత్వం సంరక్షణా చర్యలు చేపట్టింది. నల్లమల అటవీప్రాంతాల్లో కూడా వినూత్న తరహాలో కందకాలు త్రవ్వుతున్నారు. అడవిలో కురిసే వర్షాలు వలన ఈ కందకాలలో నిత్యం నీరు ఉండటంతోపాటు చెట్లు చేమలు పచ్చగా ఉంటాయని పి.సి.సి.ఎఫ్ మల్లిఖార్జునరావు తెలిపారు. అటవీ ప్రాంతాల్లో 349 చెక్ డ్యాములు నిర్మించ డం జరిగింది. సర్వే ఆఫ్ ఇండియావారు వెల్లడించిన ప్రకారం మొదటి స్థానం లో ఎ.పి ఉండగా రెండవ స్థానంలో కర్ణాటక నిలిచింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, అటవీశాఖ మంత్రి శిద్ధా రాఘవ రావు లను సర్వే ఆఫ్ ఇండియా ఈ సందర్భంగా ప్రసంశించింది.

'ఆ పాపం బొత్స, ధర్మానను వెంటాడుతోంది'



అమరావతి, సూర్య బ్యూరో : గత మూడు రోజులుగా నవయుగ కంపెనీ కాంక్రీటు పనులు చేస్తోందని ఏపీ జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం ఇక్కడ ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం 53 శాతం పూర్తయిందని, కుడి, ఎడమ ప్రధాన కాల్వల బ్యాలెన్స్ పనులను వేగంగా పూర్తి చేస్తామని ఆయన చెప్పారు. డిసెంబర్ నాటికి 48 గేట్లు అమర్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకు పోలవరం ప్రాజెక్టుకు రూ. 12,915 కోట్లు, జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాక రూ. 7,779 కోట్లు ఖర్చు చేశామని దేవినేని వ్యాఖ్యానించారు. కేంద్రం నుంచి రూ. 4,932 కోట్లు వచ్చాయని, రూ. 2847 కోట్లు రావాల్సి ఉందన్నారు. ఎప్పటి కప్పుడు ప్రాజెక్ట్ వివరాలను కేంద్రానికి అందిస్తున్నామని మంత్రి తెలిపారు. పోలవరంపై పూర్తి పారదర్శకతతో వ్యవహరిస్తున్నామని ఉమ తెలిపారు. దేశంలో ఇంత పారదర్శకంగా నిర్మిస్తున్న ప్రాజెక్టు మరొకటి లేదని, గుండె కాయలాంటి ప్రాజెక్టును ఆపడానికి జగన్ కుట్రలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో తోటపల్లి ప్రాజెక్టును పూర్తి చేయలేకపోయారని, ఆ పాపం బొత్స, ధర్మానను వెంటాడుతోందని మంత్రి దేవినేని ఉమ వ్యాఖ్యానించారు.

కేంద్ర ప్రభుత్వం నిర్ణయం కోసం వేచి చూస్తున్నాం



తూర్పుగోదావరి, సూర్యబ్యూరో: కేంద్ర ప్రభు త్వం నిర్ణయం కోసం వేచి చూస్తున్నామని ఎంపీ తోట నరసంహం అన్నారు. సోమవారం ఎంపీ మాట్లాడుతూ హామీలు నెరవేర్చకపోతే మళ్ళీ ఉద్యమిస్తామన్నారు. పార్లమెంట్‌లో మేము ప్రజల కోసం పోరాడుతుంటే, వైసీపీ సభ్యులు డ్రామా లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. వైసీపీ నాయకులు అవగాహణ లేకుండా టీడీపీ కేంద్ర మంత్రులపై ఆరోపణలు చేస్తున్నారన్నారు.

బహుజన లెఫ్ట్‌ఫ్రంట్ ముందున్న సవాళ్లు

- లాల్-నీల్ జెండాలు ఐక్యత ఎంత వరకు ఫలిస్తుంది?
- సామాజిక న్యాయం సాధిస్తారా?
- 28 పార్టీలతో ఐక్యత సాధ్యమేనా?
- లెఫ్ట్ పార్టీలన్నీ ఎందుకు కలసి రావటం లేదు?
- డబ్బు లేకుండా రాజకీయాలు చేయగలరా?
- సిపిఎం పార్టీ ఫ్రంట్‌ను నడపటంలో సక్సెస్ అవుతుందా?

ఖమ్మం, సూర్యబ్యూరో : సామాజిక న్యాయం ప్రధాన ఎజెండాగా తెలంగాణ రాష్ట్రంలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఏర్పడింది. ఇది దేశానికే దిక్సూచి అని దీని ఏర్పాటులో ప్రధాన భూమిక పోషించిన సిపిఎం పేర్కొంటున్నది. లాల్-నీల్ జెండాలను ఏకం చేయాలనేది వీరి ఆలోచన. వీరి ప్రయత్నాలు ఎంతవరకు ఫలిస్తాయి. బహుజన లెఫ్ట్‌ఫ్రంట్‌ను ప్రజలు ఎంత వరకు ఆదరిస్తారు. దీని మనుగడ ఏమిటి? దీనిలో ఉన్న పార్టీల వెనక ఉన్న ప్రజాశక్తి ఎంత? అసలు దీని ప్రయోగం ఫలితాలనిస్తుందా? అనే సందేహాలకు జవాబులు దొరకాలంటే ఎన్నికల వరకు ఆగాల్సిందే. ఫ్రంట్ ఏర్పాటు కోసం ముందుకు వచ్చిన కొందరు వెనక్కు తగ్గారు. గద్దర్ ఈ ఫ్రంట్‌కు చైర్మన్‌గా వ్యవహరిస్తాడని అందరు భావించినా అదిజరగలేదు. మాజీ వైకాపా నేత నల్లా సూర్యప్రకాష్‌రావును చైర్మన్‌గా నియమించారు. రాష్ట్రంలో అధికారంలోకి రావాలన్నది వీరి ఎజెండా. ఇందులో ఎలాంటి దాపరికం లేకుండానే చెప్పారు. ఇందుకు వారు నిజాయతీగానే వ్యవహరించారు. అధికారం కోసం బడుగు బలహీన వర్గాలను ఏకం చేయాలనేది వీరి ఆలోచన. తక్కువగా జనాభా కలిగిన కొద్దిమంది సంపన్న కులాల చేతిలో ఉన్న అధికారాన్ని బహుజనుల చేతిలోకి తీసుకోవాలనేది వీరి సంకల్పం. ఇది అనుకున్నంత తేలిక కాదని దీనికి అనేక అవరోధాలు, అడ్డంకులు ఉంటాయినే విషయం వారికి తెలియంది కాదు. దేశంలో కమ్యూనిస్టులు బలహీనపడటంతో కమ్యూనిస్టు రాజకీయాలకు కాలం చెల్లిందని ప్రచారం జరుగుతుంది. ఈ నేపద్యంలో లాల్-నీల్ జెండాలను ఏకం చేయటం ద్వారా ఫ్రంట్ పేరుతో ప్రజల్లోకి వెళ్లెందుకు సిపియం ప్రయత్నం చేస్తుందనే అభిప్రాయాలు వ్యక్తం అవతున్నాయి. కమ్యూనిస్టు రాజకీయాలకు కాలం చెల్లిందని జరుగుతున్న ప్రచారంలో నిజానిజాలు ఏలా ఉన్నా అసలు సిపియం లాంటి నిర్మాణ బలం సిద్ధాంత పటిమగల పార్టీ తన విధానాలను మార్చుకుంటుందా? దేశంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితలను ఆధ్యయనం చేయటంలో అంచనాలు వేయటంలో ఎక్కడో తేడా జరుగుతుంది. అధికారంలో ఉన్న పార్టీపై వారి అంచనాలు ఏమిటి? ప్రధాన శత్రువు ఏవరు? ఎవరిపై పోరాటం అనేదానిపై ఇప్పటికే లోతైన చర్చలు జరుపుతుంద వచ్చు. స్థూలంగా చెప్పాలంటే తెలంగాణ రాష్ట్ర పార్టీ మహసభలు ఇటీవలనే నల్గొండలో జరిగాయి. దానిలో ప్రధానంగా సామాజక న్యాయం ఏజెండాగా బహుజనులను ఏకం చేయాలనే తీర్మానం చేశారు. లాల్-నీల్ జెండాలను ఏకంచేయటం ద్వారా ప్రజాపునాదిని గట్టిపరుచుకోచ్చుననే ఎత్తుగడతో వారు తమ కార్యాచరణ రూపొందించు కున్నట్లు తెలుస్తుంది. ఇదే విధానం సిపియం దేశవ్యాపితంగా అమలు చేస్తుందా? రాష్ట్రానికి రాష్ట్రానికి మధ్య తేడాలు ఉంటాయా? బహుజన ఫ్రంట్ ఆంధ్రలో ఎందుకు ఏర్పాటు చేయటం లేదనే ప్రశ్న సహజంగానే ఉదయిస్తుంది దానికి వారి సమాధానం ఏమిటి? అధికారం కోసమే ఫ్రంట్ ఏర్పాటు చేస్తున్నట్లు ముందుగా ప్రకటించినా ఎందుకో కొంత వెనక్కు తగ్గి నట్లు కనిపిస్తుంది. ఈసారి తాము అధికారంలోకి రాకపోయినా 2024 లో తమదే అధికార మంటున్నారు. బహుజన లెఫ్ట్‌ఫ్రంట్ ఏర్పాటుతో నిజంగా తెలంగాణ రాష్ట్ర రాజకీయాలు మారతాయా? రకరకాల చిన్నచిన్న పార్టీలు ,రకరకాల ఆలోచనలతో ఉన్న వ్యక్తులతో ఏర్పాటైన ఫ్రంట్ మనగడ సాగిస్తుందా? ఎన్నికల్లో ఒకే గుర్తు లేకుండా పోటి చేస్తే ఫలితాలు ఉంటాయా? ఒకే గుర్తుపై గెలిచిన వారే పార్టీలు మారుతుండగా ఇందులోనుంచి ఒకరో అరో వ్యక్తులు గెలిచిన మారరనే గ్యారంటి ఏమిటి? అనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఒక వార్డు మెంబర్‌గా గెలవాలంటేనే లక్షల రూపాయాలు ఖర్చుచేస్తున్న ఈరోజుల్లో డబ్బు, ఫిరాయింపులు, ఆవకాశవాదం అమ్ముడుపోయో రాజకీయాలకు ప్రత్యామ్నయంగా స్వచ్ఛమైన రాజకీయాలు ఈ ఫ్రంట్ చేయగలుగుతుందా? నిజంగా డబ్బులేకుండా రాజకీయాలు చేయటం సాధ్యమా? ఫిరాయింపులు, ఆవకాశవాదాన్ని నిలవరించే సత్తా ఫ్రంట్‌కు ఉంటుందా? నోట్లు , ఓట్ల రాజకీయాల్లో ఇది ఎంత వరకు విజయవంతం అవుతుంది. కులాల కుమ్ములాటలు, మతాల మధ్య ఘర్షణల నేపద్యంలో ఏర్పడిన కొత్త ఫ్రంట్‌కు ఎన్నో సవాళ్ళ ఎదురు కానున్నాయి. రాష్ట్రంలో టిఆర్‌యస్, కాంగ్రెస్, బిజెపి పార్టీలు సామాజిక న్యాయం అమలు చేయటం లేదని, ప్రజల సమస్యలను పరిష్కరించటంలో ఆ పార్టీలన్నీ ఒకే తానులో ముక్కలని అందువల్ల వాటికి ప్రత్యామ్నయ వేధిక ఒకటి అవసరం ఉందనే అభిప్రాయంతో ఉన్న 28 చిన్న చిన్న రాజకీయ పార్టీలు, కొన్ని సంస్థలు, ఇందులో చేరాయి. రాష్ట్రంలోని అన్ని నియోజక వర్గాల్లో ఫ్రంట్ తరుపున అభ్యర్దులను పోటి పెట్టానున్నట్లు ఫ్రంట్ నేతలు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తరువాత అధికారంలోకి వచ్చిన టిఆర్‌యస్ పాలనపై ప్రజలు నిజంగానే విరక్తిగా ఉన్నారా? లేరని వారి రాష్ట్ర పార్టీ రాజకీయ నివేధికలోనే రాసుకున్నట్లు వార్తలు వచ్చాయి. మరి అలాంటప్పుడు టిఆర్‌యస్‌ను అధికారంలోకి రాకుండా నిరోదించేందుకు ఏలాంటి వ్యూహ రచనలు చేస్తున్నారు. ఒకవేళ అలా కార్యాచరణ లేకపోతే టిఆర్‌యస్ అధికారంలోకి వచ్చేందుకే ఈ ఫ్రంటు సహాయపడుతుందనే ఆరోపణలకు బలం చేకూరుతుంది కదా? ఫ్రంట్ చెబుతున్నట్లు బడుగు బలహీన వర్గాలు, ఎస్సీలు, ఎస్టీలు, బిసీలు మైనార్టీలు రాష్ట్రంలో 80 శాతంకు పైగానే ఉన్నారు. మోజార్టీగా ఉన్న బహుజన కులాలు పాలనకు దూరంగా ఉంటుండగా జనాబాలో తక్కువగా ఉన్న కొన్ని కులాలు అధికారాన్ని చెలాయిస్తున్నాయని అందువల్ల జనాభాలో అధికశాతంగాఉన్న కులాలను ఏకంచేసి ప్రత్యామ్న యంగా ఎదగాలనే కోరికలో ఏలాంటి తప్పులేదు. అందుకు రాష్ట్రంలో ఉన్న రాజకీయ, బౌతిక పరిస్థితులు ఎంత వరకు సహకరిస్తాయి. అయితే వామ పక్ష పార్టీలలో మరో ప్రధానమైన సిపిఐ ఈ ఫ్రంట్‌లో చేరేందుకు సుముఖత చూపలేదు. న్యూడెమోక్రసీ లాంటి పార్టీ దీనికి దూరంగానే ఉంది. ప్రధానమైన రెండు వామపక్షపార్టీలు లేకపోవటం కొంత వెలితిగానే ఉంటుంది కదా? టిఆర్‌యస్ ను గద్దెదించేందుకు అవసరమైతే కాంగ్రెస్‌తో కలిసేందుకు సిపిఐ సిద్దంగా ఉన్నట్లు తెలుస్తుంది.

సిపిఐని ఫ్రంట్‌లోకి తెచ్చేందుకు సిపియం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్వయంగా సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవ రం సుధాకర్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. అందుకు వారు సుముఖత చూపలే దని తెలుస్తుంది. ప్రస్తుత పరిస్థితుల్లో బహుజన ఫ్రంట్ ద్వారా టిఆర్‌యస్, కాంగ్రెస్‌లను ఓడించటం సాధ్యం కాదనే అభిప్రాయంతో ఆ పార్టీ ఉంది. ఫ్రంట్ ఏర్పాటు వల్ల టిఆర్‌యస్‌కు లాభం జరుగుతుందని టిఆర్‌యస్‌కు లాభం జరిగే విధంగా తాము వ్యవహరించే ప్రసక్తే లేదని చెబుతుంది. కోదండ రామ్, జస్టిస్ చంద్రకుమార్ లాంటి వారు కూడా దీనిపై పెద్దగా ఆశక్తిచూపినట్లు లేదు. ఈ ఫ్రంట్ ఏర్పాటును సిపియం జాతీయ నాయకత్వం అంగీకరించింది. అయితే ఇదే తరహలో వివిధ రాష్ట్రాలలో ఫ్రంట్‌ల ఏర్పాటుకు ఉన్న ఆవకా శాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తుంది. ఉత్తరప్రదేశ్‌లో బిఎస్పీ అధినేత్రి మయా వతితో గుజరాత్‌లో జిగ్నేష్, తెలంగాణలో మంద కృష్ణ మాధిగ లాంటి వారితో పాటు ఇతర రాష్ట్రాలలో కూడా బహుజనల్లో ఉద్యమాలు నిర్వహిస్తున్న వారితో సంప్రదింపులు జరుపాలనే యోచనలో ఉంది. ప్రధానంగా అట్టడుగు, బడుగు బలహీన వర్గాల వేధికగా దీన్ని నిలబెట్టాలనే ప్రయత్నాలు ఎంత వరకు ఫలిస్తాయనే విషయం చూడాల్సిందే మరి?




ప్రతిభకు పట్టం



విజయవాడ, సూర్యబ్యూరో : నవ్యాంధ్రప్రదేశ్‌లో చదువుతోపాటు ఆట పాటలలో కూడా నేటి తరం ముందుండి రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రతిష్టలు తేవాలనే నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలువు మేరకు నగరంలోని సత్యనారాయణపురంలోని రవీంద్ర భారతి పబ్లిక్ స్కూల్‌లో చదువుకే కాకుండా, ఆటపాటలతోపాటు మాతృ దేవోభవ.. అందుకే అమ్మ దేవత...అమ్మే పరబ్రహ్మం...తల్లిని గౌరవిం చని వాళ్ళు లేరు...అమ్మకు పాదాభివందనం వంటి ఎన్నో సామాజిక స్పృహ కలిగే కార్యక్రమాలు ఇప్పటికీ నిర్వహించి విద్యార్దులలో సాంప్రదాయానికి పెద్ద పీటవేశారు. ఇటువంటి కార్య క్రమాల ద్వారా నేటి తరానికి విద్య, జనరల్ ఎవైర్‌నెస్, ఆటపాటలలో నైపుణ్యం తో పాటు కన్నతల్లి గొప్పతనం కూడా అందరూ తెలుసుకోని ప్రతి ఒక్కరూ గౌరవించి పూజించాలి అని పిలువు నిచ్చారు. అనంతరం జరిగిన కార్యక్ర మంలో చదువులో ప్రావీణ్యం, జనరల్ ఎవైర్‌నెస్, ఆటలు, వివిధ రకాల పోటీ లలో గెలుపొందిన విద్యార్దులకు ప్రిన్సిపాల్ మహాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ వెలంకి దీప కలసి బహుమతులు అంద జేశారు. తమ పాఠశాలలో చదువుతోపాటు ఆటలో అత్యంత ప్రతిభ చూపించి గెలుపొందిన 6వ తరగతి విద్యార్థి కొండూరి వెంకట కార్తీక్, 7వ తరగతి చదువుతున్న కొండూరి సాయి నిర్మల్‌కు వైస్ ప్రిన్సిపాల్, ఎకనమిక్ ఆఫీసర్ వెలంకి దీప షీల్డ్, మెడల్‌తోపాటు సర్టిఫికెట్‌ను అందజేసి భవిష్యత్‌లో మరిన్ని విజయాలను సాధించి పాఠశాలకు, తల్లిదండ్రు లకు, రాష్ట్రానికి, దేశానికీ కీర్తి ప్రతిష్టలు తేవాలని అభినందించారు. ఈ కార్యక్ర మంలో ఫ్లోర్ ఇన్‌ఛార్జి శ్యామల, ఉపాధ్యాయినులు శశిరేఖ, నాగలక్ష్మి, వర్ధని, అధ్యాపక బృందం, పిటి బృందం, స్పోర్ట్ బృందం, విద్యార్దులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సాగరమాల ప్రాజెక్టులపై సీఎస్ సమీక్ష



సచివాలయం, సూర్య బ్యూరో : సాగరమాల పథకంలో భాగంగా రాష్ట్రంలో చేపట్టిన, చేపట్టనున్న వివిధ ప్రాజెక్టుల పనులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) దినేష్‌కుమార్ సోమ వారం సాయంత్రం సచివాలయం 1వ బ్లాక్ మొదటి అంతస్తు సీఎస్ సమావేశ మందిరంలో సమీక్షించారు. ప్రాజెక్టుల పనులు ఏ దశలో ఉన్నాయో అధికారులు సీఎస్‌కు వివరించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ సాగరమాల ప్రాజెక్టుల పనులు నిర్ణయించిన సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. వివిధ ప్రాజెక్టులకు కేటాయించిన, కేటాయించవలసిన భూములు, డీపీఆర్(ప్రాజెక్ట్ పై సమగ్ర సమాచార నివేదిక), కృష్ణపట్నం, కాకినాడ, విశాఖ పట్నం, గంగవరం పోర్టులు, పోర్టుల నుంచి రోడ్డు, రైలు మార్గాల అను సంధాన ప్రాజెక్టులు, కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డు, కాకినాడ-రాజమండ్రి వయా సామర్లకోట రోడ్డు, భావనపాడుకు రోడ్డు, రైలు మార్గం, విజయవాడ - మచిలీపట్నం రైల్వేలైన్ తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్ర విభజన, నూతన రాజధాని అమరావతి ఏర్పడిన నేపథ్యంలో శ్రీకాకుళం, అనంతపురం ప్రాంతాలనుంచి వచ్చే ప్రయాణికుల సంఖ్య పెరిగిందని, ఈ మార్గాల్లో కొత్త రైళ్లు ప్రవేశపెట్టవలసిన అవసరం ఉందని ఏపీఐఐసీ చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య అన్నారు. ఆ మార్గాల్లో కొత్త రైళ్లు కావాలన్న ప్రతిపాదనలను రైల్వే శాఖకే పంపమని రైల్వే అధికారులను సీఎస్ ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్, పరిశ్రమల శాఖ కార్యదర్శి సాల్మన్ ఆరోఖ్యరాజ్, ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ ఎండి, ఆర్టీజీ సీఈఓ బాబు.ఏ, మత్స్యశాఖ కమిషనర్ రామ్ శంకర్ నాయక్, పోర్ట్స్ డైరెక్టర్ కోయ ప్రవీణ్, నెల్లూరు జిల్లా కలెక్టర్ రేవు ముత్యాల రాజు, గంగవరం పోర్ట్ డైరెక్టర్ డీటీ నాయక్, పర్యాటక శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా, ఎన్ హెచ్‌ఏఐ, రైల్వే, నీటిపారుదల తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం పెంచాలి

- సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరువ కావాలి
- ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలు విజయవంతం చేయాలి
- సమన్వయంతో పార్టీని బలోపేతం చేయాలి
- నరసారావుపేట పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో ఇన్‌-చార్జ్ మంత్రి శిద్ధా రాఘవరావు



వెలగపూడి, మేజర్‌న్యూస్ : పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర మంత్రి శిద్ధా రాఘవరావు పిలుపునిచ్చారు. సోమవారం నర్సరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గ తెదేపా సమన్వయ కమిటీ సమావేశంలో రోడ్లు భవనాల అతిథి గృహంలో జరిగింది. ఈ సమన్వయ కమిటీ సమావేశంలో ఇన్‌చార్జ్ మంత్రి శిద్ధా రాఘవరావు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం పెంచాలన్నారు. ప్రభుత్వం చేపట్టే ప్రతీ ఒక్క కార్యక్రమంలో ప్రజల్లో తీసుకెళ్లి వారికి అవగాహన కల్పించాలన్నారు. అదే విధంగా సంక్షేమ ఫలాలు పేద ప్రజలకు చేరువ చేసే విధంగా పార్టీ శ్రేణులు చూడాలన్నారు. ప్రతీ నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన 'దళిత తేజం-తెలుగు' దేశం విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యేలు జీవి ఆంజనేయులు, యరపతినేని శ్రీనివాసరావు, కొమ్మలపాటి శ్రీధర్, పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, నియోజకవర్గ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

ఐదు కోట్ల ఆంధ్రులకు గుండు గీయించారు


విజయవాడ, మేజర్‌న్యూస్: కేంద్ర బడ్జెట్‌పై ఇప్పటి వరకూ స్పందించని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి గొంతు మూగబోయిందా అని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత జోగి రమేష్ ప్రశ్నించారు. సోమవారం విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కి తీవ్రమైన అన్యాయం జరిగిందని మండిపడ్డారు. పార్లమెంట్ సాక్షిగా ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై రాష్ట్రం అగ్గి మీద గుగ్గిలం అవుతోందని అన్నారు. కోట్లాది మంది ప్రజల ఆవేదనను కేంద్ర పాలకులు పెడచెవిన పెట్టారని విచారం వ్యక్తం చేశారు. ఏం సాధించారని టిడిపి ఎంపీలు ర్యాలీ నిర్వహించారని ప్రశ్నించారు. టీడీపీ ఎంపీలకు బుద్ధి, జ్ఞానం ఉందా అంటూ తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు. "రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతున్నా చంద్రబాబు ఎందుకు మాట్లాడటం లేదని కోట్లాది మంది ఆంధ్రులు అడుగు తున్నారు. మీరెందుకు భయపడుతున్నారు చంద్రబాబూ. మీరు బయటకు వచ్చి మాట్లా డాలి. 12 రోజులుగా ఎక్కడ దాక్కున్నావు. మోదీ అంటే ఎందుకు బాబుకు భయమని ప్రజలు అడుగుతున్నారు. ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. చంద్రబాబు నటనకు ఆస్కార్ అవార్డు ఇవ్వాలని అంటున్నారు. బీజేపీ - టీడీపీలు ఏపీ ప్రజలకు గుండు గీశాయి. రెండు కలసి కట్టుగా ఏపిని నట్టేట ముంచాయని విమర్శ చేశారు.

రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని గుత్తిలో న్యాయవాదుల దీక్ష

అనంతపురం, సూర్యబ్యూరో: రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌పై న్యాయవాదులు తమ ఆందోళనను ఉధృతం చేస్తున్నారు. కడప జిల్లాలో మొదలైన ఆందోళనలు రాయలసీయ వ్యాప్తంగా విస్తరిస్తున్నాయి. రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలంటూ గుత్తిలో సోమవారం న్యాయవాదుల రిలే దీక్ష చేపట్టారు. వీరికి విద్యార్థి, యువజన సంఘాలు మద్దతు తెలిపాయి. ఇటీవల రాజధాని అమరావతిలో ఐదుగురు సభ్యుల హైకోర్టు జడ్జీల బృందం పర్యటించిన విషయం తెలిసిందే. రాజధాని అమరావతిలో హైకోర్టు భవనం నిర్మించటానికి ప్రభుత్వం స్థలం కేటాయించింది. తుళ్లూరు నేలపాడు మధ్యలో ఈ హైకోర్టు భవనం ఏర్పాటు కావటానికి ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ కాంప్లెక్స్ నిర్మాణంలో భాగంగా హైకోర్టు భవనాన్ని కూడా నిర్మాణం జరుగుతుంది. దీనికిముందు ఏపీ హైకోర్టును తాత్కాలికంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలోనే ఆచార్య నాగార్జున యూని వర్సిటీ లో భవనాలను జడ్జీల బృందం పరిశీలించింది. జడ్జీల పర్యటనను వ్యతిరేకంగా రాయలసీమకు చెందిన న్యాయవాదులు సీఎం చంద్రబాబు నివాసం ఎదుట ఆందోళన నిర్వహించారు.

కష్టాలతో వచ్చి సీఎంకు మొర

అమరావతి, సూర్యబ్యూరో: తమ కష్టాలు తీర్చి ఆదుకోవాలని, సాయపడాలని కోరుతూ వచ్చిన సందర్శకులకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెద్దమనసుతో సాయం చేశారు. మంగళవారం తనను కలవడానికి వచ్చిన సందర్శకులతో ముఖ్యమంత్రి వారి సమస్యలను సావధానంగా విని కొన్నిం టిని అక్కడికక్కడే పరిష్కరించారు. గుంటూరు జిల్లా అంగలకుదురు మండలం దెందుపాలెంలో నుంచి వచ్చిన వట్టిప్రోలు ప్రసన్న కుమార్ తలసీమియాతో బాధ పడుతున్నాడు. రక్తంలో కణాల సంఖ్య అస్తవ్యస్తంగా ఉంటూ ప్రమాదవుటంచున ఉన్నాడు. అతడి పరిస్థితికి చలించిన ముఖ్యమంత్రి రూ 3 లక్షలు మంజూరు చేశారు. చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం కోటాల గ్రామ వాస్తవ్యుడు సుబ్బరామానాయుడు దీర్ఘకాలం అనారోగ్యంతో వేలూరు సీఎంసీ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుని ఆర్ధికంగా దెబ్బతిన్నాడు. అతడి అభ్యర్ధన మేరకు ముఖ్యమంత్రి రూ. 5 లక్షలు మంజూరు చేస్తూ ఆదేశాలిచ్చారు. చిత్తూరు జిల్లా చంద్రగిరి మండలం కల్‌రోడ్ పల్లో గ్రామం నుంచి వచ్చిన ఎన్ గంగులు కాయకష్టం చేసే వ్యవసాయ కూలి. అనారోగ్యంతో తనకు ఉన్న లక్షరూపాయల ఆస్తి కరిగి పోయింది. గుంటూరు జిల్లా చుండూరు మండలం వలివేరు గ్రామానికి చెందిన 17 ఏళ్ల మాదల వంశీకి కాక్లియర్ ఇప్లాంటేషన్ కోసం రూ. 5, లక్షల,18 వేల 100 రూపాయలు మంజూరు చేశారు. సీఎం ఆగ్రహంగా స్పందిస్తూ భూమి రికార్డులను తారుమారుచేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె పొలం ఆమెకు అప్పగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలిని చంద్రబాబు ఆదేశించారు. గన్నవరం విమానాశ్రయ విస్తరణకు భూ సమీకరణలో భూములు ఇచ్చిన రైతులు ముఖ్యమంత్రిని చంద్రబాబును కలిశారు. అయితే నష్టపరి హారం లో సాల్వేజీ, తరుగుదల కింద 52% తగ్గించి నిధులు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.



రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

- నీరు ప్రగతి కింద జల సంరక్షణ రెండో దశ కార్యక్రమం
- జలసంరక్షణ కింద చెక్‌డ్యామ్‌లు, ఊటకుంటలు
- 10వేల కోట్లతో రాజధానికి త్రాగునీటి సమస్యకు ప్రణాళికలు
- రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

అమరావతి, సూర్య బ్యూరో : ప్రజలందరూ నీరుప్రగతి కింద చేపట్టే జల సంరక్షణ రెండో దశ ఉద్యమంలో భాగస్వామ్యులై రాష్ట్రంలో భూగర్భజలాలు పెరిగే విధంగా కృషి చేసి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. సోమవారం అమరావతి రాజధాని సమీపంలోని వెంకటాయపాలెం గ్రామంలో నీరుప్రగతి కింద చేపట్టే జల సంరక్షణ రెండో దశ ప్రారంభ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జేసీబీ యంత్రానికి పూజలు చేసిన అనంతరం లాంఛనంగా ప్రారంభించారు. తొలుత జలసంరక్షణ పై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రాన్ని కరవు రహితంగా తీర్చిదిద్ది అందరికీ నీటి భద్రత కల్పించాలనే లక్ష్యంతో 2015 ఫిబ్రవరి 19న నీరు చెట్టు అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. గత సంవత్సరం నీరు ప్రగతి పేరిట దీనిని ఒక ఉద్యమస్ఫూర్తితో 90 రోజుల పాటు జలసంరక్షణ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఫిబ్రవరి 12వ తేదీ నుండి జూన్ 7వ తేదీ వరకు 116 రోజుల జలసంరక్షణ రెండవ దశ కార్యక్రమాన్ని చేపట్టాలనే ఉద్దేశ్యంతో రాష్ట్రంలో అన్ని జిల్లాలో, మండలాల్లో, గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. గత మూడేళ్లలో నీరు చెట్టు, నీరు ప్రగతి కార్యక్రమాల క్రింద అనేక చెరువులను బాగుచేసుకున్నామని, గొలుసుకట్టు చెరువులను అభివృద్ధి చేసుకున్నామని, అనేక చెక్‌డ్యామ్‌లు, పంట సంజీవనిలు జలసంరక్షణ కింద రాష్ట్రంలో పెద్దయెత్తున చేపట్టామన్నారు. ఈ సంవత్సరం జలసంరక్షణ కింద అనేక కార్యక్రమాలను పెద్దయెత్తున చేపట్టాలని ప్రణాళికలు రూపొందించామన్నారు. రాష్ట్రంలో గత వేసవిలోని వాటర్ లెవల్ 3 మీటర్లు కంటే తక్కువ లోతులో వున్న మండలాలు 52, 3 నుండి 8 మీటర్లు లోతులో వున్న మండలాలు 207, 8 మీటర్లు కంటే ఎక్కువ లోతులో వున్న మండలాలు 411 గా ఉన్నాయన్నారు. 8మీ. కంటే ఎక్కువ లోతు వున్న 411 మండలాలను తిరిగి వివిధ సబ్‌కేటగిరీలుగా చేయగా అందులో 8 నుండి 12 మీ. లోతులో వున్న మండలాలు 148, 12 నుండి 16 మీ లోతులో వున్న మండలాలు 83, 16 నుండి 20 మీ.లోతులో వున్న మండలాలు 51, 20 మీ. కంటే ఎక్కువ లోతులో వున్న మండలాలు 129 వున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. జల సంరక్షణ కార్యక్రమంలో జలవనరులశాఖ తో పాటు గ్రామీణాభివృద్ధి శాఖ, అటవీ శాఖ, వ్యవసాయ ఉద్యానవన శాఖలు, మత్స్య శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖ, విద్యాశాఖలు పాలుపంచుకుంటున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ స్పేస్ అప్లికేషన్ సెంటర్ సహాయంలో ఉపగ్రహ ఛాయాచిత్రాలను ఉపయోగించి, ప్రతి జిల్లాలో ఎక్కడెక్కడ చెక్‌డ్యామ్‌లు కట్టవచ్చో మ్యాప్స్ తయారుచేసి అన్ని జిల్లాలకు ఇచ్చామని, ఈ రోజు గుంటూరు జిల్లా కలెక్టర్‌కు అందించటం జరిగిందన్నారు. జలసంరక్షణ కింద చెక్‌డ్యామ్‌లు, ఊటకుంటలు వంటి జలసంరక్షణ స్ట్రక్చర్స్ నిర్మించాలన్నారు. ఈ 116 రోజుల జలసంరక్షణ ఉద్యమం రెండవదశలో భాగంగా వెంకటపాలెం గ్రామంలో పాలవాగులోకి వచ్చి కలిసే మైనర్ డ్రెయిన్ బాగుచేసుకునే కార్యక్రమంతో శ్రీకారం చుట్టామ న్నారు. గత మూడేళ్లలో జలసంరక్షణ పనుల కోసం (వివిధ శాఖల ద్వారా సుమారు రూ.10,867 కోట్లు ఖర్చు చేశామన్నారు. గత మూడేళ్లలో చెరువుల్లో 68.43 కోట్ల ఘనపు మీటర్ల పూడికతీశామని, 500 లక్షల ఘనపు మీటర్ల చెరువుకట్టల పటిష్టీకరణ చేశామన్నారు. అలుగు మరియు తూములకు 17.76 లక్షల ఘనపు మీటర్లు కాంక్రీటు పనులు చేశామన్నారు. 11,078 షట్టర్లకు మరమ్మత్తులు మరియు క్రొత్తవి ఏర్పాటు చేశామన్నారు. 1048 గొలుసుకట్టు చెరువులను అభివృద్ధి చేశామన్నారు. 62,880 చెక్‌డ్యామ్‌లు నిర్మించామన్నారు. 6,42,706 పంటసంజీవని లను, 16,865 ఊటకుంటలు, 5,94,037 ఇతర జలసంరక్షణ నిర్మాణాలు, 62,694 నేలల్లో తేమ పెంపు పనులు, 12,479 కందకాలు, 1,129 రాక్‌ఫిల్ డ్యామ్స్, 3,925 కి.మీ ఎలి ఫెంట్ ప్రూఫ్ ట్రెంచ్‌లు, వాటర్ అబ్జార్‌ప్షన్ ట్రెంచ్‌లు, 406 కి.మీ. పెరిఫరల్ ట్రెంచ్‌లు, 2,26,160 ఎకరాల్లో చెట్లు పంచామన్నారు.

ప్రకాశం బ్యారేజి 3.07 టీఎంసీల నీటి సామర్థ్యంతో దిగ్విజయంగా 60 సంవత్సరాలు పూర్తిచేసుకుని నగరంలో 10 లక్షల మంది ప్రజలకు తాగునీటిని అందిస్తూ, 13 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తుందన్నారు. అమరావతి రాజధాని భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రకాశం బ్యారేజి ఎగువన వైకుంతవురం వద్ద ఒక బ్యారేజి నిర్మాణాన్ని, దిగువున మరో బ్యారేజి నిర్మాణానికి శ్రీకారం చూడుతున్నామన్నారు. ఈ నిర్మాణాల వల్ల భవిష్యత్తులో 50 లక్షల జనాభాకు త్రాగు నీటి సౌకర్యానికి ఇబ్బంది లేకుండా అందించేవీలు ఏర్పడుతుందన్నారు. అమరావతి రాజధాని నగరంలో ఉన్న కొండవీటి వాగు, పాలవాగులను నేవిగేషన్‌కు ఉపయోగిస్తూ బ్లూ, గ్రీన్ సిటీగా మార్చుతామన్నారు. పట్టిసీమ ద్వారా మొదటి సంవత్సరం 6 టి.ఎం.సీలు, రెండవ సంవత్సరం 55 టి.ఎం.సీలు, మూడవ సంవత్సరం 100 టి.ఎం.సీలు తీసుకువచ్చి కృష్ణాడెల్టాను సుభిక్షం చేశామన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం ద్వారా ప్రకాశం బ్యారేజి వెనుక నుంచి నాగార్జునసాగర్ కింద సాగర్ కూడికాలువ ఆయకట్టుకు నీటిని అందించే వీలు ఏర్పడుతుందన్నారు.

వైకుంతవురం బ్యారేజికి 3 వేల కోట్ల రూపాయలు, నాగార్జునసాగర్ ఆయకట్టు స్థిరీకరణకు 6 వేల కోట్ల రూపాయలు మొత్తం 10 వేల కోట్ల రూపాయల ఖర్చుతో రాజధాని కి కావలసిన త్రాగునీటి సమస్యకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 1.15 కోట్ల ఆయకట్టు సాగు చేస్తున్నామని త్వరలో దీనిని 2 కోట్ల ఆయుకట్టుకు తీసుకువెళ్లతామన్నారు. ఈ 116 రోజుల జల సంరక్షణ ఉద్యమంలో సాగునీటి సంఘాలు, మహిళా సంఘాలు, విద్యార్థులు, రైతులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్ని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి రాష్ట్రాన్ని కరువురహితంగా తీర్చిదిద్దుదామన్నారు. జల వనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేతుల మీదుగా రెండవ దశ జల సంరక్షణ పథకం ప్రారంభింపజేయడం ఆనందంగా ఉంద న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ఉద్యమ స్ఫూర్తితో చేపడుతున్నా మని, ఇందులో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని కోరుతున్నామన్నారు. ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతిని నిర్మించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుచూపుతో ఒక లక్ష్యంతో ముందుకు వెళ్లుతున్నారన్నారు.

నీరుప్రగతి కింద ఫిబ్రవరి 12 నుంచి జూన్ 7 వరకు జలసంరక్షణ రెండవ దశ కార్య క్రమంలో పడిన వర్షాన్ని పడిన విధంగానే భూమిలో ఇంకించే విధంగా చెరువుల్లో, కాల్వల్లో జలసంరక్షణ క్రింద పనులు చేపడుతున్నామన్నారు. నీరుప్రగతి క్రింద గత మూడు సంవత్సరాలుగా రూ.10,867 కోట్లు ఖర్చు చేస్తే అందులో ఐ.టీ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ శాఖ నుంచే కన్వర్‌జెన్స్ నిధుల కింద ఉపాధి హామీ నిధులు రూ. 860 కోట్లు ఖర్చు చేశార న్నారు. నీరుప్రగతి క్రింద చేపడుతున్న జలసంరక్షణ రెండవ దశ కార్యక్రమ ప్రారంభోత్సవంలో మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబు, పార్ల మెంట్ సభ్యులు గల్లా జయదేవ్, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, ఇరిగేషన్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, సి.ఆర్.డి.ఎ కమీషనర్ చెరుకూరి శ్రీధర్, జిల్లా కలెక్టర్ కోన శశిధర్, ఈ.ఎన్.సి వెంకటేశ్వరరావు, వెంకటపాలెం సర్పంచ్ చేకూర్తి రవి, రైతులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



హత్య కేసులో ఏడుగురికి యావజ్జీవ శిక్ష



ఏలూరు, క్రైం: ఆధిపత్య పోరు, గ్రూపు తగాదాలలో ఒక వ్యక్తిని హత మార్చిన కేసులో ఏడుగురు నిందితుల కు ఏవజ్జీవ ఖైదుతో పాటుప వెయ్యి రూపాయల జరీమానా విధిస్తూ న్యాయ మూర్తి తీర్పునిచ్చారు. సోమవారం ఈ విషయాలను టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి కె. ఈశ్వరరావు వెల్లడించారు. డి.ఎస్.పి కథనం ప్రకారం 2008వ సంవత్సరంలో చిట్టి సతీష్ అనే వ్యక్తిని గంగాధర్ అనే రౌడీ షీటర్ అనుచరులు ఈ హత్య చేసారన్నారు. 2012వ సంవత్సరంలో ఈ హత్యకు సూత్రధారి అయిన బి. గంగాధర్‌ను, అతని ప్రత్యర్థి వర్గానికి చెందిన 13 మంది హత్య చేసినట్లు అప్పటి రెండవ పట్టణ ఎస్.ఐ కొండలరావు కేసు నమోదు చేయగా సి.ఐ నున్నా మురళీ కృష్ణ కేసును దర్యాప్తు చేసారు. హత్య కేసులో నిందితులుగా ఉన్న 11 మందిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. అప్పటి నుండి కేసు విచారణ జరుగుతుండగా నిందితుల్లో ముగ్గురు చనిపోయారని, మిగిలిన 8 మందిపై విచారణ జరిగిందని డిఎస్‌పి తెలిపారు. ఈ క్రమంలో 2వ ముద్దాయిగా ఉన్న కంచి నరేంద్ర కృష్ణ అలియాస్ పెద్ద కృష్ణ 2016వ సంవత్సరంలో హత్యకు గురయ్యాడు. మిగిలిన 7గురు నిందితులపై విచారణ జరిగింది. సోమవారంతో ఈ కేసు విచారణ పూర్తి కావడంతో నిందితులుగా ఉన్న కొత్తపేట చేపల తూము సెంటర్‌కు చెందిన కంచు మురళీ కృష్ణ అలియాస్ చిన్ని కృష్ణ, కెంగం గణేష్; మీసాల దుర్గారావు, చిట్టి ప్రసాద్, చోడిదిబ్బకు చెందిన మహ్మద్ జాని బాషా, చింతచెట్టు రోడ్డుకు చెందిన కత్తిర సతీష్, పవర్ పేటకు చెందిన అమర్ సింగ్ చంద్ర సతీష్ రామమోహనరావు అలియాస్ పూరిని దోషాలుగా తేల్చిన న్యాయమూర్తి ఏడు గురికి ఏవజ్జీవ శిక్ష, వెయ్యి రూపాయలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. వీరిని సాయంత్రం సబ్ జైలుకు తరలించినట్లు డి.ఎస్.పి వెల్లడించారు. ఏలూరులో రౌడీయిజంపై ఉక్కు పాదం మోపేందుకు చర్యలు తీసుకుంటు న్నామని డి.ఎస్.పి కె. ఈశ్వరరావు వెల్లడించారు. నగరంలో ఉన్న 18 మంది రౌడీ షాటర్లకు ఇప్పటి వరకు జీవిత ఖైదు శిక లు పడ్డాయని అన్నారు. సమా వేశంలో సి.ఐ జి.మధుబాబు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



పోలవరం, మేజర్‌న్యూస్ :పట్టిసం వద్ద అఖండ గోదావరి మధ్యలోఉన్న భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజుల మహా శివరాత్రి ఉత్సవాలకు జిల్లా అధికార యంత్రాంగం సర్వం సిద్దంచేసింది. ప్రతి సంవ త్సరం జరిగే రేవులో కాకుండా ప్రక్క రేవుకు మార్చడంతో గత 15 రోజులుగా ఆర్డీవో కె. మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో తహశీల్దార్, సిహెచ్. రవికుమార్ కొత్త రేవులు ఏర్పాట్లు పూర్తి చేసారు. తీర్ధం రేవులో భక్తులు లాంచీలు ఎక్కేందుకు మూడు ప్లాట్‌ఫారంలు, ఆలయం వైపు మరో మూడు ప్లాట్ పారంలు నిర్మించారు. 14 లాంచీలు సిద్ధం చేసారు. భక్తుల క్యూలైన్ల నిర్మాణం, విఐపిలకు 300 స్పెషల్ దర్శనం, 50,20, ఉచిత దర్శనాలకు క్యూలైన్లు నిర్మించినట్లు ఈవో రమణ మూర్తి తెలిపారు.

నాణేల ప్రదర్శన అభినందనీయం



విజయవాడ, సూర్య బ్యూరో : పురాతన నాణెములు ప్రదర్శించడం వల్ల భారతదేశం ఆవశ్యకతను విద్యార్థులు తెలుసుకుంటారని 2వ పట్టణ సీఐ జె.మురళీకృష్ణ అన్నారు. వన్‌టౌన్ లోని రాకేష్ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులు నాణెములు, కరెన్సీ ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన సిఐ జె.మురళీకృష్ణ, అమరావతి మెట్రో జనరల్ మేనేజర్ యు.జె.ఎం.రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ స్కూల్ డైరెక్టర్ ఎన్.వి.రావు సౌజన్యంతో 175 దేశాల కరెన్సీని ప్రదర్శనలో వుంచడం గొప్ప విషయమని, ఇందులో షేర్షా, మొఘలాయిలు, బ్రిటీష్ కాలం నాటి నాణెములు ప్రదర్శించడం ద్వారా భావిభారత పౌరులకు మనదేశం యొక్క ఔన్నత్యం, ఆవశ్యకత తెలుస్తుందని ఆయన అన్నారు. అనంతరం అమరావతి మెట్రో మేనేజర్ ఎం.రావు మాట్లా డుతూ విద్యార్థులతో ఇంతటి మంచి కార్యక్రమం నిర్వహించినందుకు రాకేష్ పబ్లిక్ స్కూల్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌కె.పట్నాయక్, నమ్మి అప్పారావు, ఉమా మహేశ్వరరావు, నవ్యాంధ్ర జర్నలిస్ట్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూకంపాల విశ్లేషణపై వర్క్‌షాప్

విజయవాడ, సూర్య బ్యూరో : భూగర్భ ప్రకంపనల తీవ్రతను, సంభవించు సమయం, ప్రదేశాలను మరింత శాస్త్రీయపరంగా విశ్లేషించుటకు జి.పి.యస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంతో ఉపయోగపడుతుందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం భూగర్భశాస్త్ర విభాగం హెచ్.వో.డి డాక్టర్ రత్నాకర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నివారణ సంస్థ సోమవారం రాష్ట్రంలో భూకంపాల విశ్లేషణపై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో డా.రత్నాకర్ మాట్లాడుతూ భూకంప తీవ్రతను తెలుసుకోవడానికి గతంలో రిక్టర్ స్కేల్‌ను ఉపయోగించేవారన్నారు. ప్రస్తుతం భూకంప తీవ్రత పరిణామం సంభవించిన సమయం, ప్రాంతం మొదలైన విషయాలను సమగ్రంగా సిస్మోగ్రాఫ్ ద్వారా తెలుసుకోగలుగుతున్నామన్నారు. భూకంప పరిజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినప్పటికి భూకంపాలు రాబోయే సమయానికి ముందుగానే అంచనా వేసే పరిజ్ఞానం ఇప్పటివరకు మనకు అందుబాటుల్లోకి రాలేదన్నారు. కేవలం సిస్మోగ్రాఫ్ ద్వారా భూకంప తీవ్రత ఎంత తక్కువగా ఉన్నా తెలుసుకుని మళ్ళీ అదే ప్రదేశంలో భూమి అంతర్భాగంలో గల పొరల కదలిక వలన తిరిగి భూకంపం సంభవించవచ్చుననే మాత్రం అంచనా వేయగలుగుతామని, తద్వారా నష్టాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోగలుగుతున్నామన్నారు. భూకంపాలు విశ్లేషణ మరింత పురోగతి సాధించే వరకు జి.పి.యస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతుందని ఒక అంచనాకు వచ్చినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని 7 జిల్లాలలో జిపియస్ రిసీవర్లు అమర్చుకొనుటకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం జరిగిందన్నారు. వీటిలో గుంటూరు, బాపట్ల, మచిలీపట్నం, నర్సాపురం, కాకినాడ, ఒంగోలు, నెల్లూరు తదితర ప్రాంతాలలో జిపియస్ స్టేషన్‌లను రిసీవర్లను అమర్చితే భూకంపాల గురించి మరింత ఆధ్యయనం చేయుటకు దోహదపడుతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 9 భూకంప విశ్లేషణా కేంద్రాలు పని చేస్తున్నాయని, వాటిలో శ్రీకాకుళం, అనంతవురం, కర్నూలు జిల్లాలలో జవహర్ నవోదయ పాఠశాలలోను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీని వల్ల పాఠశాల విద్యార్థులు కూడా జాతీయ విపత్తులు మరియు నివారణ చర్యలపై అవగాహన కలిగించే అవకాశం ఉంటుందన్నారు. మిగిలిన 6 కేంద్రాలకు సంబంధించి ఆయా జిల్లాలలోని ప్రభుత్వ కార్యాలయాలలో విశ్లేషణ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవ్యాంధ్ర రాజధాని అమరావతి మరియు పోల వరం వంటి సాగునీటి ప్రాజెక్టుల వద్ద భూకంప విశ్లేషణ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రభు త్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. భవిష్యత్తులో నిర్మించే బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలను భూకంపాలను తట్టుకునే విధంగా నిర్మించేలా ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంద న్నారు. జాతీయ విపత్తులు, నివారణ చర్యలు, ముందస్తు జాగ్రత్తలు వంటి విషయాలపై ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటే విద్యార్థులకు అవగాహన కలిగి వారి తల్లిదండ్రులకు వీటి గురించి వివరించగలిగితే విపత్తుల నుండి కొంత మేరకు ప్రాణ, ఆస్తి నష్టాలను ఆరికట్టగలిగే అవకాశం ఉంటుందన్నారు. వర్క్‌షాప్ కార్యక్రమంలో జాతీయ విపత్తుల నివారణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డెరెక్టర్ కె. శివశంకర్‌రావు, నేషనల్ జియోఫిజికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్రధాన శాస్త్రవేత్త డా. శ్రీనగేష్, కె.ఎల్ యూనివర్శిటి ప్రొఫెసర్లు కె.ఎస్ రమేష్, డా.ఆర్ రేవతి, డా.కోటేశ్వరరావు, ఇన్‌కోసీస్ డి.ఎం.జీ హెడ్ ఇ.పట్టాభిరామారావు ు పాల్గొన్నారు.



దర్శి అభివృద్ధి ఆదర్శనీయం

- 30 ఏళ్ల అభివృద్ధిని, మూడేళ్ళ పాలనలో చేసి చూపించా
- రూ.1850 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు
- రహదారులు, ఎత్తిపోతల పథకాలకు అధిక ప్రాధాన్యత
- చంద్రన్న భీమాతో పేదల బతుకు భరోసా
- చంద్రబాబు సుపరిపాలన చూసే పార్టీలోకి చేరికలు
- దర్శి, తాళ్లూరు మండల పరిధిలో 700 మంది వైసిపి కార్యకర్తలు టీడీపీ తీర్థం
- పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన రాష్ట్ర మంత్రి శిద్ధా రాఘవరావు



ఒంగోలు సూర్యప్రతినిధి : అభివృద్ధిలో దర్శి నియోజకవర్గ రూపు రేఖలు మార్చామని రాష్ట్ర అటవీ శాఖామంత్రి శిద్ధా రాఘవరావు అన్నారు. సోమవారం స్థానిక అటవీ శాఖామంత్రి నివాసంలో ఆయన సమక్షంలో దర్శి తాళ్ళూరు మండలాలకు చెందిన 700 మంది వైకాపా కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి శిద్ధా రాఘవరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు పెద్ద పీట వేయడం జరిగిందన్నారు. రాష్ట్రం విడిపోయి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి ఇచ్చిన మాటకు కట్టుబడి అభివృద్ధి సంక్షేమ కార్యక్ర మాలు అమలు చేస్తున్నామన్నారు. దర్శి నియోజకవర్గ పరిధిలోని గత 40 సంవత్సరాలుగా జరిగిన అభివృద్ధిని మూడున్నర సంవత్సరాల్లో రూ. 1850 కోట్ల రూపా యల అభివృద్ధి పనులు పూర్తి చేశా మన్నారు. దర్శి నియోజకవర్గంలో రూ 2 కోట్లతో పార్క్ అభివృద్ధి చేశామన్నారు. దర్శిలో సింగల్ లైన్ రోడ్స్‌ను డబల్ రోడ్డుగా తీర్చి దిద్దామన్నారు.

దర్శిలో జీ ప్లస్ 2 విధానంలో 1050 మంది ఒక్కే చోట నివాసం ఉండే విధంగా గృహాలు ఏర్పాటు చేస్తామన్నారు. ముండ్ల మూరు మండలంలో 125 కోట్లతో ఎత్తి పోతల పథకాలను ఏర్పాటు చేయడం జరిగిం దన్నారు. దీని ద్వారా 15 వేల ఎకరాల భూము లు సాగులోకి వస్తాయని ఆయనన్నారు. తాళ్ళూరు మండలంలో మోగిలిగుండా జలాశయం పూర్తి చేసి 14 గ్రామాలకు త్రాగు నీటి అందిస్తామని అయన న్నారు. చంద్రన్న భీమా పథకం ద్వారా మరణించిన వారి కుటుంబాలకు రూ. 2 లక్షలు ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి మండల పార్టీ అధ్యక్షులు నారపుశెట్టి పిచ్చ య్య, శాగం కొండా రెడ్డి, దర్శి పట్టణ అధ్యక్షులు దారం సుబ్బారావు, మానం రమేష్‌బాబు, బడే, గణేష్ హనుమంతురావు, సమర, మాగం సుబ్బారావు, విద్యా సాగర్, మారెడ్డి శ్రీనివాసరెడ్డి, మిల్లర్ బుజ్జి, సుబ్బారెడ్డి, దర్శి సర్పంచ్ జీ చిన్న గురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

గౌతమ్ హైస్కూల్‌లో ఇగ్లీష్ డే వేడుకలు



విజయవాడ, సూర్య బ్యూరో : నగరంలోని శ్రీ గౌతమ్ హైస్కూల్‌లో ఇగ్లీష్ డే వేడుకలు నిర్వహించడం అభినందనీయమని 2వ పట్టణ సిఐ జె.మురళీకృష్ణ అన్నారు. శ్రీ గౌతమ్ స్మార్ట్ క్యాంపస్‌లో జరిగిన ఇగ్లీష్ డే వేడుకలకు ఆయన ముఖ్యఅతిథి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన జీవన విధానంలో ఇంగ్లీష్ తప్పనిసరి అయ్యిందని, ఇంగ్లీష్ రాని వారు సమాజంలో జీవించడం కష్టంగా మారిందన్నారు. అటువంటి ఇంగ్లీష్ ఇంతటి ప్రాధాన్యతనిస్తున్న స్కూల్ డైరెక్టర్, ప్రిన్సిపల్ నల్లాన సూర్యారావును ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటుచేసిన ఇగ్లీష్ ఎగ్జిబిషన్‌ను ఆయన తిలకించారు. ఈ సందర్భంగా వైసీపీ నగర అధ్యక్షుడు వెలంపల్లి శ్రీనివాస్ హాజరై విద్యార్థులు ప్రదర్శించిన స్క్రిప్ట్‌ను, వివిధ రకాలైన బొమ్మలను తిలకించి వారిని అభినందించారు. ఈ ఇగ్లీస్ డే వేడుకలకు అంకురార్పణ చేసిన యాజమాన్యానికి ప్రత్యేకాభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 2వ పట్టణ ఎస్ఐ మూర్తి, అడ్వకేట్ పిళ్ళా శ్రీనివాసరావు, స్కూల్ ఇన్‌ఛార్జులు తులసీ, సునీత, సులోచన, లలితా, శ్రీరామ్‌లు పాల్గొన్నారు.

శివసదన్ కాటేజీ నిర్మాణానికి పచ్చజెండా



అన్నవరం (తూర్పుగోదావరిజిల్లా), మేజర్‌న్యూస్ : తూర్పుగోదావరిజిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం సత్యనారాయణ స్వామివారి దేవస్థానం సత్యగిరి కొండపై నిర్మించనున్న శివసదన్ కాటేజీ నిర్మాణానికి దేవాదాయశాఖ కమిషనర్ వైవి అనురాధ పచ్చజెండా ఊపారు. గదుల నిర్మాణానికి సంబంధించి పలు వివాదాలు తలెత్తిన నేపథ్యంలో వాటిపై పూర్తిపరిశీలన చేసిన దేవాదాయశాఖ చివరికి నిర్మాణాలకు సంబంధించి పూర్తి అనుమతులు కల్పించింది. ఇందుకు సంబంధించిన వివరాలను దేవాదాయశాఖ కమిషనర్ అనురాధ సోమవారం ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం సత్యదేవుని సన్నిధికి విచ్చేసి విలేఖర్ల సమావేశంలో వెల్లడించారు. అన్నవరం ఆలయానికి భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని వసతి సౌకర్యాలను పూర్తిస్థాయిలో కల్పించాలనే ఉద్దేశ్యంతో సత్రం గదుల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా రానున్న రోజుల్లో ప్రసాద్ పథకం ద్వారా దేవస్థానంలో సుమారు రూ.40కోట్లతో అభివృద్ధిపనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇదిలా ఉండగా ఇటీవల పిఠాపురం శ్రీపాద వల్లభ సంస్థానంలో జరిగిన అవినీతిపై త్వరలో పూర్తిస్థాయిలో విచారణ జరిపేందుకు ఆర్‌జేసీ క్యాడర్ కలిగిన అధికారిని విచారణాధికారిగా నియమించామని నివేదిక అందిన తరువాత దానిని పరిశీలించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే అన్నవరం ఈవో జితేంద్రకు పిఠాపురం శ్రీ కుక్కుటేశ్వం స్వామి వారి దేవస్థానం ఈవో చందక దారబాబుకు మధ్య జరిగిన వివాదానికి సంబంధించి కూడా ఆర్‌జేసీ విచారణ నిర్వహిస్తారన్నారు. అలాగే శ్రీసంస్థానానికి డిప్యూటేషన్‌పై జితేంద్రను తమ అనుమతితోనే పంపించడం జరిగిందన్నారు. దేవాదాయశాఖ ఎవరి సొంత పెత్తనానికి మడుగులు వేయదని స్థాయిని బట్టి ఉద్యోగులు విధులు నిర్వర్తించాలని కమిషనర్ పరోక్షంగా మండిపడ్డారు. ఆమె వెంట ఈవో జితేంద్రతోపాటు అధికారులు ఉన్నారు.

ఏపీ డిమాండ్లపై గళమెత్తిన కెనడా ప్రవాసాంధ్రులు



అమరావతి, సూర్య బ్యూరో : ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పేర్కొన్న హామీ లను కేంద్రం నిలబెట్టుకోవాలని, బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు సముచిత కేటాయింపులు అందించాలని కోరుతూ కెనడాలోని టొరొంటో నగరం లోని ఇండ యన్ కాన్సులేట్ వద్ద ప్రవాసాం ధ్రులు తమ నిరసన వ్యక్తం చేశారు. ఏపీ డిమాండ్స్ జస్టిస్‌తో ఉన్న ప్లకార్డులు పట్టుకుని ఆంధ్ర ప్రవాసులు తమ ఆవేదనని వ్యక్తం చేశారు. నాలుగు సంవత్సరాల క్రితం జరిగిన ఆంధ్రప్రదేశ్ విభజనలో ఇచ్చిన హామీలను, మిత్ర పక్షంలో ఉన్నా ఏమాత్రం గౌరవించకుండా కేంద్రం విస్మరించడంపై ఆంధ్రా ప్రజలు నిరసన గళమెత్తారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులను కూడా లెక్క చేయకుండా, స్వదేశంలో ఉన్న తమ రాష్ట్ర సోదరుల ప్రయోజనాల కోసం వీరం తా ఏకమై ధర్నా నిర్వహించారు. తెలుగు కెనడా అసోసియేషన్ ప్రెసిడెంట్ అనిల్ లింగమేనేని కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కి చాలా అన్యాయం చేసిందని, అంతా కోపంగా ఉన్నారని, బడ్జెట్‌లో ఏపీకి ఏ మాత్రం న్యాయం చేయకపోవడం చాలా బాధవేసిందని చెప్పారు. రాంబాబు కల్లూరి, అనీల్ లింగమనేని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హర్ష పరుచూరి, అనిల్ లింగమనేని, శ్యాం కందాళ, బాలాజీ పులివర్తి, సురేష్ పెనమనేని, చంద్ర ముప్పలనేని, భార్గవ్ రావిపాటి, అశోక్, అపర్ణ తాడేపల్లి, భార్గవ తాడేపల్లి, బాలాజీ పులివాటి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తుంటే, కేంద్రం తమవంతు సహాయం చెయ్యకపోవడాన్ని, నిర్లిప్తంగా ఉండడాన్ని ఖండించారు.



నేడు మహా శివరాత్రి

శివరాత్రి వైదిక కాలం నాటి పండుగ. ఏడాదిలో వచ్చే శివరాత్రులు మొత్తం అయిదు. నిత్య శివరాత్రి, పక్ష శివరాత్రి, మాసశివరాత్రి, మహాశివరాత్రి, యోగశివరాత్రి. వీటిలో పరమేశ్వరుడి పర్వదినం మహాశివరాత్రి. మార్గశిరమాసంలో బహుళ చతుర్థి, ఆర్ద్ర నక్షత్రం రోజున శివుడు లింగోద్భవం జరిగింది. శివునికి అతి ఇష్టమైన తిథి అది. అందుకే ఈరోజున శివుడ్ని లింగాత్మకంగా ఆరాధించిన వారెవరైనా సరై పురుషోత్తముడు అవుతాడని పురాణాల మాట. వేదాలు ఇతిహాస పురాణాలలో ముఖ్యమైనవి. ఋగ్వేదం చాలా గొప్పది. ఇందులో ఉన్నటువంటి రుద్రం ఇంకా గొప్పది. పంచాక్షరీలోని శివ అనే రెండక్షరాలు మరీ గొప్పవి. శివ అంటే మంగళమని అర్థం.'పరమ మంగళకరమైనది శివస్వరూపం. ఆ పరమ శివుని అనుగ్రహం పొందటానికి మనం జరుపుకునే ముఖ్యమైన పండుగ మహా శివరాత్రి. పురాణాలలో చెప్పినటువంటి ఈ మహాశివరాత్రిని ప్రతి సంవత్సరం మాఘమాసం కృష్ణపక్షంలో చతుర్థశినాడు జరుపుకుంటాం.ఈ రోజున శివ ప్రతిష్ట చేసినా లేక శివ కళ్యాణం చేసినా ఎంతో శ్రేష్టం. మహా శివరాత్రి రోజు తనను పూజిస్తే తన కుమారుడైన కుమారస్వామి కన్నా ఇష్టులవు తారని శివుడు చెప్పడాన్ని బట్టి ఈ విశిష్టత ఏంటో అర్థం చేసుకోవచ్చు. త్రయోదశినాడు ఒంటిపొద్దు ఉండి చతుర్థశినాడు ఉపవాసం ఉండటం ఆరోగ్యానికి కూడా మంచిది.

మన పండగలన్ని తిథులతోను,నక్షత్రాతోను ముడిపడి ఉంటాయి. కొన్ని పండగలకు తిథులు, మరికొన్ని పండగలకు నక్షత్రాలు ప్రధానమవుతాయి ఈ పద్ధతిలో ప్రతి నెల చాంద్రమాస ము ప్రకారం కృష్ణ పక్షమిలోని ప్రదోష వ్యాప్తిగల చతుర్థశి తిథిని మాస శివరాత్రి అంటారు. ఇది శైవులకు ఉపవాస వ్రతములకు ముఖ్యమైనదిగా భావించి శివున్ని కొలుస్తారు. సూర్యాస్తమ సమయమునకు పరమందు 6 ఘడియ లను ప్రదోషకాలమంటారు.. మాఘమాసములో కృష్ణ పక్ష చతుర్థశి అర్థరాత్రి వ్యాప్తి చెంది ఉన్నరోజును మహాశివరాత్రిగా పరిగణింపబడునని ధర్మసింధువు వంటి శాస్త్రగ్రంధాలు తెలువుతున్నాయి. అమావాస్యకు ముందు వచ్చే కృష్ణ పక్ష చతుర్థశినాడే శివ రాత్రి జరుపకొవాలని శాస్త్ర నిర్ణయము. సంక్రాంతి పండగ తర్వాత వచ్చే పండగలలో ముఖ్యమైనది మహా శివరాత్రి.అన్ని పండగలు పగటి పూట జరువుకుంటే ఈ పండగ మాత్రం రాత్రివూట జరువుకుం టాము. మహాశివరాత్రి రోజున అర్థరాత్రి 12 గంటలకు జ్యోతి స్వరూ వుడైన శివుడు లింగ రూపంలో దర్శన మిచ్చే పవిత్ర పర్వది కాలం. కాబట్టి శివుడి అనుగ్రహం కొరకు రాత్రి మేలుకొని భక్తితో అభిషేకాలు, పూజలు,భజనలు చేస్తారు. అందు చేత శివరాత్రిగా పిలవబడుతుంది. ఇది హిందువులకు ముఖ్యంగా శైవుల కు అత్యంత వుణ్య ప్రదమైన రోజు. మహాశివరాత్రిని హిందు వులు ఏంతో గొప్పనైన పర్వదినంగా జరువుకొని శివున్ని కొలిచి తరిస్తారు.

మహా శివరాత్రి రోజు ముఖ్యంగా పాటించవలసినవి మూడు ఉన్నాయి 1) ఉపవాసం ఉండటం 2) రాత్రిజాగరణ చేయడం 3) శివనామ స్మరణతో అభిషేకాలు చేయడం. శివుడు లింగోద్భవమూర్తిగా అవతరిం చడానికి ఒక పురాణ కథ ఉంది.ఒకసారి బ్రహ్మ, విష్ణువుల మధ్య మాటమాట పెరిగి తమలో ఎవరు గొప్పో అని తేల్చుకోవలనుకున్నారు. వీరి వాదన తారా స్థాయికి చేరింది.ఇద్దరిలో ఎవరూ తగ్గలేదు ఇదంతా చూస్తున్న శివుడు వారికి తన శక్తిని చూపించాలని మాఘ మాస చతు ర్థశి నాడు ఇద్దరికీ మధ్య జ్యోతిర్లింగ రూపం దాల్చాడు. బ్రహ్మ, విష్ణువులు లింగాకారంలో ఉన్న ఆశివుని యొక్క ఆది,అంతం తెలుసుకోవలని విష్ణువు వరాహ రూపం ధరించి అడుగ భాగాన్ని వెతుకుతూ వెళ్ళాడు. మరోవైవు బ్రహ్మ హంస రూపాన్ని ధరించి ఆకాశమంతా తిరుగు తాడు. వీరిద్దరూ ఎంత ప్రయత్నించినా ఆ లింగం యొక్క ఆది, తుది తెలియక చివరికి ఇక లాభం లేదనుకుని ఇద్దరు కలసి శివుని వద్దకు వచ్చి మేము నీ శక్తిని తేల్చు కోలేకపోతు న్నాము అని అడగగానే శివుడు వారిలో ఎవ రు గోప్ప అనే పోటితో వాదనతో ఉన్నదానిని తగ్గించడానికి నేను ఈ లింగాకారంగా అవతరిం చాల్సి వచ్చింది అని వారికి నిజరూపంతో వివరించి చెబుతాడు.దానితో బ్రహ్మ విష్ణువులు శివుడి ఆధిక్యతను గ్రహించి పూజించి కీర్తిస్తారు. ఆరోజే మహా శివరాత్రి అయినదని పురాణ కథనం.



వేములవాడ

కరీంనగర్ జిల్లాలోని వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి క్షేత్రం దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందింది. దీన్ని మొదట్లో లేములవాడ, లేంబాల వాటిక అనే పేర్లతోనూ పిలిచేవారని ఇక్కడున్న శాసనాల ద్వారా తెలుస్తోంది. రాజన్న అని నోరారా పిలుచుకునే ఈ రాజరాజేశ్వరస్వామి.. ఎంతో మహిమగల దేవుడని భక్తుల విశ్వాసం. క్షేత్రచరిత్ర/స్థలపురాణం: మాళవ ప్రభువెన రాజరాజ నరేంద్రుడు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు పౌరాణిక ఆధారాలు చెబుతున్నాయి. వేములవాడను చాళుక్యులు రాజధానిగా చేసుకొని పాలించినట్లు చరిత్రలో ఉంది. చాళుక్య రాజులలో మొదటి రాజు వినయాదిత్య యుద్ధమల్లుడు, అతని కుమారుడు అరికేసరి, ఆ తర్వాత రెండో యుద్ధమల్లుడు వేములవాడ కేంద్రంగా రాజ్యాన్ని పాలించారు. చాళుక్య రాజుల్లో చివరివాడు.. భద్రదేవుడి కుమారుడెన మూడో అరికేసరి అని దేవస్థానంలో ఉన్న శిలాశాసనాల ద్వారా తెలుస్తోంది. ఆలయ ప్రత్యేకత: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ధర్మగుండంలో వుణ్యస్నానం చేసి కోడెమొక్కు చెల్లించడం ఈ ఆలయ ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. ఆ తర్వాతే భక్తులు స్వామిని దర్శించుకొని ప్రధాన వూజలైన కల్యాణం, అభిషేకం, అన్నవూజ, కుంకుమ వూజ, ఆకుల వూజ, పల్లకిసేవల వంటి కార్యక్రమాల్లో పాల్గొంటారు. భక్తుల్లో చాలామంది స్వామివారికి తమ తలనీలాలు సమర్పించి తమ ఎత్తు బంగారాన్ని(బెల్లం) స్వామికి మొక్కుగా చెల్లించి.. ఆపై దాన్ని స్వామి ప్రసాదంగా పంపిణీ చేస్తారు. ప్రతినెలా దాదావు 10లక్షల మంది భక్తులు స్వామిని దర్శించుకొంటారని అంచనా.

ప్రధాన వేడుకలు: ఆలయంలో ఏటా మహాశివరాత్రి సందర్భంగా మూడురోజులపాటు వెభవంగా జాతర నిర్వహిస్తారు. సుమారు 5–6 లక్షల మంది భక్తులు స్వామిని దర్శించుకుంటారు.

కీసరగుట్ట

ప్రతిస్టతో హియోదేవ స్సీతా రామేణ ధీమతా –కేసరాద్రౌ విజయతే భవానీ సహితః శివః

త్రేతాయుగం లో శ్రీ రాముడు సీతా సమేతం గా,ఆంజనేయ సహితంగా ఈ కేసరి క్షేత్రానికి వచ్చినట్లు వురాణ గాథ ఉంది .ఇక్కడి ప్రక్రుతి సౌందర్యానికి వులకించి ఒక శివ లింగాన్ని ప్రతిష్టించాలని శ్రీ రాముడు సంకల్పించాడు .ఈ విషయాన్ని అప్పుడు ఈ ప్రాంతం లో ఉన్న మహర్షులకు తెలిపి వారి అనుమతికోరాడు .వారు సంతోషించి రావణ వధ చేసిన బ్రహ్మ హత్యా పాతకం శివ లింగ ప్రతిష్ట వల్ల పోతుందని హామీ ఇచ్చారు .శుభ ముహూర్తాన్ని వారే నిర్ణయించి రాముల వారికి తెలియ జేశారు కూడా.శ్రీ రాముడు హనుమతో హనుమా !నువ్వు కాశీ క్షేత్రానికి వెళ్లి గొప్ప శివలింగాన్ని ముహూర్త సమయం లోవు తీసుకొని రాఅని ఆనతిచ్చాడు .పవన సుతుడు ఆకాశ మార్గం లో కాశీ చేరి చూస్తె అక్కడ ఆయనకు నూటొక్క శివ లింగాలు కనీ పించాయి. దేన్నీ తీసుకెళ్ళాలో తెలియక శివుడిని ప్రార్ధించాడు .ఆయన అనుమతితో నూటొక్క లింగాలను తీసుకొని వచ్చేశాడు .ముహూర్తం సమీపిస్తోంది .కాని హనుమ రాలేదు రాముడికి ఏం చెయ్యాలో పాలు పోక పరమేశ్వరుడిని ప్రార్ధించాడు .అప్పుడు ఈశ్వరుడు ప్రత్యక్షమై శివ లింగ రూపం దాల్చాడు. సీతా రాములు ఈ స్వయంభు శివ లింగాన్నే సుముహూర్త సమయానికి ప్రతిష్టించారు. ఆఘ మేఘాల మీద అక్కడికి నూటొక్క లింగాలను తెచ్చిన హనుమ .శ్రీరామునితో తానూ తెచ్చిన వాటిలో ఏదో ఒక లింగాన్ని ఎంచి ఇక్కడ ప్రతిస్తించమని ,మిగిలిన లింగాలను కాశీ లో మళ్ళీ తీసుకొని వెళ్లి వదిలేస్తానని చెప్పాడు అప్పుడు రాముడు హనుమా !ప్రతిసటాతా ముహూర్తానికి నువ్వు రాక పోయే సరికి ఈశ్వరుడే ప్రత్యక్షమై శివ లింగాకృతి దాల్చాడు దానినే మేమిద్దరం ప్రతిస్తిన్నాము అని చెప్పాడు .హతాశుడైన హనుమ తానూ తెచ్చిన లింగాలలో ఏదీ ఉపయోగ పడనందుకు వ్యధ చెంది ,ఆవేశం తో ఆ లింగాలను తోకకు కట్టుకొని విసిరేశాడు .అవన్నీ చుట్టు ప్రక్కలా చెల్లా చెదురుగా పది పోయాయి అందుకే మనకు ఇప్పుడు కీసర గుట్టలో అడుగడుగునా శివలింగం కానీ పిస్తుంది ఇవన్నీ మారుతి తెచ్చిన లింగాలే .వీటికీ భక్తులు భక్తీ శ్రద్ధలతో వూజ చేస్తూ కానీ పిస్తారు .

కోటప్పకొండ

దక్షయజ్ఞం అనంతరం ఈశ్వరుడు సతీ వియోగంతో ప్రశాంతత కోసం త్రికూటా ద్రి (కోటప్పకొండ) పర్వతం పైన 12 ఏళ్లు వటుడిగా తపమాచరిస్తుండగా, సదాశివుని అనుగ్రహం కోసం బ్రహ్మ, విష్ణు, సకల దేవతలు, రుషి వుంగవులు స్వామి కటాక్షం కోసం అక్కడ తపమాచరించి ప్రసన్నుడిగా స్వామిని దర్శించుకుని జ్ఞాన దీక్ష పొందారు.అందు వల్లే ఈ క్షేత్రం మహా వుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. బ్రహ్మ చారి అయిన దక్షణామూర్తి క్షేత్రం కావడంతో ఇక్కడ కళ్యాణోత్సవాలు నిర్వహించారు. ధ్వజ స్తంభం కూడా ఉండదు. ఎటువైవు చూసినా మూడు శిఖరాలుగా కోటప్పకొండ కన్పిస్తుంది. అందుకే కొండపై వెలసిన స్వామికి త్రికూటేశ్వరుడు అని పేరు వచ్చింది.ఈ మూడు శిఖరాలకు బ్రహ్మ, విష్ణు, రుద్ర శిఖరాలు అని పిలుస్తారు. బ్రహ్మ శిఖరంపై బ్రహ్మ నివసించాడని ప్రతీతి. జ్యోతిర్లింగం ఈ ప్రాంతంలో లేకపోవటంతో బ్రహ్మ ఈశ్వరుని గురించి తపస్సు చేయగా అప్పుడు స్వామి ప్రత్యక్షమై బ్రహ్మ కోరిక తీర్చుటకు జ్యోతిర్లింగంగా వెలిశాడు. కోటప్పకొండ వద్ద ఉన్న కొండకావూరులోని గొల్లభామ ఆనందవల్లి త్రికోటేశ్వరునికి వూజ లు చేయగా ఈశ్వరుడు జంగం దేవ రరూపంలో ప్రత్యక్షమైనట్టు స్థల వురాణం చెవుతోంది. ఆనందవల్లి పాప వినాచన దూన వద్దకు వెళ్లి తీర్థం రుద్ర శిఖరానికి తెచ్చి జంగమయ్యకు అభిషేకాధి వూజలు చేసింది.ఆమెను పరీక్షిం చేందుకు ఎన్ని విధాలా కష్ట పెడుతున్నప్పటికీ వూజలు మాననం దునే ఆనం దవల్లి ఇంటికి వస్తాను, అక్కడే వ్రతం ఆచరించమని జంగమయ్య ఆమె వెనుకనే బయలుదేరాడు. ఎలాంటి పరిస్థితు ల్లోను వెను దిరిగి చూడవద్దని చెప్పగా ప్రళయ ధ్వనులకు తాళలేక బ్రహ్మ శిఖరం వద్ద వెను దిరిగి చూసింది.

జంగమయ్య అక్కడే శిలగా మారాడు. ఆ చోటనే కోటేశ్వరాలయం నిర్మించ బడింది. ఈ ఆలయానికి దిగువ భాగాన గొల్లభామ శిలగా మారిన ప్రాంతం లో ఆనందవల్లి గుడి నిర్మించారు. ఈ గుడిని సాలంకయ్య నిర్మించినట్టు స్థల వురాణం చెవుతుంది. రుద్రశిఖరంపై స్వామి వారు తపమా చరించారు. ఇక్కడే పాత కోటేశ్వర స్వామి ఆలయం ఉంది. ఇక్కడ ఆరుద్రోత్సవం సందర్భంగా కర్పూర జ్యోతి దర్శనం జరుగుతుంది. విష్ణుశిఖరంలో దక్షయజ్ఞంలో పాల్గొ న్న దేవతలు, రుషులు పాప విమోచనం పొందిన పవిత్ర స్థలంలో పాప విమోచనేశ్వర స్వామి ఆలయం ఉంది. ఆరు వందల అడుగుల ఎత్తులో త్రికోటేశ్వ ర స్వామి దేవాల యం ఉంది. ఘాట్ రోడ్డు నిర్మాణంతో ఈ క్షేత్రానికి వచ్చే భక్తుల సంఖ్య నానాటికి పెరుగుతోంది. కోటప్పకొండలోని శివుణ్ణి త్రికూటేశ్వర స్వామి అని, కోటప్పకొండ ప్రాంతం మొత్తం శిఖరాల మ యం. దేవాలయం దగ్గర నిలు చుంటే చుట్టూ రుద్ర శిఖరం, బ్రహ్మ శిఖరం, విష్ణు శిఖరం అనే మూడు పెద్దపెద్ద శిఖరాలు కనిపిస్తాయి. కోటప్ప కొండ కంటే ఎత్తున వుండే రుద్ర శిఖరం మీద ఒక చిన్న దేవాలయం కూడా వుంటుంది.

శివపూజకి ఆ వూవు వాడకండి..


మహాశివరాత్రి పర్వదినం రోజున ఉపవాసం, జాగరణ చేయడం ఉత్తమం. అయితే అనా రోగ్యం వున్నవారు ఉపవాసానికి దూరంగా ఉండి.. శివాలయాల్లో జరిగే వూజలో పాల్గొన డం చేయవచ్చు. శివవూజకు మొగలివూవును వాడకుండా వుండటం మంచిది. "అభిషేక ప్రియ నమః శివాయ" అంటే శివునికి అభిషేకాలంటే మహాప్రీతి. అందుకే శివరాత్రి రోజున శివునికి జరిగే అభిషేకాలను కళ్లారా చూసే వారికి ఈతిబాధలంటూ వుండవు. శివరాత్రిరోజున సాత్విక ఆహారం తీసుకోవాలి. పిండిపదార్థాలు తీసుకోవచ్చు. ప్రాతః కాలం లో నిద్రలేచి.. శుచిగా స్నానమాచరించి.. ఉతికిన వస్త్రాలను ధరించాలి. దేవాలయాలకు వెళ్లి శివుడిని దర్శించుకుని.. ఉపవాసం వుండేవారు పండ్లు, పాలు, ఫలహారాలను తీసుకోవాలి. వీలైనంత వరకు జాగరణ చేయాలి. శివునికి చేతనైన అభిషేకం చేయించాలి. పంచాక్షరీ మంత్రాన్ని జపిస్తూ వుండాలి. శివాలయాల్లో జరిగే అభిషేకాలు పాలు, రోజ్ వాటర్, పన్నీర్, చందనం, పెరుగు, తేనె, నెయ్యి, పంచదార, నీరు, బిల్వ పత్రాలు సమర్పించడం ద్వారా కోరిన కోరికలు నెరవేరుతాయని పండితులు చెవ్తున్నారు.

కాకి వాలని శివాలయం ఇది

ప్రతి ఏటా కార్తీకమాసంలో కోటప్పకొండ తిరుణాళ్ళు వైభవంగా జరుగుతాయి. తిరునాళ్ళ సందర్భంగా ఏర్పాటయ్యే ఎత్తయిన ప్రభలు చాలా ప్రసిద్ధిని పొందాయి. కార్తీకమాసంలోనే ఈ దేవాలయంలో కార్తీక వన సమా రాధనలు కూడా జరుగుతూ వుంటాయి. కొండమీద వున్న దేవాలయాన్ని చేరుకోవడానికి మెట్ల మార్గం వుంది. మెట్లు చాలా నిట్టనిలువుగా వుంటాయి. అందుకే కొండకు ఎక్కే భక్తులు చేదుకో కోటయ్యా అని అంటూ ఎక్కుతూ వుంటారు. బస్సు మార్గం వున్నప్పటికీ చాలామంది భక్తులు నడిచే కొండమీదకి వెళ్తూ వుంటారు. ఈ కోటప్పకొండ క్షేత్రానికి వున్న మరో విశిష్టత ఏమిటంటే, ఈ క్షేత్రం వున్న కొండ మీద కాకులు అస్సలు కనిపించవు. మిగతా పక్షులన్నీ కనిపిస్తాయిగానీ, ఎంత వెతికినా ఒక్క కాకి కూడా కనిపించదు. ఇదొక వింత. ఓ సందర్భంలో కాకి ఈ కొండమీదకి రాకుండా శాపం విధించారనే స్థల వురాణం ప్రచారంలో వుంది. 1761లో ఈ ప్రాంతాన్ని పాలించిన గుండారాయలు అనే రాజు కోటప్పకొండ మీదకి 703 మెట్లతో మెట్లమార్గాన్ని ఏర్పాటు చేయించారు. అలాగే ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాద్ మంత్రిగా వున్న సమయంలో కోటప్ప కొండ మీదకు బస్సు మార్గాన్ని ఏర్పరచి అనేక సౌకర్యాలు కల్పించా రు. భక్తులు ఒక్కసా రైనా తప్పకుండా దర్శించాల్సిన క్షేత్రం కోటప్పకొండ.









సమ్మోహనంగా ఛల్ మోహన్ రంగ



నితిన్, మేఘా ఆకాష్' జంటగా శ్రేష్ఠ్ మూవీస్, పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'ఛల్ మోహన్ రంగా'. మాటల మాంత్రికుడు, దర్శకుడు త్రివిక్రమ్ ఈ చిత్రానికి కథను అందిస్తుండగా, శ్రీమతి నిఖితారెడ్డి సమర్పణలో ప్రముఖ నిర్మాత ఎన్.సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని కృష్ణచైతన్య దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఇది నితిన్‌కు 25వ చిత్రం కావటం విశేషం.

ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తన ట్విట్టర్‌లో విడుదల చేసి చిత్ర యూనిట్‌కు అభినందనలు తెలిపారు. నా అభిమాన కథానాయకుడు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ గారు ఈ చిత్రం ప్రచార చిత్రాలను ట్విట్టర్ ద్వారా విడుదల చేయటం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు నితిన్. ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటోంది.



ఎంత సక్కగున్నావే సమంతా!

మార్చ్ 29న విడుదల కానున్న 'రంగస్థలం' సినిమా ప్రచారాన్ని ఉద్ధృతం చేశారు. ఇటీవలే సమంత పోషిస్తున్న 'రామలక్ష్మి' పాత్ర లుక్ పరిచయం చేసిన చిత్ర బృందం ఇప్పుడు సమంత–రామ్ చరణ్‌లపై చిత్రీకరించిన 'ఎంత సక్కగున్నావే' అనే పాటను విడుదల చేస్తోంది. సుకుమార్ ఆస్థాన సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ ఈ చిత్రానికి సంగీత దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే!



ప్రకృతిని ప్రేమించేవాళ్లందరికీ నచ్చే సినిమా

ఒక సూపర్ స్టార్ ముద్దుల కూతురు.. ఇంకో సూపర్ స్టార్‌కి గారాల అక్క. జాతీయ స్థాయిలో గౌరవం అందుకున్న 'షో' చిత్రంతో పాటు.. 'పోకిరి' వంటి ఇండస్ట్రీ హిట్‌కి నిర్మాత. నిజానికి ఈ గుర్తింపు చాలు ఆమెకి. కానీ దర్శకురాలిగానూ తన ప్రతిభని నిరూపించుకోవాలి అనే తపన మెండుగా కలిగిన మంజుల దర్శకత్వం వహిస్తూ రూపొందించిన చిత్రం 'మనసుకు నచ్చింది'. సందీప్ కిషన్ హీరోగా అమైరా దస్తూర్, త్రిదా చౌదరి హీరోయిన్‌గా మంజుల ఘట్టమనేని దర్శకత్వంలో ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, ఇందిరా ప్రొడక్షన్స్ బేనర్స్‌పై పి. కిరణ్, సంజయ్ స్వరూప్ ఈ చిత్రాన్ని నిర్మించారు ఈ చిత్రం ఫిబ్రవరి 16న విడుదలవుతుంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకురాలు మంజుల ఘట్టమనేనితో ఇంటర్వ్యూ...

– నా మనసుకు నచ్చిన కథతో చేసిన సినిమా 'మనసుకు నచ్చింది'. ఏదో ఒక సినిమా చేయాలనే స్టేజ్‌లో నేను లేను. నేను పనిచేయాల్సిన అవసరం కూడా లేదు. కానీ ఈరోజు నేను సినిమా చేస్తున్నానంటే.. నా హృదయంలోని విషయాలను వ్యక్తపరచాలనే ఉద్దేశంతోనే. ఎక్కడో.. ఏదో ఒక సినిమా.. ఐడియా చూసి చేసిన సినిమా కాదు. నా హృదయంలో నుండి వచ్చిన ఆలోచనతో చేసిన సినిమా ఇది.

– సినిమా అనేది ఆర్ట్. ఎంటర్‌టైన్‌మెంట్ అవసరమే. మన జీవితంలో అవసరమే. దీంతో పాటు ఏదో ఒక చిన్న చేంజ్ కూడా ఉండాలి. అలా చేంజ్‌తో ఉండే సినిమా 'మనసుకు నచ్చింది'. రేపు సినిమా చూసిన తర్వాత సూర్యోదయాన్ని, సూర్యాస్తమయాన్ని చూడాలనుకుంటారు. మన జీవితంలో చిన్న చిన్న ఆనందాలను వదిలేసుకుంటున్నాం. వేగవంతమైన జీవితంలో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నాం. నేను కూడా ఒకప్పుడు అలాగే ఉండేదాన్ని. కానీ ఎప్పుడైతే జీవితంలో చిన్న చిన్న ఆనందాలను ఆస్వాదించడం మొదలు పెట్టానో (పక్షుల కిల కిల రావాలు.. పువ్వుల సువాసన ఆస్వాదించడం) నాకు చాలా ప్రశాంతంగా అనిపించింది. నేను దాన్ని అందరికీ షేర్ చేయాలనిపించింది. మనం అందరం ఒకటే కదా! అనిపించింది. నేను ఫీల్ అయిన అనుభవాలను సినిమా రూపంలో చెబితే బావుంటుందనిపించింది. సినిమాకు కథ చాలా ముఖ్యం. మన చుట్టూ ఉన్న సమాజంలో ప్రోగ్రెస్ అనేది మంచి కథలను చెప్పడం ద్వారా ముందుకు సాగుతుంది. మంచి సినిమాలు ఇప్పుడు మనకు ఎంతో అవసరం. ఏదో కమర్షియల్ సినిమాలు చేయాలనుకుంటే చెసేయవచ్చు. నా అనుభూతులను సినిమా రూపంలో చెప్పాలనుకున్నాను. నిజంగా ప్రేక్షకులను మదిలో పెట్టుకుని మనం అందరం గర్వంగా ఫీలయ్యేలా ఈ సినిమా చేశాను.

– 'మనసుకు నచ్చింది' ఓ సముద్రంలాంటి సినిమా. సినిమాలో చాలా లేయర్స్ ఉంటాయి. కంప్లీట్ ఫన్ లవ్‌స్టోరీ. కథ వెనుక మరో కథ ఉంటుంది. మన మనసుకు మనం కనెక్ట్ కావడానికి నేను ప్రకృతి (సూర్యోదయం, సూర్యాస్తమయం, గాలి) అనే అంశాన్ని ఈ సినిమాలో ఉపయోగించాను. ఈ సినిమాలో అసలు హీరో ప్రకృతే. ప్రకృతి రూపంలో మహేష్‌బాబు వాయిస్ ఓవర్ ఇచ్చాడు.



మరో ఫిదా అంటుంటే ఆనందంగా ఉంది!

దర్శకులు హీరోలుగా మారడం.. హీరోలు దర్శకులుగా మారడం అన్ని భాషల్లోనే ఉన్నదే. అయితే.. హీరోగా కంటే దర్శకుడిగానే తాను ఎక్కువగా రాణించగలననే నమ్మకంతో.. ఇండస్ట్రీలోకి హీరోగా ఎంట్రీ ఇచ్చినప్పటికీ.. దర్శకత్వం ఛాన్స్ కోసం సుదీర్ఘంగా ప్రయత్నించి తొలి ప్రయత్నంలోనే సూపర్ హిట్ కొట్టిన దర్శకుడు వెంకీ అట్లూరి. మధుర శ్రీధర్ రూపొందిన 'స్నేహగీతం' చిత్రంతో సందీప్ కిషన్‌తోపాటు హీరోగా పరిచయమైన వెంకీ.. ఆ చిత్రానికి సంభాషణలపరంగా సహకారం అందించారు. ఆ తర్వాత మధుర శ్రీధర్ దర్శకత్వంలోనే రూపొందిన 'ఇట్స్ మై లైఫ్' చిత్రానికి డైలాగ్స్ రాసిన వెంకీ.. కేరింత' చిత్రంలోనూ తన కలం బలం చూపించారు. ఇప్పుడు తనే కథ, మాటలు, స్క్రీన్ ప్లే సమకూర్చుకొని 'తొలిప్రేమ' చిత్రంతో దర్శకుడిగా పరిచయమమై.. తొలి చిత్రంతోనే సూపర్ హిట్ సొంతం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో వెంకీ మీడియాతో ప్రత్యేకంగా ముచ్చటించారు..

– భీమవరం ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో మెగా ఫ్యాన్స్‌కు ఒక ప్రామిస్ చేశాను. పవన్ కల్యాణ్‌గారి 'తొలిప్రేమ' గౌరవాన్ని కాపాడుతానని. అన్నట్లుగానే కాపాడానని అనుకుంటున్నాను. సక్సెస్ రావాలని ఎవరైనా కోరుకుంటారు. దేవి థియేటర్‌లో సినిమా చూస్తున్నప్పుడు ఆడియెన్స్ అప్రిసియేన్ మేం కోరుకున్న దాని కంటే ఎక్కువ వచ్చింది.

– హ్యారీ మిక్స్ హ్యారీ బెన్ సినిమా చూసిన తర్వాత ఇష్టపడ్డాను. దాన్ని బట్టే మనకు తగ్గట్టు కథను తయారు చేసుకుంటూ వచ్చాను. ఇదొక ఫిక్షన్ స్టోరీ. నా స్వీయానుభవం కాదు. సినిమాలో రాశీ ఖన్నాను హీరోయిన్‌గా తీసుకోవాలనేది నిర్మాతలు, వరుణ్‌తేజ్ ఆలోచనే. వాళ్లే రాశి అయితే బావుంటుందని అన్నారు. నేను కొత్త అమ్మాయిని హీరోయిన్‌గా తీసుకోవాలని అనుకున్నాను. లేదు.. కాస్త ఆడియెన్స్‌కు కనెక్ట్ అయిన హీరోయిన్ అయితే బావుంటుందని నిర్మాతలు అన్నారు. మనకు ఉన్న హీరోయిన్స్‌లో నా కథకు సరిపోయేవాళ్లు తక్కువగానే ఉన్నారు. ఎవరా అని ఆలోచిస్తే.. రాశి అయితే బావుంటుందనుకున్నాం. అయితే తను కమర్షియల్ సినిమాలు ఎక్కువగా చేసింది కదా! ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారోనని అనుకున్నాం. లుక్ టెస్ట్ చేశాం. ఆ టెస్ట్‌లో తను 17 ఏళ్ల అమ్మాయిలా క్యూట్‌గా కనపడింది. దాంతో మేం తనైతే సరిపోతుందని ఫిక్స్ అయ్యాం. తను బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇచ్చింది.

– నేను కథ తయారు చేసుకునేటప్పటికి వరుణ్‌తేజ్ ముకుంద కూడా విడుదల కాలేదు. ఓ టీజర్ మాత్రమే విడుదలైంది. ఆ టీజర్ చూసి



ఇలాంటి హీరో మనకు ఉంటే ఇంకా కథను బాగా చెప్పొచ్చు అని అనుకున్నాను. అయితే మెగా ఫ్యామిలీ నుండి వస్తోన్న హీరో కదా! లవ్‌స్టోరీస్ చేస్తాడో లేదో అనే భయం కూడా వచ్చింది. కంచె రిలీజ్ అయిన తర్వాత కాస్త ధైర్యం వచ్చింది. తను డిఫరెంట్ సినిమాలు చేయడానికి సిద్ధం అని తెలిసింది. లోఫర్ టైంలో తనను కలిసి ఈ కథ చెప్పాను.

సురేష్ కొండేటి సమర్పణలో శంభో శంకర



ఆర్.ఆర్ పిక్చర్స్ పతాకంపై ఎస్.కె. పిక్చర్స్ సమర్పణలో శ్రీధర్ ఎన్. దర్శకుడిగా శంకర్‌ని హీరోగా పరిచయం చేస్తూ నిర్మిస్తోన్న చిత్రానికి మహాశివరాత్రి సందర్భంగా 'శంభో శంకర' అనే పేరును టైటిల్‌గా ఖరారు చేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు శ్రీధర్.ఎన్ మాట్లాడుతూ, 'నా కథను , నన్ను నమ్మి, తొలి అవకాశమిచ్చిన శంకర్‌కు ముందుగా నా కృతజ్ఞతలు. మా ఇద్దర్నీ నమ్మి నిర్మాతలుగా ముందుకు వచ్చిన వై. రమణారెడ్డి, సురేష్ కొండేటికి కృతజ్ఞతలు' అని అన్నారు. చిత్ర కథానాయకుడు శంకర్ మాట్లాడుతూ, 'నేను హీరోగా పరిచయం కావడం అదృష్టంగా భావిస్తున్నాను. నన్ను నటుడిగా ఆదరించిన ప్రేక్షకులు హీరోగా కూడా ఈ సినిమాతో ఆశీర్వదిస్తారని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా' అన్నారు. చిత్ర నిర్మాత వై. రమణారెడ్డి మాట్లాడుతూ, 'ఇప్పటివరకూ డెబ్భై శాతం షూటింగ్‌తో పాటు, ఒక భారీ ఫైట్, అద్భుతంగా హీరో ఇంట్రడక్షన్ పాటను చిత్రీకరించాం' అని అన్నారు. మరో నిర్మాత ఎస్.కె. పిక్చర్స్ అధినేత సురేష్ కొండేటి మాట్లాడుతూ, 'మంచి కథతో నిర్మిస్తున్న అద్భుతమైన చిత్రమిది. నెలాఖరుకల్లా షూటింగ్, మార్చి నెలలో పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తిచేసి వేసవి కానుకగా విడుదల చేస్తాం' అన్నారు.

జువ్వలా ఎగిరిపోవాలి



సోమి ఫిలిమ్స్ పతాకంపై రంజిత్, పాలక్ లల్వాని జంటగా భరత్ సోమి నిర్మించిన చిత్రం జువ్వ. ఈ చిత్రం ఆడియో రిలీజ్ వేడుక ఘనంగా జరిగింది. బొత్స సత్యనారాయణ , ఆయన సతీమణి బొత్స ఝాన్సీ విశిష్ట అతిథులుగా హాజరైన ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్, సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి, అడివి శేష్, హాస్య నటులు ఆలీ, సప్తగిరి, భద్రం, చిత్ర దర్శకుడు త్రికోటి, మాటల రచయిత రత్నం, మలయాళ నటుడు అర్జునా తదితరులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సెన్సేషనల్ డైరెక్టర్ వి.వి.వినాయక్ ఆడియో సి.డి.ని విడుదల చేసారు.

సెన్సేషనల్ డైరెక్టర్ వి.వి.వినాయక్ మాట్లాడుతూ "మా కుటుంబానికి ఆప్త మిత్రుడు బొత్స సత్యనారాయణ, వారి సతీమణి బొత్స ఝాన్సీ గారు, వారి అల్లుడు ఈ సినిమా నిర్మాత భరత్ సోమి గారికి శుభాకాంక్షలు. తమ్ముడి మీద అభిమానంతో రంజిత్‌ను హీరోగా పరిచయం చేస్తున్న భరత్‌కు అభినందనలు. ఈ సినిమా ద్వారా రంజిత్‌కు మంచి నటుడుగా గుర్తింపు రావాలని కోరుకుంటున్నాను. అలాగే కీరవాణి గారు ఈ సినిమాకు సంగీతం అందించడం చాలా గొప్ప విషయం. ఈ సినిమా మంచి విజయం సాధించాలి" అన్నారు.

దర్శకుడు త్రికోటి మాట్లాడుతూ, నాలాంటి కొత్త వాడి సినిమాకు సంగీతం ఇచ్చిన కీరవాణి గారు నిజంగా నాకు దేవుడుతో సమానం. ఆయన రుణం తీర్చుకోలేనిది. నేను చేస్తున్న ఈ సినిమా హిట్ కావాలని మనస్ఫూర్తిగా సహకరిస్తున్న మా యూనిట్ అందరికి ధన్యవాదాలు. సినిమా మేము ముందు అనుకున్న బడ్జెట్ కంటే ఎక్కువే అయ్యింది. కానీ నిర్మాత ఏ మాత్రం ఇబ్బంది పెట్టకుండా మాకు పూర్తిగా సహకరించారు" అన్నారు.

హీరో రంజిత్ మాట్లాడుతూ: నా మొదటి సినిమా కే లెజెండ్రీ మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణి గారు సంగీతం అందించటం నిజంగా నా అదృష్టం. ఇన్ని రోజులుగా నన్ను ప్రోత్సహిస్తూ వచ్చిన మా అమ్మా నాన్నలకి, మా అన్నయ్య భరత్‌కి చాలా చాలా థాంక్స్. అలాగే బొత్స అంకుల్‌కి థాంక్స్. సినిమా కథ చాలా బాగుంది. నిజానికి కథే హీరో. ఖచ్చితంగా అందరికి నచ్చుతుంది అన్నారు.

నిర్మాత భరత్ మాట్లాడుతూ, సినిమా చాలా బాగా వచ్చింది. రత్నం గారి డైలాగ్స్ బాగున్నాయి. హీరోయిన్ పాలక్, విలన్ అర్జునా ఇద్దరూ చాలా బాగా నటించారు' అన్నారు.

అనాథ బాలలే అతిథులుగా సత్యగ్యాంగ్ టీజర్ రిలీజ్



సమాజంలో అనాథలనేవారు లేకుండా చేయాలనే సందేశానికి వినోదాన్ని జోడించి రూపొందిన చిత్రం 'సత్య గ్యాంగ్'. ఈ చిత్రం టీజర్‌ను అనాథ బాలల సమక్షంలో వారే అతిథులుగా విడుదల చేశారు. అంతేకాదు, వారికి 10 వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు చిత్ర నిర్మాత మహేష్ ఖన్నా.

సాత్విక్ ఈశ్వర్‌ని హీరోగా పరిచయం చేస్తూ.. సిద్ధయోగి క్రియేషన్స్ పతాకంపై ప్రొడక్షన్ నెంబర్ వన్‌గా కర్నూలుకు చెందిన ప్రముఖ రాజకీయ–వ్యాపారవేత్త మహేష్ ఖన్నా నిర్మిస్తున్న 'సత్య గ్యాంగ్'. షూటింగ్‌తో పాటు, పోస్ట్ ప్రొడక్షన్ పనులన్నీ పూర్తి చేసుకున్న ఈ చిత్రం టీజర్‌ని ఫిలిం ఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాత మహేష్ ఖన్నా, దర్శకుడు ప్రభాస్, హీరో సాత్విక్ ఈశ్వర్, హీరోయిన్ అక్షిత, నియూష్, హర్షిత, ఛాయాగ్రాహకులు అడుసుమిల్లి విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఈ చిత్రాన్ని నిర్మిస్తుండడంతో పాటు.. ఈ చిత్రంలో ఓ ముఖ్య పాత్ర పోషిస్తూ.. దర్శకత్వ పర్యవేక్షణ చేస్తున్న మహేష్ ఖన్నా మాట్లాడుతూ.. 'సమాజంలో అనాథలనేవారు ఉండకూడదనే సందేశానికి వినోదాన్ని మేళవించి తీస్తున్న చిత్రం 'సత్య గ్యాంగ్'. అందుకే అనాథ బాలల చేతుల మీదుగా టీజర్ లాంచ్ చేశాం. హీరోగా పరిచయమవుతున్న సాత్విక్ ఈశ్వర్‌కి చాలా మంచి భవిష్యత్ ఉంది. త్వరలోనే ఆడియో లాంచ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం దర్శకుడిగా పరిచయమవుతున్న ప్రభాస్ ప్రతి ఫ్రేమ్ అందంగా తీర్చి దిద్దాడు. సినిమా చాలా బాగా వచ్చింది. సినిమా చూసి నచ్చలేదన్నవారికి డబ్బులు వాపసు ఇచ్చేస్తాం. డబ్బులు ఎక్కువ ఉండడం వల్ల కాదు ఇలా చెబుతున్నది.. సినిమాపై మాకున్న నమ్మకం వల్ల' అన్నారు.

దర్శకుడు ప్రభాస్ మాట్లాడుతూ, మా తల్లితండ్రులు నాకు జన్మనిస్తే.. ఒక దర్శకుడిగా నాకు జన్మనిచ్చిన వ్యక్తి మహేష్ ఖన్నాగారు. సినిమా మేకింగ్ సందర్భంగా నాకు తెలియకుండా ఎప్పుడైనా అయన మనసు కష్టపెట్టి ఉంటే మన్నించవల్సిందిగా మనవి. అడుసుమిల్లి విజయ్ కుమార్ ఛాయాగ్రహణం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ' అన్నారు.

'సత్య గ్యాంగ్' వంటి మెసేజ్ ఓరియంటెడ్ ఎంటర్ టైనర్ ద్వారా పరిచయం అవ్వబోతుండడం అద ష్టంగా భావిస్తున్నామని సాత్విక్ ఈశ్వర్, ప్రత్యూష్, అక్షిత అన్నారు.

సాత్విక్ ఈశ్వర్ సరసన అక్షిత హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చ్రింలో ప్రత్యూష్, హర్షిత, సుమన్, సుహాసిని, కాలకేయ ప్రభాకర్, షఫీ, జీవా, వినోద్, మహేష్ ఖన్నా, రాజేందర్, దిల్ రమేష్, బి.హెచ్.ఈ. ఎల్.ప్రసాద్ ఇతర పాత్రలు పోషిస్తున్నారు. సీనియర్ సినిమాటోగ్రఫర్ అడుసుమిల్లి విజయ్ కుమార్ ఛాయాగ్రహణం అందిస్తున్న ఈ చిత్రానికి కథ: సిద్ధయోగి క్రియేషన్స్, ఆర్ట్: డేవిడ్, ఎడిటర్: నందమూరి హరి, అసోసియేట్ డైరెక్టర్: నాగబాబు, కో–డైరెక్టర్స్‌బీ కొండలరావు–వి.ఎన్. రెడ్డి, ప్రొడక్షన్ మేనేజర్: మంగారావు, నిర్మాత–దర్శకత్వపర్యవేక్షణ: మహేష్ ఖన్నా, సంగీతం–దర్శకత్వం: ప్రభాస్!!



మస్కట్‌లో పురాతన శివాలయం సందర్శనకు ప్రధాని మోడీ

- దాదాపు 125 ఏళ్ల నాటి శివాలయానికి మోడీ
- తరువాత సుల్తాన్ ఖబూస్ మసీదు సందర్శన
- నేడు న్యూఢిల్లీకి తిరుగుప్రయాణం

మస్కట్ : ప్రధాని నరేంద్ర మోడీ తన దక్షిణాసియా దేశాల పర్యటనలో భాగంగా సోమవారం మస్కట్‌లోని దాదాపు 125 ఏళ్ల నాటి పురాతన శివాలయాన్ని దర్శించుకున్నారు. ప్రయాణ షెడ్యూల్‌లో భాగంగా ఆయన సాయంత్రం గ్రాండ్ సుల్తాన్ ఖబూస్ మసీదుకు కూడా వెళ్లారు. ఈ మసీదును దాదాపు మూడు లక్షల భారతదేశ ఇసుకరాళ్లతో నిర్మించారు. మసీదు సందర్శన తరువాత ఆయన ఒమన్‌లోని పలు ప్రముఖ కంపెనీల సీఈఓలతో భేటీ అయ్యారు. కాగా, ఆదివారం ఒమన్ సుల్తాన్ ఖబూస్ బిన్ సైద్‌తో సమావేశమైన మోడీ పలు అంశాలపై విస్తృతంగా చర్చలు జరిపారు. వ్యాపారం, పెట్టుబడులు, ఇంధనం, భద్రత, రక్షణ, ఆహార భద్రత, ప్రాంతీయ సమస్యల పరంగా ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వారిద్దరూ చర్చించారు. చర్చల అనంతరం ఇరు దేశాల మధ్య పౌర, వాణిజ్య అంశాల్లో చట్టపరమైన, న్యాయ సహకారంపై ఓ అవగాహన ఒప్పందం సహా ఎనిమిది కీలక ఒప్పందాలు కుదిరాయి. కాగా, ప్రధాని మోడీ సోమవారంతో తన దక్షిణాసియా దేశాల పర్యటనను ముగించుకుని మంగళవారం న్యూఢిల్లీ చేరుకుంటారు.

త్రిపురలో అధికారం బిజెపిదే

- మేఘాలయ ఎన్నికల్లో వోటు వేయనున్న ఇటలీ, అర్జెంటీనా, స్వీడన్, గోవా, త్రిపుర, స్వీట్ హార్ట్!
- 27న మేఘాలయ శాసనసభ ఎన్నికలు
- ఖాసీ జిల్లా వోటర్లకు విచిత్రమైన పేర్లు
- దేశాలు, వారాలు, ఇంగ్లిష్ పదాలను పేర్లుగా పెట్టుకుంటున్న యువత



అగర్తలా : వరుస విజయాల పరంపరను కొనసాగిస్తూ త్రిపురలోనూ భారతీయ జనతా పార్టీ (బిజెపి) జెండా ఎగురవేస్తామని బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. అమిత్ షా సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, వివిధ నియోజకవర్గాల్లో ప్రజల నుంచి వెల్లువెత్తుతున్న స్పందన చూస్తుంటే బిజెపి పాలిత 20వ రాష్ట్రంగా త్రిపుర నిలువబోతోందని ఆశ కలుగుతోందని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ చరిష్మాతో అంతకు ముందు తమ పార్టీ ఎమ్మెల్యేలే లేని ఈశాన్య రాష్ట్రాలు మణిపూర్, అసోంలలో అధికారంలోకి వచ్చామని చెప్పారు. ఇప్పుడు అదే తరహా విజయం త్రిపురలోనూ పునరావృతం కాబోతోందని అన్నారు. 25 ఏళ్లుగా అధికారంలో ఉన్న వామపక్షం ప్రతి ఇంటికీ మంచినీటి సరఫరా, విద్యుత్తు, వైద్య సదుపాయం కల్పించలేకపోయిందని, పరిశ్రమలు స్థాపించలేకపోయిందని విమర్శించారు. తక్కువ సమయంలోనే బిజెపి పాలిత ప్రాంతాలు అభివృద్ధి పథంలో పరుగులిడుతుంటే సుదీర్ఘ కాలం అధికారంలో ఉన్న సీపీఎం వల్ల రాష్ట్రం వెనుకబాటుతనానికి గురైందని దుయ్యబట్టారు. రోజూ అత్యాచారాలు, హత్యలతో దేశంలోనే అత్యధిక నేరాలు జరిగే రాష్ట్రాల్లో త్రిపురను ఒకటిగా మార్చారని అమిత్ షా మండిపడ్డారు. బిజెపికి వస్తున్న స్పందన చూసి తట్టుకోలేక తమ కార్యకర్తలపై దాడులకు తెగబడుతున్నారని ఆయన ఆరోపించారు. వాటిని ఎదుర్కొనేందుకు తమ కార్యకర్తలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని అమిత్ షా చెబుతూ, అధికారులు, పోలీసులు పక్షపాతం లేకుండా వ్యవహరించాలని కోరారు. వామపక్ష వ్యతిరేక వోట్లను చీల్చేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపిస్తూ, వారి ఆటలు ఇక సాగవని హెచ్చరించారు. బిజెపి అధికారంలోకి వస్తే, తాము విడుదల చేసిన మేనిఫెస్టో ప్రకారం రాష్ట్రంలో సెజ్‌ల ఏర్పాటు, యువతకు సెల్ ఫోన్‌ల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపడతామని అమిత్ షా హామీ ఇచ్చారు. 60 మంది సభ్యులు గల త్రిపుర అసెంబ్లీకి ఈ నెల 18న ఎన్నికలు జరగనుండగా మిత్రపక్షం ఐపీఎఫ్‌టీతో కలసి 51 స్థానాల్లో బిజెపి పోటీ చేస్తోంది.

దేశంలో జరిగే ఏ ఎన్నికల్లో వోటు వేయాలన్నా తప్పనిసరిగా భారతీయ పౌరుడై ఉండాలి. మరి విదేశీయులు వోటు ఎలా వేస్తారు? అనేగా మీ సందేహం. ఈ నెల 27న మేఘాలయ శాసనసభకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో ఇటలీ, అర్జెంటీనా, స్వీడన్, ఇండోనేషియా వోటు హక్కును వినియోగించుకోనున్నాయి. అయితే, ఇందులో అంతగా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. మన దేశంలో వారికి ఎలా వోటు హక్కు వచ్చిందని బుర్ర బద్దలుగొట్టుకోవాల్సిన పని లేదు. ఎందుకంటే ఆ పేర్లు దేశాలవి కావు. ఆ రాష్ట్రంలోని వోటర్లవి. షెల్లా నియోజకవర్గంలోని తూర్పు ఖాసి జిల్లా, ఉమినియహ్- టిమార్ ఎలాక గ్రామంలోని నివసిస్తున్న వారిలో కొందరి వోటర్ల పేర్లు అవి. ఖాసీ తెగ ప్రజల పేర్లను చూస్తే నవ్వు వస్తుంది. అయితే, వందలాది మంది ఇలా విచిత్రమైన పేర్లను పెట్టుకుంటారు అని ఎలాక సర్పంచ్ (సిర్దార్) ప్రీమియర్ సింగ్ తెలిపారు. దాదాపు 50 శాతం మంది ఇటువంటి పేర్లతోనే కనిపిస్తుంటారని ఆయన తెలిపారు. ఇంగ్లిష్ పదాలు, పద్యాల పేర్లు, వారాలు, రాష్ట్రాల పేర్లు కూడా పెట్టుకుంటారని వివరించారు. బంగ్లాదేశ్ సరిహద్దుకు దగ్గరగా ఉండే ఈ గ్రామంలో 850 మంది పురుష వోటర్లు, 916 మంది మహిళా వోటర్లు ఉన్నారు. తనకు మాత్రం తన తండ్రి ప్రీమియర్ అని చక్కని పేరు పెట్టారని సర్పంచ్ ఆనందం వ్యక్తం చేశారు. ఆదివారం, గురువారం, గోవా, త్రిపుర అనే పేర్లు కూడా ఇక్కడ కనిపిస్తుంటాయి. ఇక ఇక్కడ బెస్ట్ ఇంగ్లిష్ పేరు స్వీట్ హార్ట్. ఈ గ్రామంలో ఉన్న ముగ్గురు అక్కాచెల్లెళ్ల పేర్లు వరుసగా రిక్వెస్ట్, లవ్లీనెస్, హ్యాపీనెస్. వారి తల్లి పేరు షుకి. ఖాసీ భాషలో ఈ పదానికి అర్థం కుర్చీ అని.

ఉత్తర ప్రదేశ్ బీజేపీలో విభేదాలు



కాన్పూర్ : హర్యాన్వీ డ్యాన్సర్ సప్నా చౌదరి ఈవెంట్ టిక్కెట్లపై ముఖ్య మంత్రి యోగి ఆదిత్యనాథ్ ఫోటో ముద్రించడంపై ఉత్తర ప్రదేశ్ బీజేపీలో వివాదం రాజుకుంది. రాష్ట్ర బీజేపీ నేత నీలిమా కటియార్, బీజేపీ చీఫ్ సురేంద్ర మైథాని ఈవెంట్ టిక్కెట్లపై యోగి ఆదిత్యనాథ్ ఫోటోను వాడడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే, ఆ పార్టీకే చెందిన కాన్పూర్ మేయర్ మాత్రం ఈవెంట్ టిక్కెట్లపై ముఖ్యమంత్రి ఫోటోను ముద్రించడాన్ని సమర్థించారు. చెప్పుకునేంత పెద్ద విషయం కాకపోయినా మీడియానే టిక్కెట్ల విషయాన్ని పెద్దది చేసి చూపుతోందని ఆరోపించారు. ఆయనే స్వయంగా ఈవెంట్‌ను ప్రారంభించారు. టిక్కెట్లు లేకుండా ఈవెంట్‌లోకి వెళ్లేందుకు పలువురు ప్రయత్నించడంతో పరిస్థితి అదుపు తప్పింది. దీనితో భద్రతగా ఉన్న పోలీసులు వారిపై లాఠీ చార్జ్ చేశారు. దీనితో ఆగ్రహించిన కొందరు పార్క్ చేసి ఉన్న వాహనాలపై రాళ్ల దాడికి దిగారు. కాగా, ఈ కార్యక్రమాన్ని కాన్పూర్‌కు చెందిన ఓ డాక్టర్ నిర్వహించి నట్లు తెలుస్తోంది. కొద్ది రోజుల కిందట ముఖ్యమంత్రి చేతులు మీదుగా అవార్డు అందుకున్నందుకు ఆయన ఈవెంట్‌ను ఏర్పాటు చేసినట్లు సమాచారం. ప్రభుత్వ అధికారులకు, ప్రముఖులకు ఈవెంట్‌కు పెద్ద ఎత్తున ఉచితంగా టిక్కెట్లు అందజేసినట్లు తెలిసింది. సాధారణంగా టిక్కెట్లు భారీగా అమ్ముడు పోయినట్లు సమాచారం.

ఉగ్ర దాడిలో గాయపడ్డ నిండు గర్భిణి పండంటి ఆడబిడ్డ జననం

జమ్మూ : జమ్మూ కాశ్మీర్‌లోని సుంజ్వాన్ సైనిక స్థావరంపై జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థ దాడి జరిపి ముప్పై గంటలు దాటింది. సైనిక కుటుంబాలపై జరిగిన ఈ దాడిలో ఓ నిండు గర్భవతి శరీరంలోకి వెనుక వైపు నుంచి ఓ తూటా దిగింది. దీంతో, ఆమె పరిస్థితి విషమంగా మారడంతో ఆర్మీ హెలికాప్టర్ ద్వారా ఆమెను మిలిటరీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఆమె కడుపులోని బిడ్డపై అంతా ఆశలు వదులుకున్నారు. కానీ, వైద్యుల శ్రమ ఫలించడంతో ఆ మహిళ పండంటి ఆడపిల్లకు జన్మ ఇచ్చింది. ఆడశిశువు 2.5 కిలోల బరువు ఉందని, తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని మిలిటరీ వైద్యులు తెలిపారు.

ఆ ఆలయంలో 'నో హెల్మెట్- నో పూజ' బోర్డులు

భువనేశ్వర్ : ఒడిశాలోని జగత్‌సింగ్‌పూర్‌లో సుమారు వెయ్యి సంవత్సరాల చరిత్ర కలిగిన మా సరళా దేవి ఆలయంలో ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలకు పూజ చేయించుకోవాలంటే హెల్మెట్ పెట్టుకుని వెళ్లాల్సిందే. లేదంటే సదరు బండి పూజకు నోచుకోదు. ఆ ఆలయ పరిసర ప్రాంతాల్లో 'నో హెల్మెట్– నో పూజ' అనే బోర్డులు కూడా పెట్టేశారు. తమ ఆలయంలో కొత్త ద్విచక్ర వాహనాలకు పూజ చేయించుకుంటే మంచి జరుగుతుందని భక్తులు నమ్ముతారని అక్కడి పూజారులు చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల వాహనదారులకు హెల్మెట్ కొనుక్కోవడంపై ఆసక్తి పెరుగుతోందని చెప్పారు. హెల్మెట్ పెట్టుకోకపోవడంతో రోడ్డు ప్రమాదాల్లో చాలా మంది మృత్యువాత పడుతున్నారని, అందుకే తాము ఇలా చేస్తున్నామని చెప్పా

తాజ్‌మహల్ చుట్టూ డ్రోన్లు ఉపయోగిస్తే జైలుకే

- ఐపీసీలోని పలు సెక్షన్ల కింద కేసుల నమోదు
- గత ఏడాది తాజ్ మహల్ చుట్టూ 20 సార్లు డ్రోన్ల గుర్తింపు
- భద్రత కారణాలతోనే కొత్త నిబంధనలు : పోలీసులు


ఆగ్రా : ప్రపంచ వారసత్వ సంపదగా పర్యాటకులను ఆకట్టుకుంటున్న 'తాజ్ మహల్' దరిదాపుల్లో డ్రోన్లను ఉపయోగించిన వారిని జైలుకు పంపనున్నట్లు పోలీసులు తెలిపారు. తాజ్ మహల్ చుట్టుపక్కల డ్రోన్లను ఉపయోగిస్తే వారిపై నేరపూరిత అభియోగాలను నమోదు చేస్తామని వారు హెచ్చరించారు. డ్రోన్లను వాడవద్దని ఇప్పటి వరకు చేస్తున్న హెచ్చరికలను పర్యాటకులు పట్టించుకోనందు వల్లే ఇలాంటి కఠిన నిర్ణయం తీసుకుంటున్నామని వారు చెబుతున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, గత ఏడాదిలో సుమారు 20 సార్లు తాజ్ మహల్ చుట్టూ డ్రోన్లను గుర్తించారు. అయితే, వారిపై పోలీసులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం గమనార్హం. ఆగ్రా నగర ఎస్పీ కున్వార్ అనుపమ్ సింగ్ మాట్లాడుతూ, తాజ్ మహల్ చుట్టూ డ్రోన్లను ఉపయోగించే వారిపై ఐపీసీలోని సెక్షన్ 287 (యంత్రసామగ్రి పట్ల నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించడం), సెక్షన్ 336 (ఇతరుల జీవితం లేదా వ్యక్తిగత భద్రతకు ముప్పు కలిగించడం), సెక్షన్ 337 (ఇతరుల జీవితానికి లేదా వ్యక్తిగత భద్రతకు ముప్పు కలిగించడం ద్వారా ఇబ్బంది పెట్టడం), సెక్షన్ 338 (ఇతరుల జీవితం లేదా వ్యక్తిగత భద్రతకు ముప్పు కలిగించడం ద్వారా అపాయకరమైన దెబ్బ తీయడం) కింద కేసు నమోదు చేస్తామని చెప్పారు. భద్రత కారణాలతోనే తాజ్ మహల్ చుట్టూ డ్రోన్ల వినియోగాన్ని నిషేధిస్తున్నామని ఆయన తెలిపారు. కొత్త నిబంధనల గురించి అతిథులకు వివరించాలని హోటళ్ల యజమానులు, వారి సంఘాలకు సూచిస్తున్నాం అని ఆయన చెప్పారు. మరో వైపు నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారానే తాజ్ మహల్ చుట్టూ ఎవరూ డ్రోన్లను వినియోగించకుండా అడ్డుకట్ట వేయగలమని సీఐఎస్ఎఫ్ కమాండెంట్ (ఆగ్రా) బ్రిజ్ భూషణ్ అభిప్రాయపడ్డారు.



జయలలిత మేనకోడలు దీప ఇంట నకిలీ ఐటీ దాడులు

- దిమ్మతిరిగే వాస్తవం వెలుగులోకి!
- ఇటీవల దీప ఇంట నకిలీ ఐటీ దాడులు
- పోలీసులు వచ్చేలోగా జారుకున్న నకిలీ అధికారులు
- దాడులకు సూత్రధారి దీప భర్త మాధవనే
- పోలీసులకు పట్టుబడ్డ నకిలీ ఐటీ అధికారి

చెన్నై : తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత మేనకోడలు దీప ఇంటిపై ఇటీవల నకిలీ ఐటీ అధికారులు సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. దీప ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసిన పోలీసులు విచారణలో భాగంగా దిమ్మతిరిగే వాస్తవాన్ని వెలుగులోకి తెచ్చారు. దీపను భయపెట్టేందుకు ఆమె భర్త మాధవన్ చేసిన ప్రయత్నమే ఈ నకిలీ ఐటీ దాడులు అని ఓ అధికారిగా నటిస్తూ సోదాలు జరిపి ఆపై పోలీసులకు పట్టుబడిన వ్యక్తి విచారణలో చెప్పాడు. దీపను భయపెట్టడమే తమ ఉద్దేశమని ఆయన చెప్పినట్టు పోలీసు అధికారులు వెల్లడించారు. దీప ఇంటిపై అసలు ఐటీ అధికారుల దాడి జరగలేదని, సినిమా పక్కీలో నకిలీ ఆదాయపు పన్ను అధికారులు కార్లలో వచ్చి దాడుల డ్రామా ఆడిన సంగతి తెలిసిందే. వచ్చిన వారు అధికారులు కాదని దీప కుటుంబీకులకు అనుమానం రావడం, వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, పోలీసులు దీప ఇంటికి వెళ్లేలోగానే నకిలీ ఐటీ గ్యాంగ్ జారుకుంది. ఆమె వద్ద భారీగా డబ్బు ఉంటుందని భావిస్తూ, సినిమాలో చూపే మాదిరిగా దోపిడీ చేయాలన్న ఉద్దేశంతోనే వారు వచ్చి ఉంటారని తొలుత భావించిన పోలీసులు తాజాగా నిందితుడు వెల్లడించిన నిజాలతో మాధవన్‌పై కేసు నమోదుకు కదులుతున్నారు.




బాంబు కనిపించడంతో లండన్ ఎయిర్‌పోర్టు మూసివేత



లండన్ : లండన్ నడిబొడ్డున ఉన్న సెంట్రల్ ఎయిర్‌పోర్టులో రెండో ప్రపంచ యుద్ధం నాటి బాంబు కనిపించడంతో ఎయిర్‌పోర్టును మూసివేశారు. కింగ్ జార్జ్–5 డాక్‌లో విస్తరణ పనులు చేపట్టగా, ఈ బాంబు వెలుగులోకి వచ్చింది. ముందు జాగ్రత్త చర్యగానే ఈ నిర్ణయం తీసుకున్నామని, ఈ విమానాశ్రయం నుంచి ప్రయాణాలు పెట్టుకున్న వారంతా తదుపరి సమాచారం కోసం తమ తమ ఎయిర్‌లైన్స్‌ను కాంటాక్టు చేయాలని సూచించారు. ఈ విమానాశ్రయం నుంచి దగ్గరి ప్రాంతాలకు వెళ్లే విమాన సర్వీసులను నిర్వహిస్తుంటారు. ఆదివారం ఈ బాంబును కనుగొన్నామని, దాన్ని నిర్వీర్యం చేసే పనులు 17 గంటల పాటు సాగాయని లండన్ పోలీసులు తెలిపారు. రాయల్ నేవీలో పని చేసే ప్రత్యేక పోలీసు దళాలు దీనిని నిర్వీర్యం చేశాయని వెల్లడించారు. 1940 సెప్టెంబర్ నుంచి 1941 మే మధ్యలో జర్మనీ వాయు సేన ఈ బాంబును లండన్‌పై జారవిడువగా, అది పేలకుండా ఉండిపోయిందని అధికారులు వివరించారు.

యువతకు ప్రేమించే హక్కు ఉంది



చండీగఢ్ : విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) కార్యకర్తలు ప్రేమికుల రోజును మన దేశంలో నిర్వహించుకోవడాన్ని కొన్నేళ్లుగా వ్యతిరేకిస్తున్నారు. మరి రెండు రోజుల్లో వేలంటైన్స్ డే ఉన్నందున వీహెచ్‌పీ అంతర్జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రవీణ్ తొగాడియా ఈ సందర్భంగా యువతకు ఇచ్చిన సందేశం ఒకింత ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. యువతీ యువకులకు ప్రేమించే హక్కు ఉందని ఆయన అన్నారు. ప్రేమికుల రోజున ఆందోళనలు లేదా హింస ఉండరాదని ఆయన కోరారు. చండీగఢ్‌లో వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ కార్యకర్తలను ఉద్దేశించి ఆదివారం ఆయన మాట్లాడారు. 'జంటలు ప్రేమలో పడకుంటే, పెళ్లిళ్లు జరగవు. అలా పెళ్లిళ్లు లేకుంటే ప్రపంచం పురోగతి సాధించదు. అందువల్ల యువతీ యువకులకు ప్రేమించే హక్కు ఉంది. వారు ఈ హక్కును పొందాలి' అని ఆయన సందేశం ఇచ్చారు. ప్రేమికుల రోజు తమ కార్యకర్తలు ఆందోళనలు, నిరసనలు చేపట్టకుండా వారికి తగిన ఆదేశాలు జారీ చేశామని ఆయన చెప్పారు. తమ కుమార్తెలు, సోదరీమణులకు కూడా ప్రేమించే హక్కు ఉందని సందేశపూర్వకంగా తెలిపామన్నారు. కాగా, వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ కార్యకర్తలు కొన్నేళ్లుగా భారత్‌లో ప్రేమికుల రోజును నిషేధించాలని డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే.

మిస్టర్ భగవత్! మీ వ్యాఖ్యలు సిగ్గుచేటు

న్యూఢిల్లీ : ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ భారత ఆర్మీపై చేసిన వ్యాఖ్యలు సిగ్గుపడే విధంగా ఉన్నాయంటూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. 'మీవ్యాఖ్యలకు సిగ్గు పడాలి' అని రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ ప్రసంగం ప్రతి భారతీయుడికీ అవమానకరంగా ఉందన్నారు. భారత జాతి కోసం ప్రాణాలు అర్పించిన వారిని అగౌరవపరిచేలా ఉన్నాయని ఆరోపించారు. ప్రతి జవాను సెల్యూట్ చేసిన భారత పతాకాన్ని అవమానించేలా వ్యాఖ్యలు ఉన్నాయని పేర్కొన్నారు. సందర్భం వస్తే దేశం కోసం పోరాడేందుకు ఆర్మీని మూడు రోజు ల్లోనే ఆర్ఎస్ఎస్ సిద్ధం చేయగలదని భగవత్ చేసిన వ్యాఖ్యలే ఈ వివాదానికి కారణమయ్యాయి. 'సంఘ్ మూడు రోజుల్లోనే మిలిటరీని సన్నద్ధం చేయగలదు. అదే ఆర్మీకి అయితే 6-7 నెలలు పడుతుంది. ఇది మా సామర్థ్యం' అంటూ భగవత్ పేర్కొన్నారు.

తమ భయంకర అనుభవాలను 'మాస్క్ మీ టూ' అంటూ పంచుకుంటున్న ముస్లిం మహిళలు

- హజ్ యాత్రకు వెళ్లే మహిళలకు లైంగిక వేధింపులు
- తాకరాని చోట తాకి ఇబ్బందులు పెడతారంటున్న మహిళలు
- 'మాస్క్ మీ టూ' హ్యాష్ ట్యాగ్ ప్రారంభం



కైరో : ప్రపంచవ్యాప్తంగా ముస్లింలకు ఉండే ఏకైక కోరిక తమ జీవితకాలంలో ఒక్కసారైనా ఇస్లాంలో ఆఖరి పిల్లర్‌గా చెప్పుకునే హజ్ యాత్ర చేసి రావాలని. ప్రతి సంవత్సరమూ సౌదీ అరేబియాలోని పవిత్ర మక్కాకు లక్షలాది మంది ముస్లిం స్త్రీ పురుషులు వస్తుంటారు. మహమ్మద్ ప్రవక్త పుట్టిన ప్రాంతమైన హజ్‌కు వచ్చి తమ పాపాలను కడుక్కోవాలని భావిస్తుంటారు. అయితే, ఇక్కడికి వచ్చే మహిళలకు అత్యంత భయానక అనుభవాలు ఎదురవుతుంటాయి. పవిత్ర యాత్రకు వచ్చిన వారికి లైంగిక వేధింపులు ఎదురవుతున్నాయి. మక్కాకు, ఇతర మత ప్రాముఖ్యత ఉన్న ప్రదేశాలను సందర్శించే వేళ, తమకు ఎదురవుతున్న అనుభవాలపై మహిళలు ఇప్పుడు గొంతెత్తారు. 'మాస్క్ మీ టూ' అనే హ్యాష్‌ట్యాగ్‌ను తగిలిస్తూ, ఈజిప్షియన్ అమెరికన్ జర్నలిస్టు మోనా ఎల్తావే సామాజిక మాధ్యమాల ద్వారా ఈ హ్యాష్‌ట్యాగ్‌ను ప్రారంభించగా, వేలాది మంది ముస్లిం మహిళలు ఇప్పుడు తమకు ఎదురైన చేదు అనుభవాలను పంచుకుంటున్నారు. తాను 15 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు 1982లో హజ్ యాత్రకు వెళ్లిన వేళ అత్యాచారానికి గురయ్యానని, ఈ విషయాన్ని 2013లో ఓ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పానని మోనా తెలియజేశారు. ఇప్పటికైనా మహిళలు తమ మౌనాన్ని వదిలి బయటకు రావాలని, తమకు ఎదురైన అనుభవాలను చెప్పాలని కోరారు. మక్కాలో యాత్రకు వచ్చేవారిలో పురుషుల సంఖ్య అధికమని, వారు ప్రతి మహిళనూ తమ సొంత సొత్తుగానే భావిస్తుంటారని ఆరోపించారు. జన సంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లోనే లైంగిక వేధింపులు అధికమని, తాకరాని చోట తాకడం, అత్యాచారం చేయడం వంటి ఘటనలు కూడా జరిగాయని ఆరోపిస్తూ పలువురు హ్యాష్‌ట్యాగ్‌ను ఫాలో అవుతున్నారు.

మోడీ వ్యాఖ్యలపై మరోసారి విరుచుకుపడ్డ రేణుకా చౌదరి



న్యూఢిల్లీ : రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి నవ్వు పట్ల ప్రధాని నరేంద్ర మోడీ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఆయన వ్యాఖ్యలపై రేణుకతో పాటు పలువురు నేతలు విమర్శలు గుప్పించారు. తాజాగా, రేణుక మరోసారి విరుచుకుపడ్డారు. ఎలా నవ్వాలి, ఎప్పుడు నవ్వాలి అనేది తనకు ఎవరూ చెప్పాల్సిన అవసరం లేదని ఆమె అన్నారు. అసలు నవ్వేందుకు తనకు ఎవరి అనుమతీ అవసరం లేదని చెప్పారు. నవ్వుపై జీఎస్టీ కూడా లేదని అంటూ ఎద్దేవా చేశారు. ఐదు దఫాలుగా తాను రాజ్యసభ ఎంపీగా కొనసాగుతున్నానని, అలాంటి తనను మోడీ ఒక నెగటివ్ పాత్రతో పోల్చడం అత్యంత దారుణమని మండిపడ్డారు. మహిళల పట్ల మోడీకి ఉన్న దృక్పథాన్ని ఆయన వ్యాఖ్యలు తేటతెల్లం చేస్తున్నాయని అన్నారు.

నరదిష్టిని అడ్డుకుంటున్న సన్నీ లియోన్



నెల్లూరు : నరదిష్టి.. ఇది చాలా డేంజర్ అనేది చాలా మంది నమ్మకం. నరదిష్టికి నల్లరాయి కూడా మాడి మసైపోతుందని చెబుతారు. ఇక ఇటువంటి వాటిని తాము ఏమాత్రం నమ్మబోమని చెప్పే వారు కూడా ఇళ్లలో దిష్టి యంత్రాలు పెడుతుంటారు. ఇప్పుడు ఈఉపోద్ఘాతమంతా ఎందుకంటే... నరదిష్టి నుంచి తమ పంటలను కాపాడుకోవడానికి రైతులు వినూత్నంగా ఆలోచించారు. బాలీవుడ్ శృంగార తార సన్నీ లియోన్ ఫోటోలను పొలం వద్ద ఏర్పాటు చేసి దారినపోయే వారి దృష్టిని అటు వైపు మరల్చారు. శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా దుత్తలూరు మండలం బండకిందపల్లి, బ్రహ్మేశ్వరం గ్రామాల రైతులు బెండ, క్యాబేజీ, కాలీఫ్లవర్ వంటి పంటలను సాగు చేస్తున్నారు. మొక్కలు పచ్చగా ఎదిగి ఆకర్షణీయంగా ఉండడంతో దారిన పోయే వారు అటు వైపు చూడకుండా ఉండలేకపోతున్నారు. బాటసారుల దృష్టి మొత్తం తమ పంటలపైనే ఉండడంతో దిగుబడి తగ్గిపోతుందని ఆందోళన చెందిన రైతులు వారి దృష్టిని పంటల మీది నుంచి మళ్లించేందుకు పొలం గట్లపై సన్నీ లియోన్ అర్ధనగ్న బ్యానర్లను ఏర్పాటు చేశారు. వారు అక్కడితో ఆగిపోలేదు. 'ఒరేయ్, నన్ను చూసి ఏడవకురా' అని కింద స్లోగన్ కూడా రాయించారు. ఇప్పుడీ బ్యానర్లు హాట్ టాపిక్ అయ్యాయి. మిగతా రైతులు కూడా ఇదే పద్ధతిని అనుసరిస్తున్నారు. ఎవరో ఈ ఫోటోలను సోషల్ మీడియాలో పెట్టడంతో ఈ వార్త వైరల్ అయింది.

అది స్టంట్ కాదు... నన్ను చంపేందుకు వేసిన స్కెచ్

- హాలీవుడ్ నటి ఉమ థర్మన్ ఆరోపణ
- 'కిల్ బిల్' చిత్రీకరణ సందర్భంగా యాక్సిడెంట్
- ఆ యాక్సిడెంట్‌ను హార్వీ వెయిన్‌స్టీన్ చేయించాడన్న ఉమ థర్మన్
- తన జీవితంలో జరిగిన అతి పెద్ద తప్పు అన్న దర్శకుడు క్వెంటిన్

లాస్ ఏంజెలిస్ : క్వెంటిన్ టరంటీనో దర్శకత్వంలో తాను నటించిన 'కిల్ బిల్' (2003) సినిమా షూటింగ్ సందర్భంగా స్టంట్ పేరుతో హార్వే వెయిన్‌స్టీన్ తనను చంపేందుకు స్కెచ్ వేశాడని ప్రముఖ హాలీవుడ్ నటి ఉమ థర్మన్ ఆరోపించింది. 'మీటూ' ఉద్యమంలో భాగంగా హార్వీ వెయిన్‌స్టీన్ తనను కూడా లైంగికంగా వేధించాడని చెప్పిన ఉమ థర్మన్ ఆ తరువాత జరిగిన హత్యా యత్నం గురించి వెల్లడించింది. స్టంట్ షాట్‌లో భాగంగా అడవిలో ఉన్న ఒక రోడ్ మీద వేగంగా కారు నడుపుతూ వెళ్లాలని, గంటకు అరవై కిలో మీటర్ల వేగంతో కారు నడుపుతూ చెట్ల మధ్యలో నుంచి దూసుకువెళుతున్న తాను సడెన్‌గా వచ్చిన మలుపును చూసి కారును కంట్రోల్ చేయలేక ఆ పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీ కొట్టానని గుర్తు చేసుకుంది. ఈ ప్రమాదంలో తన రెండు మోకాళ్లకు తీవ్రంగా గాయాలయ్యాయని చెప్పింది. ఉదర భాగానికి స్టీరింగ్ గట్టిగా ఢీ కొట్టడంతో ప్రాణం పోయిందని భావించానని తెలిపింది. అయితే, అదృష్టవశాత్తు బతికి బట్టకట్టానని పేర్కొంది. అయితే, ఈ యాక్సిడెంట్ జరిగి 15 ఏళ్లైనా ఆ గాయాలింకా తనను వేధిస్తున్నాయని చెప్పింది. తన యాక్సిడెంట్‌కు సంబంధించిన ఫుటేజ్ ఇవ్వమని కోరినా వెయిన్‌స్టీన్ వాటిని తనకు ఇవ్వలేదని ఆమె ఆరోపించింది. స్టంట్‌మేన్‌తో దానిని చేయించమని చెప్పినా దర్శకుడు ఒప్పుకోలేదని, దీనిని బట్టి తనను చంపడానికి వేసిన స్కెచ్‌గా దీనిని భావిస్తున్నానని ఆమె పేర్కొంది. ఈ క్రమంలో రోస్ మెక్‌గొవాన్ చొరవతో హార్వీ వెయిన్‌స్టీన్ వేధింపులు బయటకు వచ్చి, 'మీటూ' ఉద్యమం ప్రారంభం కావడంతో ఆమె తనపై జరిగిన వేధింపులు, హత్యా యత్నాన్ని బయటకు చెప్పగలిగింది. కాగా, దీనిపై ఆ సినిమా డైరెక్టర్ క్వెంటిన్ టరంటీనో మాట్లాడుతూ, తన జీవితంలో చేసిన అతిపెద్ద తప్పు ఆ స్టంట్ చిత్రీకరణేనని పేర్కొన్నాడు. ఆ రోడ్డు తిన్నగా ఉందని భావించానని, మలుపు ఉందని ఊహించలేదని చెప్పాడు. తన జీవితంలో చేసిన అతిపెద్ద తప్పు అదేనని చెబుతూ ఆమెకు క్షమాపణలు తెలిపాడు. ఆ నాటి యాక్సిడెంట్ విజువల్స్‌ను ఆమెకు స్వయంగా పంపాడు.



వివాదంలో సఫారీ బౌలర్

జొహానెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా ఆటగాడు ఇమ్రాన్ తాహిర్ వివాదంలో చిక్కుకున్నాడు. జొహానెస్‌బర్గ్‌లో భారత్-దక్షిణాఫ్రికా మధ్య నాలుగో వన్డేలో తాహిర్ అభిమానులపై మాటల యుద్ధానికి దిగాడు. ఇందుకు సంబంధించిన ఓ వీడియో ఇప్పుడు నెట్టింట్లో హల్‌చల్ చేస్తోంది. దీనిపై దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు కూడా విచారణ చేపట్టింది. అసలేం జరిగిందంటే.. భారత్-దక్షిణాఫ్రికా మధ్య శనివారం నాలుగో వన్డే జరిగిన సంగతి తెలిసిందే. ఈ వన్డేలో తుది పదకొండులో చోటు దక్కించుకోలేదు తాహిర్. మధ్యమధ్యలో ఆటగాళ్లకు డ్రింక్స్ అందజేస్తూ కనిపించాడు. ఈ నేపథ్యంలో తాహిర్ డ్రస్సింగ్ రూమ్‌లోకి వెళ్తున్న క్రమంలో ఓ అభిమాని తాహిర్‌ను అసభ్యపదజాలంతో దూషించాడు. అది విన్న తాహిర్ సదరు అభిమానితో ఘర్షణకు దిగాడు. ఇంతలో భద్రతా సిబ్బంది కలగజేసుకుని తాహిర్‌ను అక్కడి నుంచి పంపించి వేశారు. అనంతరం క్రికెటర్‌తో గొడవపడిన అభిమానిని స్టేడియం నుంచి బయటికి పంపారు. తాహిర్-అభిమాని ఘర్షణ పడుతుండగా పక్కన ఉన్న వారు ఎవరో ఆ తతంగాన్ని వీడియో తీశారు. ఇప్పుడు ఈ వీడియో నెట్టింట్లో చక్కర్లు కొడుతోంది.





ఫైబర్‌నెట్ ద్వారా ప్రజలకు నాణ్యమైన సేవలు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్

అమరావతి, సూర్య బ్యూరో : రాష్ట్రంలో ఏపీ ఫైబర్‌నెట్ ద్వారా ఇంటింటికీ 149 రూ.లకే టివి, ఇంటర్నెట్ సేవలు పూర్తి నాణ్యతతో అందించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ ఆదేశించారు. ఏపిఫైబర్ నెట్ (భారత్ నెట్ ఫేజ్-2) అమలుపై భారత్ బ్రాడ్ బ్యాండ్ నెట్‌వర్క్ లిమిటెడ్ సిఎండి సంజయ్ సింగ్‌తో కలిసి సోమవారం వెలగపూడి సచివాలయంలోని ఆయన కార్యాలయంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశంలో సీఎస్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంలో ఎంతమాత్రం రాజీ పడవద్దని స్పష్టం చేశారు. అలాగే రాష్ట్రంలో త్వరితగతిన ఫైబర్‌నెట్ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు నిర్దేశిత గడువులోగా ఈప్రాజెక్టు పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు వీలుగా మూడు నాలుగు జిల్లాలకు ఒక ఏజెన్సీకు పనులు అప్పగించి నిర్దేశిత గడువు ప్రకారం పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవలాని ఏపీ ఫైబర్ నెట్ అధికారులను సిఎస్ ఆదేశించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ సిఇఓ బాబు ఏపీ ఫైబర్ నెట్ ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తూ భారత్ నెట్ ఫేజ్-2కు సంబంధించి ఇది మొట్టమొదటి రాష్ట్రస్థాయి ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశమని రూ. 861కోట్లతో చేపట్టిన ఆప్రాజెక్టును 2019 మార్చి నెలాఖరుకు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ఈనెల 18లోగా సర్వే ప్రక్రియను పూర్తి చేయనున్నట్టు వివరించారు. ఈ సమావేశంలో భారత్ బ్రాడ్ బ్యాండ్ నెట్‌వర్క్ లిమిటెడ్ సిఎండి సంజయ్ సింగ్, ఐటి శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, ఆశాఖ కార్యదర్శి విజయానంద్, బిఎస్ఎన్ఎల్ సిజిఎం ఎపి రావు, బిఎస్ఎన్ఎల్ జియం రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

నాగర్‌కోటికి భారీ నజరానా



జైపూర్: ఐసీసీ అండర్-19 ప్రపంచకప్ గెలుచుకున్న భారత జట్టులో సభ్యుడైన నాగర్‌కోటికి రాజస్థాన్ ప్రభుత్వం తాజాగా రూ.25లక్షల నజరానా ప్రకటించింది. సోమవారం రాజస్థాన్ ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వసుంధర రాజే బడ్జెట్ ప్రసంగంలో నాగర్‌కోటికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రూ.25లక్షల నజరానా అందజేస్తున్నట్లు ప్రకటించారు. గత నెల న్యూజిలాండ్ వేదికగా జరిగిన అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో భారత్.. ఆసీస్‌ను చిత్తు చేసి ట్రోఫీని కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. టోర్నీలో భారత్ విజయాల్లో నాగర్‌కోటి కీలక పాత్ర పోషించాడు. 140కి.మీ స్పీడుకు ఏమాత్రం తగ్గకుండా కళ్లు చెదిరే బంతులతో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను బెంబేలెత్తించాడు. ఈ యువ ఆటగాడు ఐపీఎల్‌లోనూ ఎక్కువ ధరే పలికాడు. రూ.3.2కోట్లు పెట్టి కోల్‌కతా నైట్‌రైడర్స్ నాగర్‌కోటిని సొంతం చేసుకుంది. ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులోని ఒక్కో ఆటగాడికి బీసీసీఐ నజరానా ప్రకటించిన విషయం తెలిసిందే.

కోహ్లీసేనకు భారీ సవాల్

- నేడు పోర్ట్ ఎలిజబెత్‌లో దక్షిణాఫ్రికాతో ఐదో వన్డే
- ఆతిథ్య జట్టుతో ఐదవ వన్డేలో చావో రేవో!
- మరొక్క మ్యాచ్ గెలిస్తే చాలు సిరీస్ సొంతం
- సెయింట్ జార్జ్ పార్క్‌లో భారత్‌కు మెరుగైన రికార్డులేదు



పోర్ట్ ఎలిజబెత్: అచ్చిరాని పోర్ట్ ఎలిజబెత్‌లో టీమిండియా మంగళవారమే ఐదో వన్డేలో దక్షిణాఫ్రికాతో తలపడనుంది. విజయం సాధిస్తే కోహ్లీసేన సఫారీ గడ్డపై సిరీస్ గెలిచిన భారత తొలి జట్టుగా చరిత్ర తిరగరాస్తుంది. లేదంటే ఆత్మవిశ్వాసంతో వుంజుకున్న ఆతిథ్య జట్టుతో ఐదవ వన్డేలో చావో రేవో తేల్చుకోవాల్సిన పరిస్థితి తప్పదు. ఆరు వన్డేల సిరీస్‌లో ప్రస్తుతం భారత్ 3-1తో ఆధిక్యంలో ఉంది. మరొక్క మ్యాచ్ గెలిస్తే చాలు సిరీస్ సొంతం అవుతుంది. టీమిండియా దర్బన్‌లో 6 వికెట్లు, సెంచూరియన్‌లో 9 వికెట్లు, కేప్‌టౌన్‌లో 124 పరుగుల తేడాతో విజయాలు సాధించింది. అయితే ఏబీడీ రాకతో వుంజుకున్న సఫారీలు జొహానెస్‌బర్గ్ మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో గెలుపు సొంతం చేసుకున్నారు. ఐదో మ్యాచ్ జరగనున్న సెయింట్ జార్జ్ పార్క్‌లో భారత్‌కు అంత మెరుగైన రికార్డేమీ లేదు. 1992 నుంచి ఇక్కడ జరిగిన ఐదు మ్యాచుల్లోనూ ఓటమి పాలైంది. ఒక్క పోరులోనూ 200 పైచిలుకు పరుగులు నమోదు చేయలేదు. ఇప్పటి వరకు జరిగిన నాలుగు వన్డేల్లో టీమిండియా సారథి విరాట్ కోహ్లీ (393 పరుగులు), ఓపెనర్ శిఖర్ ధావన్ (271) చెలరేగి ఆడారు. కోహ్లీ అయితే తన కెరీర్‌లో అత్యద్భుతమని చెప్పే ఇన్నింగ్స్ ఆడాడు. సిరీస్‌లో మిగతా బ్యాట్స్‌మెన్ అంతా చేసిన 239 కన్నా వీరిద్దరు కలిపి చేసిన పరుగులే మూడు రెట్లు అధికం. అయితే మరో ఓపెనర్ రోహిత్ శర్మ ఆటతీరు అందరినీ కలవరపెడుతోంది. బౌన్సీ, సీమ్ పిచ్‌లపై అతడి ఆట బాగాలేదు. ప్రతిసారీ రబాడ బౌలింగ్‌లోనే ఔటవుతున్నాడు. నాలుగో స్థానంలో ఆడుతున్న అజింక్య రహానె తొలి మ్యాచ్‌లో 79 పరుగులు చేసినా తర్వాత మ్యాచుల్లో 11, 8 మాత్రమే చేశాడు. ఒకదాంట్లో అవకాశం రాలేదు. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య సైతం ఆశించిన మేరకు రాణించడం లేదు. అటు బంతితో.. బ్యాటుతో సాధించిందేమీ లేదు. ధోనీ నాలుగో వన్డేలో కష్టపడి 42 నాటౌట్ (43 బంతుల్లో)గా నిలిచాడు. శ్రేయస్ అయ్యర్ కొత్త కుర్రాడన్న సంగతి తెలిసిందే. స్లో స్పిన్ వేయగల బ్యాట్స్‌మన్ కేదార్ జాదవ్ గాయపడడం కాస్త ఇబ్బందికరమే. ఐదో వన్డే జరగనున్న పోర్ట్ ఎలిజబెత్ స్పిన్నర్ల స్వర్గధామం. ఇక్కడ ఆతిథ్య జట్టు ఆడిన చివరి రెండు వన్డేల్లో స్పిన్నర్లే కీలకంగా నిలిచారు. 2017లో శ్రీలంకపై ఇమ్రాన్ తాహిర్ 26 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు. 2016 అక్టోబర్‌లో ఆస్ట్రేలియాపై షంషీ 3/36తో నిలిచాడు. మరో స్పిన్నర్ ఆరోన్ ఫంగిసో 2/17తో రాణించాడు. అంటే ఈ మ్యాచ్‌లోనూ భారత్‌కు స్పిన్నర్లే కీలకంగా మారే అవకాశం ఉంది. నాలుగో వన్డేలో కుల్‌దీప్, చాహల్ బౌలింగ్‌లో ఆతిథ్య బ్యాట్స్‌మెన్ ధారాళంగా పరుగులు సాధించినా ఈ మ్యాచ్‌ను వారే మలుపు తిప్పగలరు! గత మ్యాచ్‌లో విరామాలతో లయ దెబ్బ తినడం, పిచ్, ఔట్ ఫీల్డ్ తడిసిపోవడం మణికట్టు ద్వయానికి కలిసిరాలేదు. సారథి కోహ్లీ, జట్టు మేనేజ్‌మెంట్ వారిపై విశ్వాసం ఉంచింది. ఇక పోర్ట్ ఎలిజబెత్‌లో ఆడిన ఐదు మ్యాచుల్లో భారత్ సాధించిన అత్యధిక పరుగులు 176. దక్షిణాఫ్రికాపై 2001లో ఆ పరుగులు సాధించింది. ఇక్కడే కెన్యాపైనా ఓడిపోవడం గమనార్హం. ఆతిథ్య జట్టు ఇక్కడ 32 మ్యాచ్‌లు ఆడగా 11 మాత్రమే ఓడిపోయింది. అయితే గత అనుభవాలను పట్టించుకోకుండా విశ్వాసంతో అద్భుత ప్రదర్శనలు చేస్తే విజయం కోహ్లీసేన వశం కాగలదు! వైవిధ్యంగా స్పిన్ బౌలింగ్ వేయగల కేదార్ జాదవ్ జట్టులో ఉంటే స్పిన్ దళానికి మరింత బలం చేకూరేది. ఇప్పుడు శ్రేయస్ అయ్యరే మిగిలిన వనరు.

జట్లు:

భారత్: విరాట్ కోహ్లీ (సారథి), శిఖర్ ధావన్, రోహిత్ శర్మ, అజింక్య రహానె, శ్రేయస్ అయ్యర్, మనీశ్ పాండే, దినేశ్ కార్తీక్, కేదార్ జాదవ్, ఎంఎస్ ధోనీ, హార్దిక్ పాండ్య, యజువేంద్ర చాహల్, కుల్‌దీప్ యాదవ్, అక్షర్ పటేల్, భువనేశ్వర్ కుమార్, జస్ప్రీత్ బుమ్రా, షమి, శార్దూల్ ఠాకూర్

దక్షిణాఫ్రికా: అయిడెన్ మార్క్రమ్ (సారథి), హషీమ్ ఆమ్లా, జేపీ డుమిని, ఇమ్రాన్ తాహిర్, డేవిడ్ మిల్లర్, మోర్నీ మోర్కెల్, క్రిస్ మోరిస్, లుంగి ఎంగిడి, అండిలే ఫెలుక్‌వాయో, రబాడ, తబ్రైజ్ షంషీ, జొండొ, ఫర్హాన్ బెహార్డీన్, హెన్రిచ్ క్లాసెన్, ఏబీ డివిలియర్స్

మరో ఓటమి ఎదురుకానుందా?

భారత్‌తో జొహానెస్‌బర్గ్‌లో జరిగిన నాలుగో వన్డేలో సఫారీ జట్టుకు గులాబీ సెంటిమెంటు బాగా కలిసొచ్చింది. ఇప్పటి వరకు వీరు గులాబీ రంగు జెర్సీలు ధరించి ఆడిన ఏ ఒక్క వన్డే కూడా ఓడిపోలేదు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కోసం శనివారం భారత్‌తో జరిగిన నాలుగో వన్డేలో దక్షిణాఫ్రికా ఆటగాళ్లు గులాబీ రంగు జెర్సీలు ధరించి ఆడారు. ఈ మ్యాచ్‌లో మొదట భారత్ బ్యాటింగ్ సాగిన తీరు చూసిన వారందరూ గులాబీ సెంటిమెంటుకు బ్రేక్ పడుతుందనే అనుకున్నారు. భారత్ తిరుగులేని స్థితిలో ఉన్న సమయంలో మెరుపులు రావడం వల్ల మ్యాచ్‌ను కాసేపు నిలిపివేశారు. అనంతరం తిరిగి ఇన్నింగ్స్ ఆరంభించిన భారత ఆటగాళ్లు లయ కోల్పోయారు. ఆ తర్వాత దక్షిణాఫ్రికా స్కోరు 43/1 ఉన్న సమయంలో వర్షం కారణంగా గంటన్నర సేపు అంపైర్లు మరోసారి ఆటను నిలిపివేశారు. మ్యాచ్‌ను కుదించిన అంపైర్లు ఆ తర్వాత లక్ష్యాన్ని 28 ఓవర్లలో 202గా నిర్ణయించారు. బౌలర్లపై ఎదురుదాడికి దిగిన సఫారీ బ్యాట్స్‌మెన్లు ఇంకో 15 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించారు. మరోసారి ఇలాంటి సెంటిమెంటే కోహ్లీ సేనను వెంటాడుతోంది. అదేంటంటే.. భారత్-దక్షిణాఫ్రికా మధ్య ఐదో వన్డే మంగళవారం పోర్ట్ ఎలిజబెత్‌లోని సెయింట్ జార్జ్ మైదానంలో జరగనుంది. ఇప్పటి వరకు భారత్ ఇక్కడ నాలుగు వన్డేలు ఆడింది. దురదృష్టం ఏంటంటే ఈ నాలుగు వన్డేల్లో భారత్ ఒక్క విజయం కూడా నమోదు చేయలేకపోవడం. ఆశ్చర్యం కలిగించే మరో విషయం ఏమిటంటే.. ఈ నాలుగు వన్డేల్లో భారత్ 200 పరుగుల మార్కును కూడా అందుకోలేకపోవడం. అజారుద్దీన్ నాయకత్వంలోని టీమిండియా తొలిసారి ఈ మైదానంలో 1992లో మొదటి వన్డే ఆడింది. తొలుత బ్యాటింగ్ చేపట్టిన భారత్ 147 కుప్పకూలి 6 వికెట్ల తేడాతో ఓటమి చవిచూసింది. 1997లో సచిన్ నేతృత్వంలో ఆడిన భారత్ 179 పరుగులు మాత్రమే నమోదు చేసింది. అనంతరం బ్యాటింగ్ దిగిన దక్షిణాఫ్రికా 45.1ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. 2006లో వీరేంద్ర సెహ్వాగ్ సారథ్యంలో ఈ పిచ్‌పై భారత్ మూడో వన్డే ఆడింది. తొలుత బ్యాటింగ్ చేసిన సఫారీ జట్టు 243 పరుగులు నమోదు చేసింది. లక్ష్య ఛేదనలో భారత్ పూర్తిగా విఫలమైంది. 163 పరుగులకే కుప్పకూలింది. ఇక చివరి సారిగా మహేంద్ర సింగ్ ధోనీ నాయకత్వంలో 2011లో భారత్ ఈ మైదానంలో ఆడింది. అప్పుడు కూడా భారత్ 48 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది.

సుమారు ఎనిమిదేళ్ల తర్వాత ఇప్పుడు విరాట్ కోహ్లీ సారథ్యంలోని టీమిండియా ఇదే పిచ్‌పై ఐదో వన్డేకు సిద్ధమౌతోంది. మరి కోహ్లీ సేన ఈ పిచ్‌పై ఓటముల పరంపరకు బ్రేక్ వేస్తుందో.. లేక తడబాటును కొనసాగిస్తుందో తెలియాలంటే మ్యాచ్ అయ్యేంత వరకు వేచి ఉండాల్సిందే.

ఆలయాల్లో శివరాత్రి సందడి



శ్రీశైలంలో గజవాహనంపై శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి



వేములవాడలో శివరాత్రి ఏర్పాట్లు



నెల్లిమర్లలో...



పట్టిసీమలో...

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22,ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044-